సత్యం, సమర్థత, విశ్వసనీయత
WWW.SAKSHYAM.COM
# సాక్ష్యం
తెలుగు దినపత్రిక
సంపుటి: 17 | సంచిక: 160
పేజీలు: 08 | వెల: రూ.2:00
హైదరాబాద్ | ఆదివారం 07 జూన్ 2026
Published from Hyderabad, Vijayawada.

## మరోసారి పెరిగిన గ్యాస్ సిలిండర్ ధర..! 29 రూపాయలు పెంచుతూ నిర్ణయం



న్యూఢిల్లీ,జూన్6 : దేశవ్యాప్తంగా మరోసారి గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర పెరిగింది. సిలిండర్ ధర 29 రూపాయలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. మూడు నెలల వ్యవధిలో డొమెస్టిక్ సిలిండర్ ధర పెరగడం ఇది రెండోసారి. ఢిల్లీలో 14.2 కిలోల న్గ్రా+ సిలిండర్ ధర రూ.913 నుంచి రూ.942కు చేరింది. పెంచిన ధరలు నేటి నుంచి అమల్లోకి రానున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా మార్చి 7న గృహ వినియోగ న్గ్రా+ సిలిండర్ ధర రూ.60 పెంచారు.



## హైదరాబాద్ లో భారీ వర్షం

నగరంలో చల్లబడ్డ వాతావరణం
పలు ప్రాంతాల్లో ఆకస్మిక వర్షం

హైదరాబాద్,జూన్6(సాక్ష్యం): హైదరాబాద్ నగరంలో శనివారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం నుంచి ఉక్కపోతతో

మిగతా 2 లో..



## ప్రభుత్వ భూములను పెద్దలకు దోచిపెడుతున్న రేవంత్

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపణలు

హైదరాబాద్,జూన్6(సాక్ష్యం): రూ.లక్ష కోట్ల ప్రభుత్వ భూమిని రేవంత్ రెడ్డి సర్కార్ పెద్దలకు అప్పగిస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

మిగతా 2 లో..



## రెండున్నరేళ్లుగా తట్టెడు మట్టి తీయలేదు

ఇప్పుడేమో హడావిడి చేస్తే ఎలా నమ్మాలి
సీఎం తీరుపై మండిపడ్డ మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

మహబూబ్‌నగర్,జూన్6(సాక్ష్యం): రెండున్నరేళ్లయినా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో తట్టెడు మట్టి తీయలేదని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి విమర్శించారు. ఇప్పుడు పూర్తి చేస్తామని అంటే ఎలా నమ్ముతారని

మిగతా 2 లో..

# అభివృద్ధి ఆగదు

### అష్టదరిద్రులు అడ్డంపడ్డా అభివృద్ధి ఆగదు

- ఎవరెంత ఏడ్చినా.. ఆర్ఆర్ఆర్ నిర్మిస్తాం
- వ్యవసాయాన్ని పండగ చేయడమే మా లక్ష్యం
- రైతులకు వరి వేస్తే ఉరి అనే రోజులు పోయాయి
- కాళేశ్వరం లేకున్నా లక్ష టన్నుల ధాన్యం పండింది
- ఎక్కడ నీళ్లున్నా కాళేశ్వరం అంటూ నాడు ప్రచారం
- ధాన్యం కొనకుంటే ప్రధాని మోదీ సంగతి తేలుస్తాం
- అభివృద్ధి నిరోధకంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు
- కోహెడ పండ్ల మార్కెట్ శంకుస్థాపనలో సీఎం రేవంత్

**హైదరాబాద్ నగర సిగలో మరో మణిహారం రానుంది. ప్రతిష్ఠాత్మక రామోజీ ఫిలిం సిటీ సమీపంలో ఓఆర్ఆర్ పక్కన కోహెడలో అంతర్జాతీయ సమీకృత ఫ్రూట్ మార్కెట్ అనేది కొలువు దీరబోతుంది. ప్రపంచ స్థాయి నాణ్యత ప్రమాణాలతో కూడిన సాంకేతిక హంగులతో అంతర్జాతీయ మార్కెట్ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేస్తున్నారు. పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో మొత్తం 3387.35 కోట్ల రూపాయల వ్యయంతో ఈ ప్రాజెక్టు మూడేళ్ల కాల వ్యవధిలో అందుబాటులోకి రానుంది. తెలంగాణ రైజింగ్ విజన్-2047 అవసరాల దృష్ట్యా సమీకృత మార్కెట్ రూపకల్పన చేసినందున పండ్లు, పూలు, డెయిరీ, డ్రైఫ్రూట్స్, చేపలు, మాంసం లాంటి మార్కెట్‌లు రాబోతున్నాయి. దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రెటెడ్ ఫ్రూట్ మార్కెట్‌కు తెలంగాణ కేరాఫ్ అడ్రస్ కోహెడ కానుంది.**

రంగారెడ్డి,జూన్6(సాక్ష్యం): రంగారెడ్డి జిల్లాలోని కోహెడలో నిర్మించనున్న సమీకృత పండ్ల మార్కెట్ మనకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకొస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. స్థానికంగా పండ్ల మార్కెట్‌తో పాటు ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కాంప్లెక్స్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. నగరంలోని పండ్ల మార్కెట్‌ను కోహెడకు తరలించినప్పుడు తాత్కాలిక టెంట్లు వేశారు. గాలివాన వచ్చినప్పుడు రైతులకు గాయాలయ్యాయి. ఇంటిగ్రేటెడ్ పండ్ల మార్కెట్ నిర్మిస్తానని నాడు ఎంపీగా ఉన్నప్పుడు హామీ ఇచ్చాను. పండ్లు, కూరగాయలు అన్నీ లభించేలా ఈ మార్కెట్‌ను నిర్మిస్తున్నాం అన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. తాగేందుకు నీళ్లు ఉండవు.. కూర్చునేందుకు స్థలం ఉ ండదు. అందుకే అన్ని వసతులతో కూడిన ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులు నిర్మిస్తున్నాం. అంతర్జాతీయ సదుపాయాలు కల్పించుకుంటేనే.. మనది అంతర్జాతీయ నగరం అవుతుంది. ఎవరెంత ఏడ్చినా.. ఆర్ఆర్ఆర్ ఆగదు. అభివృద్ధి కూడా ఆగదు. వ్యవసాయం దండగ కాదు.. పండగ అని నిరూపిస్తున్నాం. కాళేశ్వరం కూలేశ్వరం అయినా..

మిగతా 2 లో..





## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

- ఇదే తమ మొదటి డిమాండ్.. కొనసాగిస్తాం కూడా
- ప్రవేశ పరీక్షల అవతవకలకు బాధ్య వహించాల్సిందే
- కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే
- జంతర్ మంతర్ వద్ద ధర్నా.. పాల్గొన్న వాంగ్‌చుక్

న్యూఢిల్లీ,జూన్6(సాక్ష్యం): నీట్ తదితర ప్రవేశ పరీక్షలు, రిక్రూట్మెంట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను పరిష్కరించేందుకు ప్రస్తుత విద్యా వ్యవస్థను సంస్కరించాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసింది. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ శనివారంనాడు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించింది. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈ నిరసనలకు నాయకత్వం వహించగా, ప్రముఖ విద్యావేత్త, యాక్టివిస్ట్ సోనమ్ వాంగ్‌చుక్, పార్టీ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో

మిగతా 5 లో..

## నీట్ రీ ఎగ్జామ్ పేపర్ లీక్ పుకార్లు

- దుష్ప్రచారాలపై మండిపడ్డ ఎన్‌టిఎ
- కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

న్యూఢిల్లీ,జూన్6(సాక్ష్యం): నీట్ - యూజీ రీ-ఎగ్జామ్ పేపర్ సైతం లీక్ అయిందంటూ వస్తోన్న ఆరోపణల్ని ఎన్‌టీఏ ఖండించింది. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ఈ దుష్ప్రచారం అవాస్తవం, మోసపూరితమని



పేర్కొంది. తప్పుడు ప్రచారం వ్యాప్తి చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ 'ఎక్స్' వేదికగా ఓ పోస్టు పెట్టింది. విద్యార్థులు, తల్లిదండ్రులను తప్పుదారి పట్టించే లక్ష్యంతోనే ప్రశ్నపత్రం లీక్, అడ్వాన్స్ యాక్సెస్ లేదా విక్రయం జరిగిందంటూ కొందరు దుష్ప్రచారం చేస్తున్నట్లు తాము గుర్తించినట్లు ఎన్‌టీఏ పేర్కొంది. ఈ ÷-లకెయిమ్‌లన్నీ పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేసింది. నీట్‌ను పారదర్శకంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొంది. అభ్యంతరకర ఛానళ్లు, ఖాతాల్లో

మిగతా 5 లో..




## హిట్లర్ నాకు ఇన్స్‌పిరేషన్..

- హిట్లర్ కోర్ టీమ్ గా 'హైడ్రా'
- దేశమంతా ఆసక్తిగా చూస్తోంది
- జలవనరులను కాపాడేందుకే హైడ్రా ఏర్పాటు
- డ్రగ్స్ నివారణకు ఈగిల్ ఫోర్టస్ ఏర్పాటు చేశాం
- హైడ్రా, ఈగల్ ఫోర్స్‌పై సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు
- వైట్ కాలర్ జాబ్స్‌కు బ్లూకలర్ జాబ్స్ ప్రత్యామ్నాయం
- పరిస్తితులకు అనుగుణంగా యువత్ స్కిల్ అలవర్చుకోవాలి

హైదరాబాద్,జూన్6(సాక్ష్యం): ఉపాధి విషయంలో.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యువత ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయా రంగాల్లో స్కిల్స్ పెంచుకుంటే అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. ఏఐ కారణంగా వైట్ కాలర్ జాబ్‌లు పోతున్నాయని అందరూ ఆందోళన చెందుతున్నారు. వైట్ కాలర్ జాబ్‌లకు ప్రత్యామ్నాయం బ్లూ కాలర్ జాబ్స్. యువతరం వాటిపై దృష్టి సారించాలి. అందుకు అవసరమైన స్కిల్స్ పెంచుకోవాలని సీఎం తెలిపారు. జలవనరుల కబ్జాను అడ్డుకునేందుకే హైడ్రాను ఏర్పాటు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నేడు ఎవరైనా చెరువులు, కుంటల వంటివాటి జోలికి వెళ్లాలంటే భయపడుతున్నారని చెప్పారు. బెంగళూరులో ఓ సదస్సులో

మిగతా 2 లో..

## ఇంధన దిగుమతులపై సమాలోచనలు

- పశ్చిమాసియా ఘర్షణల నేపథ్యం
- ఆర్థిక సలహా మండలితో ప్రధాని భేటీ
- దేశ ఆర్థిక వృద్ధి బలోపేతంపై చర్చ

న్యూఢిల్లీ,జూన్6(సాక్ష్యం): పశ్చిమాసియా ఘర్షణల నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ కీలక భేటీకి అధ్యక్షత వహించారు. శనివారం పీఎం-ఆర్థిక సలహా మండలితో సమావేశయ్యారు. యుద్ధం ముగింపుపై అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో యుద్ధ ప్రభావాన్ని తగ్గించే చర్యలపై చర్చించినట్లు సమాచారం. ఆర్థికవృద్ధిని బలోపేతం చేయడం, బయటి నుంచి వచ్చే ఒడుదొడుకులను తట్టుకునే సామర్థ్యాన్ని పెంచడం, వ్యాపారాలకు మరింత అనువైన వాతావరణాన్ని కల్పించేలా సంస్కరణలు వేగవంతం



మిగతా 5 లో..

## పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

- ఇరాన్ డ్రోన్లను కూల్చిన అమెరికా సైన్యం
- హోర్ముజ్ జలసంధి వద్ద మళ్లీ ఉద్రిక్తతలు

టెహ్రాన్,జూన్6(సాక్ష్యం): పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మళ్లీ ముసురుతున్నాయి. హోర్ముజ్ జలసంధి లక్ష్యంగా ఇరాన్ ప్రయోగించిన నాలుగు డ్రోన్లను అమెరికా సైన్యం కూల్చివేసింది. దీనికి ప్రతీకారంగా, ఇరాన్ తీరప్రాంతంలోని నిఘా రాడార్ కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులకు దిగింది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది.



హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు

మిగతా 5 లో..

## మహిళల భద్రతకు కీలక అడుగు

- గిగ్ వర్కర్లుగా మహిళలు
- స్త్రీ రైడ్ ప్రోగ్రామ్ కింద 55మందికి శిక్షణ
- 'స్త్రీ రైడ్' ప్రాజెక్టును ప్రారంభించిన డీజీపీ



హైదరాబాద్,జూన్6(సాక్ష్యం): గిగ్ వర్కర్లలో ఇప్పుడు మహిళలు కూడా చేరబోతున్నారని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో స్త్రీ రైడ్స్‌ను తీసుకొచ్చామని పేర్కొన్నారు. 55 మంది మహిళలకు డ్రైవింగ్ నేర్పించి, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని చెప్పుకొచ్చారు. మహిళల ఆర్థిక స్వావలంబన, ఆత్మవిశ్వాసం, సమాజంలో వారి భద్రతను పెంపొందించడమే ధ్యేయంగా తెలంగాణ పోలీస్ శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విమెన్ సేఫ్టీ వింగ్, రాష్ట్ర రవాణా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన 'స్త్రీ రైడ్' ప్రాజెక్టును హైదరాబాద్‌లో డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు. మహిళలు రవాణా, డెలివరీ రంగాల్లో స్వయం ఉపాధి సాధించేలా ప్రోత్సహించేందుకు ఈ-బైక్స్, ఈ-ఆటోలను ఆయన జెండా ఊపి

మిగతా 5 లో..

## బొల్లాకు 14 రోజుల రిమాండ్

చంచల్‌గూడ జైలుకు తరలించిన పోలీసులు

హైదరాబాద్,జూన్6(సాక్ష్యం): గండిపేట భూకబ్జా కేసులో అరెస్టైన వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు ఉప్పరపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఆయనను చంచల్‌గూడా జైలుకు తరలించారు. ఈ కేసు తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, భూకబ్జా కేసులో నిందితుడిగా ఉన్న బొల్లా బ్రహ్మనాయుడిని సైబరాబాద్ పోలీసులు తమిళనాడులోని కాంచీపురంలో అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనను రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్‌కు తీసుకువచ్చి నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో భాగంగా స్టేట్‌మెంట్ నమోదు చేసిన అధికారులు,

మిగతా 2 లో..

# సంపాదకీయం

## ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట ఏదీ?

ఆర్థిక కుంభకోణాలు, మోసాలను పసిగట్టలేక పోతున్నారు. దేశంలో ఎవరు ఎలా దోచేస్తున్నారో గుర్తించడం లేదు. అధికారంలో ఉన్నవారిది ఒక ర కమైన దోపిడీ, ఆర్థికంగా ఉన్నవారిది మరో రకమైన దోపిడీ అన్నట్లుగా కాలం నడుస్తోంది. అధికారంలో ఉండి ఆర్థిక మోసాలకు పాల్పడ్డ వారిని ఏమీ చేయడం లేదు. వారు అక్రమాలకు పాల్పడ్డట్లు రుజువులున్నా బోను ఎక్కించడం లేదు. తమ అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇష్టారాజ్యంగా చేస్తున్న పనులపై నిఘా లేకుండా పోయింది. అజమాయిషీ లేదు. విచారణలు లేవు. తెలంగాణలో కాళేశ్వరం కథ కంచికి చేరింది. లక్షకోట్లు పెట్టి ఓ ప్రాజెక్ట్ కడితే అందులో అవతవకలు, ఆర్థిక మోసాలు జరిగాయన్న వారే దానిపై విచారణ జరిపించడం లేదు. ఇ- కార్ రేసులో నేరుగా విదేశీ సంస్థకు డబ్బులు చెల్లించినా కిమ్మనడం లేదు. ఎపిలో రుషికొండపై జగన్ ప్యాలెస్‌లు కట్టుకుంటే చర్యలు లేవు. మద్యం కుంభకోణానికి పాల్పడితే దిక్కులేదు. భూకుంభకోణ్యాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికే దేశంలో అనేక ఆర్థిక మోసాలు జరిగాయి. విజయ్ మాల్యా, నీరవ్ మోడీ, లలిత్ మోడీ వంటివారు దేశం బయటనే ఉన్నారు. వారిపై ఎలాంటి చర్యలు లేవు. దేశంలో కొందరు బ్యాంకులకు ఎగనామం వేస్తున్నా పట్టింపు లేదు. ఇవన్నీ కూడా ఇతరకుల ఆదర్శంగా నిలుస్తున్నాయని భావించాలి. తాజాగా రాజేష్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్ (ఆర్ఇఎల్) భారీ ఆర్థిక అరాచకం దేశంలోనే కాదు అంతర్జాతీయ కార్పొరేట్ రంగాన్ని షేక్ చేస్తోంది. ఇలాంటి వారు మోసం చేస్తున్నా..గుర్తించలేక పోయారు. ఎల్ఐసి లాంటి సంస్థ ఇందులో పెట్టుబడులు పెట్టి ఇప్పుడు భారీగా నష్టపోయింది. ఆర్థిక మోసాలను ఎంత చాకచక్యంగా చక్కబెట్టవచ్చో 'లక్కీ భాస్కర్' మూవీలో చూపించారు. 1980లనాటి షేర్ల స్కామ్ కింగ్ పిన్ బిగ్‌బుల్ హర్షద్ మెహతా షేర్ మార్కెట్‌ను ఎలా మోసం చేశడో గుర్తుండే ఉంటుంది. వ్యవస్థలోని లొసుగులను తమకు అనుకూలంగా మార్చుకొంటున్న పలువురు భారీ అక్రమాలకు బరితెగిస్తున్నారు. వారి చేతుల్లో ఎంతోమంది అమాయకులు మోసపోతున్నారు. సహారా ఇండియా, అగ్రిగోల్డ్, లీఫిన్ ఇండియా లాంటి సంస్థలు కూడా ఎంతగా మోసం చేశాయో చూసాం. ఇటీవల నల్లగొండ, కర్నూలు జిల్లాలో మైక్రో ఫైనాన్స్ మోసం బయటపడింది. అయినా ప్రభుత్వాలు కళ్లు తెరవడం లేదు. కఠిన నిర్ణయాలు తీసుకోవడం లేదు. చిట్టీల పేరుతో గ్రామాలు మొదలు పట్టణ్యాల వరకు కోట్లల్లో మోసలు చేస్తూనే ఉన్నారు. తాజాగా బెంగళూరుకు చెందిన ప్రముఖ బంగారం, ఆభరణాల దిగ్గజం ఆర్ఇఎల్ తన వాస్తవ ఆదాయాన్ని రూ.15.15 లక్షల కోట్లు అధికంగా చూపించి, తన షేర్ వాల్యూను భారీగా పెంచుకొని, మదుపరులను, అలాగే ప్రభుత్వ వ్యవస్థలను మోసగించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని సెక్యూర్టీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా సెబి విచారిస్తే తప్ప వెలుగులోకి రాలేదు. ఆర్ఇఎల్ స్కాం దేశ కార్పొరేట్ చరిత్రలో అతిపెద్ద కుంభకోణంగా చెబుతున్నారు. ఇలాంటి స్కామే 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సత్యం కంపెనీలో జరిగింది. రూ.7,800 కోట్ల మేర కంపెనీ బ్యాలెన్స్‌షీట్‌లో తేడా వచ్చింది. ఎక్కువ ఆదాయం చూపించి సత్యం కంపెనీ షేర్ విలువను పెంచుకుందని ఆరోపణలొచ్చాయి. ఈ కేసులో సత్యం కంపెనీ అధినేత రామలింగరాజుకు ఏడేళ్ల జైలు శిక్ష పడింది. అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ అదానీ కంపెనీ ఆర్థిక మోసాలను ఆధారాలతో సహా 2003 జనవరిలో బయటపెట్టడం పెను సంచలనం అయింది. ఆదానీ గ్రూపు తమ షేర్ విలువను పెంచుకునేందుకు గ్రూపు ఆదాయాన్ని అధికంగా చూపించడంతోపాటు పలు ఆర్థిక అవకతవకలకు పాల్పడిందన్నది ప్రధాన అభియోగం. దాంతో అదానీ ఆర్థిక సామ్రాజ్యం రూ.లక్షల కోట్ల మేర పతనమైంది. తూతూ మంత్రంగా సెబి దర్యాప్తు సాగింది. చివరికి అదానీ గ్రూపుపై 'హిండెన్‌బర్గ్'వి ఆధారాల్లేని ఆరోపణలుగా కొట్టిపారేసింది. ఉదారవాద ఆర్థిక విధానాలే ఆర్థిక స్కాంలకు మూలం. ఓ సామాన్యుడు సెబీకి లేఖ రాయడం, అది విచరణ చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆర్ఇఎల్ కంపెనీ ప్రమోటర్, ప్రస్తుత ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అయిన రాజేష్ మెహతాను సెక్యూర్టీస్ మార్కెట్ నుంచి తాత్కాలికంగా నిషేధించింది. ఆర్ఇఎల్ అక్రమాలను కేంద్ర ప్రభుత్వ సంస్థలుకానీ, నిఘా విభాగాలు కానీ గుర్తించలేకపోవడం వ్యవస్థీకృతంగా ఉన్న జాడ్యంగా చూడాలి. ఒక సాధారణ ఇన్వెస్టర్ 2025లో ఇ-మెయిల్‌లో చేసిన ఫిర్యాదుతో తీగ లాగితే డొంక కదిలింది. సెబి రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టినా, కంపెనీకి సంబంధించిన ఆడిట్ రిపోర్టులను చూపించమని పలు మార్లు నోటీసులిచ్చినా ఆర్ఇఎల్ యాజమాన్యం సహకరించలేదు. అందుకే సెబి ఆ సంస్థ స్కాంపై నివేదిక వెల్లడించాల్సి వచ్చింది. రార్పొరేట్ స్కాంలన్నింటిలో దండలో దారంలో కనిపించేది విదేశాల్లో ఆ సంస్థలు ఏర్పాటు చేసే అనుబంధ షెల్, సూట్‌కేస్ కంపెనీలు, వాటి ద్వారా ఈ దేశంలో అక్రమాలు. ఆర్ఇఎల్ కూడా అదే చేసింది. సిట్జర్లాండ్ నుంచి కథ నడిపించింది. ప్రపంచంలోనే అతిపెద్ద గోల్డ్ రిఫయినరీ 'వాల్కంబీ'ని 2015లో కొనుగోలు చేసింది. సంస్థ ఆదాయాన్ని రూ.వందల కోట్లను వేలు లక్షల కోట్లుగా తప్పుడు పద్ధతుల్లో చూపించింది. సంస్థ సి.ఎం.డి. రాజేష్ మెహతా తన వ్యక్తిగత ఖాతాలకు సంస్థ నిధులను భారీగా నిబంధనలకు విరుద్ధంగా మళ్లించారు. సంస్థలో కీలక స్థానాల్లో ఉన్న మరి కొంత మంది సైతం ఇదే పని చేశారు. ఈ కఠోర విషయాలను సెబినే వెల్లడించింది. కంపెనీ కార్పొరేట్ గవర్నెన్స్ లోపభూయిష్టంగా ఉందని ఇప్పుడు గుర్తించడం ప్రభుత్వ వ్యవస్థల పనితీరులో డొల్లతనానికి నిదర్శనం. ఇలాంటివి ఇంకా ఎన్ని జరుగుతున్నాయో తెలియదు. బయటపడితే తప్ప తెలుసుకోలేం. ప్రజలు అనేక విధాలుగా ఇప్పుడు మోసపోతున్నారు. ఈ క్రమంలో పకడ్బందీ చర్యలతో ఆర్థిక మోసాలకు కళ్లెం వేయాలి. కేవలం సైబర్ మోసాలే కాకుండా ఇలాంటి బడా మోసాలపైనా దృష్టి సారించాలి.

## రెండున్నరేళ్లుగా తట్టెడు మట్టి తీయలేదు

మొదటిపేజీ తరువాయి..

అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాదయాత్ర చేస్తానని అంటేనే కాంగ్రెస్ ప్రభుత్వం కదిలిందని అన్నారు. ఇప్పుడు అకస్మా?త్తుగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై కాంగ్రెస్ సర్కార్‌కు ప్రేమ పుట్టిందని అన్నారు. కాంగ్రెస్ సర్కార్ రెండున్నరేళ్ల పాటు పాలమూరు-రంగారెడ్డిని పడావు పెట్టిందని మండిపడ్డారు. మహబూబ్‌నగర్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్ రెడ్డితో కలిసి లక్ష్మారెడ్డి విలేఖరులతో మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డికి రేవంత్ రెడ్డి సర్కార్ ఏం చేసిందని ఆయన ప్రశ్నించారు. ప్రాజెక్టులు పూర్తి చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. రైతులకు నీళ్లు ఇవ్వలేనే సోయి లేదని అన్నారు.



10 శాతం ప్రాజెక్టును పూర్తి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ఏడాది సమయం కావాలని అంటుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ పూర్తి కాలేదని సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాడని తెలిపారు. రేవంత్ రెడ్డి పచ్చి అబద్దాలు చెబుతున్నాడని మండిపడ్డారు. మహబూబ్‌నగర్‌ను కాంగ్రెస్ సర్వనాశనం చేసిందని లక్ష్మారెడ్డి విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలోనే మహబూబ్‌నగర్ అభివృద్ధి జరిగిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఉత్తమ్ మాటలు అన్ని ఉత్తవే అని ఎద్దేవా చేశారు. పాలమూరు జిల్లా ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి మాటలపై నమ్మకం లేదని లక్ష్మారెడ్డి అన్నారు. పాలమూరు జిల్లా అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందని స్పష్టంచేశారు.




# అభివృద్ధి ఆగదు

మొదటిపేజీ తరువాయి..

దేశంలోనే అత్యధిక వరి పండిస్తున్నాం. వరి వేస్తే.. ఉరే అని చెప్పిన రోజులు కావు ఇవి. వరి రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నాం అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధికి అష్టదరిద్రులు అడ్డం పడుతున్నారని ధ్వజమెత్తారు. కాళ్లలో కట్టెలు పెట్టినా.. మూసీలో పడి దొర్లినా వాళ్లను పట్టించుకోమని విమర్శించారు. అసూయ పడేవాళ్లు, అజీర్ణం చేసుకునేవాళు ఎప్పుడూ ఉంటారని ఎద్దేవా చేశారు. రూ.2,284 కోట్లతో 239 ఎకరాల్లో ఫ్రూట్ మార్కెట్ నిర్మిస్తున్నారు. చుక్కనీరు ఎత్తిపోయకుండా లక్షల మెట్రిక్ టన్నుల పంట పండలేదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడ నీళ్లున్నా కాళేశ్వరం నీళ్లు అనేవారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరాన్ని రూ.లక్ష కోట్లు వెచ్చిస్తే గోదావరి పాలయ్యాయని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో విధ్వంసం చేస్తే.. మేం వికాసం వైపు నడిపిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు అసూయ, పగ తమపై చూపండని.. కానీ ప్రజలపై కాదని చెప్పారు. సమస్యలు వస్తే పారిపోమని.. నిలబడి కొట్లాడి పరిష్కరించుకుంటామని అన్నారు. ఫామ్‌హౌస్ కేడీతోనైనా, ఢిల్లీలో మోదీతోనైనా కొట్లాడేందుకు సిద్ధమని వ్యాఖ్యానించారు. చేతకాకపోతే దిగిపొమ్మంటున్నారని.. తాము అల్లాటప్పాగా రాలేదని చెప్పారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సంగతి చెబుతామని హెచ్చరించారు. మర్యాద తప్పితే.. పొలిమేరలు కూడా దాటనివ్వమని వార్నింగ్ ఇచ్చారు. మోదీని చూపి భయపెట్టాలనుకుంటే.. ఇక్కడెవరూ భయపడేవారు లేరని చెప్పుకొచ్చారు ఈనెల 15 తర్వాత వడ్లు కొనకపోతే కేంద్రం సంగతి చూస్తామని హెచ్చరించారు. మాకు మాటలే కాదని.. చేతలు కూడా తెలుసునని అన్నారు. కేంద్రం నుంచి నిధులు ఎలా తెచ్చుకోవాలో తమకు తెలుసునని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం వేగంగా విస్తరిస్తోందని వ్యాఖ్యానించారు. భూముల ధరలు బాగా పెరిగాయని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ పెరగడంతో వ్యవసాయం కుంటుపడిందని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో 1.34 కోట్ల మంది నివసిస్తున్నారని తెలిపారు. ఒకప్పుడు హైదరాబాద్ చుట్టూ కూరగాయలు పండేవని వెల్లడించారు. గడ్డిఅన్నారం నుంచి ఫ్రూట్ మార్కెట్‌ని ఇక్కడికి తరలించారని ప్రస్తావించారు. రేకుల షెడ్లు వేస్తే.. అవి గాలి దుమారానికి ఎగిరిపోయాయని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ నిర్మిస్తామని హామీ ఇచ్చామని చెప్పారు. పండ్ల మార్కెట్ కోసం మనం చేసిన ప్రయత్నాన్ని అడ్డుకోవాలని చూశారని ధ్వజమెత్తారు. అందరి అవసరాలు తీర్చేలా మార్కెట్ నిర్మాణం చేయబోతున్నామని స్పష్టం చేశారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌తో ఏటా రూ.8 వేల కోట్ల ఆదాయం వస్తుందని తెలిపారు. మన ప్రాంతంలో రైతులు అన్ని రకాల పండ్లు పండించాలని ఆకాంక్షించారు. ఫార్మా సిటీ వద్దని ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేయబోతున్నామని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ స్థాయి కంపెనీలను ఇక్కడికి తీసుకురాబోతున్నామని వివరించారు. కాలుష్యం లేని పరిశ్రమలే ఈ ప్రాంతానికి వస్తాయని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ, మార్కెట్, ఆర్ఆర్ఆర్ వద్దంటూ అడ్డం పడుతున్నారని చెప్పుకొచ్చారు. వరంగల్ ఎయిర్‌పోర్టు వద్దని అడ్డుకుంటోందని ఆగ్రహించారు. గతంలో కావాలని మనం పోరాడితే.. ఇప్పుడు అష్టదరిద్రులు అడ్డం పడుతున్నారని దుయ్యబట్టారు. అభివృద్ధి చేద్దామంటే అడ్డుపడుతున్నారు.. ధర్నాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. 2034 వరకు ప్రజాపాలన ఉంటుందని స్పష్టం చేశారు. ఔర్ ఏక్ బార్.. కాంగ్రెస్ సర్కార్.. తమ నినాదమని ఉద్ఘాటించారు. అభివృద్ధి పనులు చేసుకుంటూ ముందుకెళ్తామని చెప్పుకొచ్చారు. ఎంతమంది అడ్డం పడినా అభివృద్ధి పనులు ఆగవని తేల్చిచెప్పారు. సదుపాయాలు ఉంటేనే అంతర్జాతీయ స్థాయి నగరం



అవుతుందని తెలిపారు. 'కారు' పూర్తిగా చెడిపోయి కార్ఖానాలో ఉంది. ఎన్ని మరమ్మతులు చేసినా.. చెడిపోయిన ఆ కారు ఇక పనికిరాదు. కేసీఆర్ కుర్చీ వేసుకొని కూర్చొని.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మిస్తానని చెప్పారు. కానీ.. గెలిచిన తర్వాత పట్టించుకోలేదు. మేం అభివృద్ధి చేస్తుంటే.. అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామని బీఆర్ఎస్ చెబుతోంది. కాలుష్యం వెదజల్లే ఫార్మాసిటీ వద్దని.. ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 500 కంపెనీలు తీసుకురావాలని యత్నిస్తున్నాం. బీఆర్ఎస్ నేతలు దశాబ్దంలోనే శతాబ్దానికి సరిపడా విధ్వంసం చేశారు. తెలంగాణలో పండిన ధాన్యాన్ని కొనలేని మోదీ గద్దె దిగాలి. రాహుల్ గాంధీని ప్రధాని చేసి.. మొత్తం ధాన్యాన్ని కేంద్రంతో కొనిపిస్తా. పాలమూరు- రంగారెడ్డికి జాతీయ హోదా తెస్తా. మెట్రో విస్తరణకు, ఆర్ఆర్ఆర్‌కు వెంటనే నిధులు తీసుకొస్తా అని సీఎం అన్నారు.

## హిట్లర్ నాకు ఇన్‌స్పిరేషన్..

మొదటిపేజీ తరువాయి..

పాల్గొన్న సీఎం.. హైడ్రా, ఈగల్ ఫోర్స్‌పై మాట్లాడారు. ధనికులు విలాస భవనాలు, ఫామ్ హౌస్‌ల కోసం చెరువులను ఆక్రమిస్తున్నారు. అంతేకాకుండా తమ భవనాల వ్యర్థాలను చెరువుల్లో కలుపుతున్నారు. ఈ కబ్జాలను అరికట్టేందుకే సీనియర్ ఐపీఎస్ నేతృత్వంలో 3 వేలమందితో హైడ్రా ఏర్పాటు చేశాం. ఇవాళ ఎవరు ఆక్రమణలకు పాల్పడినా.. ఆ కట్టడాలను నేలమట్టం చేస్తున్నాం. డ్రగ్స్ నివారణకు ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్స్ దేశంలోనే ఉత్తమమైనది. హైడ్రా, ఈగల్ ఫోర్స్‌లను దేశమంతా ఆసక్తిగా చూస్తోందన్నారు. తనను మభ్యపెట్టడం అంత ఈజీ కాదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పరిపాలనలో కామన్ సెన్స్ అనేదే ముఖ్యమని.. కామన్ సెన్స్‌తో సమస్యలు పరిష్కారం చేసేవే ఎక్కువ అని తెలిపారు. తాను కేసీఆర్ మీడియా పీపుల్స్‌ను కూడా మీడియా సమావేశానికి పిలుస్తానన్నారు. వాళ్ళ మైండ్ సెంట్ ఏంటో తెలుసుకుంటానని చెప్పారు. తనకు వేరే ఏ పని లేదని.. 16 నుంచి 18 గంటలు పని చేస్తానన్నారు. తాను ఫుట్‌బాల్ ఆడతానని.. అందుకే మెస్సీని తీసుకువచ్చినట్లు తెలిపారు. యువతను క్రీడల వైపు మళ్లించాలనేది తన లక్ష్యమని చెప్పారు. తాను కొద్ది మంది జర్నలిస్ట్‌లతో రాత్రి సమయంలో మాట్లాడతానని, పాలనపై ఫీడ్ బ్యాక్ తీసుకుంటా అన్నారు. తనకు వ్యతిరేకంగా వార్తలు రాసినా చూస్తానని, దాని నుంచి కూడా కొంత సమాచారం వస్తుందన్నారు. పేదలు చెరువు పరిసరాలు ఆక్రమించుకున్నారు అంటే అర్థం చేసుకుంటానని.. కానీ పెద్ద వాళ్ళు కూడా చెరువులను అక్రమిస్తే ఎట్లా? అని ప్రశ్నించారు. హైడ్రా వచ్చాక.. ఎవరైనా ఇప్పుడు ధైర్యం చేస్తారా అడగండి. చెరువు కబ్జా చేయడానికి ఆలోచన చేస్తారేమో అని నిలదీశారు. ఓ వైపు క్యాస్టిజం వద్దంటం. మరో వైపు.. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వేరే హాస్టల్స్ పెడుతుంటామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పెడుతున్న. అందరూ అందులో చదువుకోవాలి. సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ అమలు చేసింది మేమే. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయలేదు. ఓబీసీ జనాభా లెక్కలు కూడా లేవు. తెలంగాణలో ఆ లెక్కలు కూడా తేల్చేశాం. వెనకబాటు తనం, ఆర్థిక పరమైన అంశమే కాదు. విద్యా, సామాజిక అంశాలు. మేము పేద విద్యార్థులు చదువుకునే పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ కూడా ఏర్పాటు చేస్తున్నాం. మేము పిల్లని ఇంటి నుంచి స్కూల్ వరకు వాహనాలు కూడా ఏర్పాటు చేస్తాం. ఈ ఏడాది ప్రభుత్వం స్కూల్స్‌లో లక్ష




మంది విద్యార్థుల సంఖ్య పెరిగింది. ట్రాన్స్ఫర్టేషన్, బ్రేక్ఫాస్ట్, ఏర్పాటు చేస్తున్నాం. మా నాన్న రైతు. అందుకే మేము గోచి కడతాం పంచెలు, దోతీలు కూడా కడతాం. మా ఆహార్యం అలాగే ఉంటుంది.ఫ్రెండ్లీ మ్యాచ్ లాగే.. నా పొరుగు రాష్ట్రాలతో ఉంటా. హైడ్రా లాంటి ఆలోచన అన్ని రాష్ట్రాలకు అవసరం లేదు. మెట్రో పాలిటన్ సిటీలకు అవసరం. మహిళా రిజర్వేషన్‌కి మేం హక్కుదారులం. మహిళను రాష్ట్రపతి, ముఖ్యమంత్రులను చేసింది మేమే. సోనియా గాంధీ మహిళలకు రిజర్వేషన్ కోసం ప్రయత్నం చేశారు. మోడీ పొలిటికల్ ఫార్ములా వాడుతున్నారు. మేము నియోజకవర్గాల పెంపు, మహిళా రిజర్వేషన్‌లకు వ్యతిరేకం కాదు. మోడీ చేస్తున్న ఆలోచనకి వ్యతిరేకం. తెలంగాణ, కర్ణాటకలో కూడా బీజేపీ ఎంపీలు గెలిచారు. కానీ కేంద్ర కేబినెట్‌లో ప్రధాన కేంద్ర మంత్రి పదవులు లేవు. ఢిల్లీలో దక్షణాది ఎంపీలు సెకండ్ గ్రేడ్ పీపుల్స్ లాగా చూడొద్దు అంటున్నాం.' అని సీఎం వ్యాఖ్యానించారు.

## బొల్లాకు 14 రోజుల రిమాండ్

మొదటిపేజీ తరువాయి..

ఆ తర్వాత న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. బొల్లా బ్రహ్మనాయుడిని నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తీసుకువస్తున్నారనే సమాచారం అందడంతో వైసీపీ కార్యకర్తలు, ఆయన అనుచరులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా పోలీస్ స్టేషన్‌లోకి ఎవరినీ అనుమతించ లేదు. దీంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నార్సింగి పోలీస్ స్టేషన్ నుంచి బొల్లా బ్రహ్మనాయుడిని కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉప్పరపల్లి కోర్టుకు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వాదనలు విన్న కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం చంచల్‌గూడా జైలుకు పంపించారు. గండిపేట భూకబ్జా కేసులో ఇప్పటికే ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. బొల్లా బ్రహ్మనాయుడు అరెస్టుతో మొత్తం అరెస్టుల సంఖ్య ఆరుకు చేరాయి. ఈ కేసులో మరికొంతమందిని కూడా విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భూకబ్జాకు సంబంధించిన పలు కోణాల్లో సైబరాబాద్ పోలీసులు విచారణ చేపట్టారు. భూముల ఆక్రమణ, పత్రాల వ్యవహారం, సంబంధిత వ్యక్తుల పాత్ర వంటి అంశాలపై అధికారులు సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా మరిన్ని చర్యలు చేపట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. గండిపేట భూకబ్జా కేసులో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడి అరెస్ట్, అనంతరం కోర్టు రిమాండ్ విధించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.



## హైదరాబాద్ లో భారీ వర్షం

మొదటిపేజీ తరువాయి..

ఇబ్బందిపడ్డ నగరవాసులకు భారీ వర్షం ఉపశమనం కలిగించింది. నగరంలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడగా, ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. పంజాగుట్ట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఐటీ కారిడార్ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అలాగే ఖైరతాబాద్, కోఠి, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్



ప్రాంతాల్లోనూ మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదైంది. ఉప్పల్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, నిజాంపేట, శంషాబాద్, రాజేంద్రనగర్, గోల్కొండ ప్రాంతాల్లో కూడా వర్షం కురవడంతో నగరమంతా తడిసిముద్దయ్యింది. వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిచిపోయింది. రహదారులపై వాహనాలు నెమ్మదిగా కదిలాయి. ముఖ్యంగా ఐటీ కారిడార్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, పంజాగుట్ట, బంజారాహిల్స్ ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో వర్షం పడటంతో ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో ద్విచక్ర వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు వాహనదారులు అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని సూచించారు.

ఇక వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం.. హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో మరికొన్ని గంటల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని, నీటిమునిగిన రహదారులపై ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. మరోవైపు, వర్షంతో నగరంలో ఉష్ణోగ్రతలు తగ్గి ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. హైదరాబాద్‌లో కురిసిన ఈ వర్షం వేసవి వేడిమి నుంచి నగరవాసులకు తాత్కాలిక ఉపశమనం కలిగించింది.

## ప్రభుత్వ భూములను పెద్దలకు దోచిపెడుతున్న రేవంత్

మొదటిపేజీ తరువాయి..

వ్యాఖ్యానించారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కుటుంబ సభ్యులు, ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు భూదందాలో చురుకుగా ఉన్నారని ఆరోపించారు. అయితే ఈ ప్రభుత్వ భూములను సుప్రీంకోర్టు వరకు వెళ్లి తాము కాపాడుతామని స్పష్టం చేశారు. హైడ్రా.. పేదల కాలనీల్లో దాడులు చేసి ఆ భూములను పెద్దలకు అప్పగిస్తోందని మండిపడ్డారు. శ్రీఆదిత్య కంపెనీ రివర్ బెడ్‌పైన ప్రాజెక్టు కడుతోందని.. ఆ కంపెనీ వెనుక ఓ ఎంపీ ఉన్నారన్నారు. శ్రీ ఆదిత్య కంపెనీకి బీఆర్ఎస్ హయాంలోనే పర్మిషన్ ఇచ్చారని.. దాన్ని ముట్టుకునే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి నీళ్లపై అవగాహన లేదని కవిత విమర్శించారు. మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే ఏపీ సీఎం ఇవ్వరా? అని ప్రశ్నించారు. ఏపీ సీఎంతో మాట్లాడి 200 టీఎంసీల నీళ్లు తెచ్చి ఆ తర్వాత బనకచర్ల గురించి మాట్లాడాలన్నారు. అప్పుడు కేటీఆర్ పాలన నడిచిందని.. ఇప్పుడు కూడా కేటీఆర్ పాలనే నడుస్తోందన్నారు. అప్పుడు కేటీఆర్ అంటే కేసీఆర్, తన్నీరు హరీష్ రావు, రామారావు.. ఇప్పుడు కేటీఆర్ అంటే కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీజేపీ పరస్పర సవాళ్లతో ఒరిగేదేమీ లేదని కవిత విమర్శించారు. తెలంగాణ బరాబర్ ప్రజల జాగీరే అని.. పవన్ కల్యాణ్ జాగీర్ కాదని కవిత స్పష్టం చేశారు. ఆంధ్రా విషకోరల నుంచి తెలంగాణను కాపాడుకున్నామన్నారు. ఇక్కడకు వచ్చి రాజకీయం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. పవన్‌కు మద్దతు ఇస్తే నాలుగు ఓట్లు వస్తాయని బీజేపీ భావిస్తోందని.. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఉన్న 8 సీట్లు పోతాయన్నారు. పవన్ కల్యాణ్ 10 ఎకరాలు శిఖం భూమిని కొనుగోలు చేశారని.. కోడికుంట సర్వే నంబర్ 706లో శిఖం భూమి ఉందన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో అనేక తప్పులు జరిగాయని.. ఆ భూమిని పవన్ తిరిగి ఇచ్చేయాలన్నారు. శిఖం భూమిలో వేసిన కంచెను పవన్ తొలగించాలని కవిత డిమాండ్ చేశారు.



## వర్షాకాలం వస్తోంది జాగ్రత్త

**ముందస్తు చర్యలకు సిద్ధం కండి**

**ధాన్యం కొనుగోళ్లు, సీఎం పర్యటనలపై జాగ్రత్తలు**

**కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్ ఆదేశాలు**

హైదరాబాద్,జూన్6(సాక్ష్యం): తెలంగాణలో వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాని, ముందస్తు చర్యలకు దిగాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాల పరిస్థితులు, వరి కొనుగోళ్లు, ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. శనివారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశంలో ఈ సమావేశంలో వర్షాల ప్రభావంపై ప్రత్యేకంగా చర్చించిన సీఎస్, అన్ని జిల్లాల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించేలా అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న వరి కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మార్గనిర్దేశర చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని జిల్లా యంత్రాంగానికి సీఎస్ సూచించారు. వర్షాల పరిస్థితులపై నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వర్షాల హెచ్చరికలు, వరి కొనుగోళ్లు, సీఎం పర్యటనల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. రైతులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపైనా సీఎస్ అధికారులతో చర్చించారు. సీఎం పర్యటనలు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లు, ప్రజాసభల నిర్వహణ, రవాణా సౌకర్యాలు, వసతి ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు.



**జ్యుడీషియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సిటీ సివిల్ కోర్టులు హైదరాబాద్ మరియు సికింద్రాబాద్ తెలంగాణ స్టేట్ జ్యుడీషియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కోశాధికారిగా ఎన్నిక కావడం ద్వారా శ్రీ పి.నరేష్ యాదవ్‌కు సన్మానం S.V సుబ్బయ్య గారు జాతీయ కార్యదర్శి మరియు సిటీ సివిల్ కోర్టు అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి ఆర్. ఉదయ్ కుమార్ గారు,ఆర్గనైజేషన్ సెక్రటరీ రాకేష్ కుమార్, కోశాధికారి మనీష్, వైస్ ప్రెసిడెంట్ కె. అనిత గారు, శ్రవణ్, దాసు,మరియు సిటీ సివిల్ కోర్టు ఉద్యోగుల సంఘం**



## నార్సింగ్ స్టేషన్‌కు బొల్లా బ్రహ్మనాయుడు

కాంచీపురం నుంచి తరలించిన పోలీసులు



హైదరాబాద్,జూన్6(సాక్ష్యం): గండిపేట భూకబ్జా కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిని సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో వైసీపీ నేతలు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చారు. పరారీలో ఉన్న ఆయన్ను తమిళనాడులోని కాంచీపురం నుంచి నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాంచీపురం నుంచి రోడ్డు మార్గం గుండా నార్సింగికి పోలీసులు తీసుకొస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌లో స్టేట్‌మెంట్ రికార్డ్ చేసిన తర్వాత బ్రహ్మనాయుడిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నారు. భూకబ్జా కేసులో ఇప్పటి వరకు ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. బ్రహ్మనాయుడి అరెస్ట్‌తో ఆ సంఖ్య ఆరుకు చేరింది. మాజీ ఎమ్మెల్యే నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తీసుకువస్తున్నారన్న సమాచారంతో పీఎస్ వద్దకు పెద్ద సంఖ్యలో వినుకొండ వైసీపీ కార్యకర్తలు చేరుకున్నారు. ఈ క్రమంలో బ్రహ్మనాయుడిని కాంచీపురంలో అరెస్ట్ చేసిన పోలీసులు.. అక్కడ స్థానికంగా ఉన్న కోర్టులో ప్రవేశపెట్టిన అనంతరం నార్సింగి పీఎస్‌కు తరలించారు. గండిపేటలోని సర్వేనంబర్ 18లో సుమారు ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో తొమ్మిది ఎకరాలకు పైగా కాజేసేందుకు నిమ్మల కుటుంబసభ్యులు కుట్రపన్నారు. అందుకోసం నకిలీ జీవోలు, నకిలీ పత్రాలను సృష్టించడంలో మద్దుకల్ల రాధాకృష్ణకు బ్రహ్మనాయుడు సహకరించారని ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం రూ. 12 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు సైబరాబాద్ పోలీసుల దర్యాప్తులో బయటపడింది. తహశీల్దార్ ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేష్, రాధాకృష్ణ, నిమ్మల కుటుంబ సభ్యులు కలిసి ఈ కుట్ర పన్నినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో ఐదు మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు నమోదు విషయం తెలిసిన వెంటనే బ్రహ్మనాయుడు పరారీలో ఉన్నారు. ఆయనపై సైబరాబాద్ పోలీసులు నిఘా ఉంచారు. కొంతకాలం బెంగళూరులో ఉన్న బ్రహ్మనాయుడు అక్కడి నుంచి కేరళకు వెళ్లి ఆపై తమిళనాడులోని కాంచీపురంకు వెళ్లారు. బ్రహ్మనాయుడు కాంచీపురంలో ఉన్నట్లు సమాచారం అందిన వెంటనే నార్సింగి పోలీసుల బృందం, ఈవోడబ్ల్యూకు సంబంధించిన మరో బృందం అక్కడకు చేరుకుని మాజీ ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకున్నారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే నగర అభివృద్ధి సాధ్యం

నల్లగొండ మున్సిపల్ కమిషనర్ బచ్చలకురి శరత్ చంద్ర

నల్లగొండ,జూన్6(సాక్ష్యం): ప్రజల భాగస్వామ్యంతోనే నగర అభివృద్ధి సాధ్యమవుతుందని నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బచ్చలకురి శరత్ చంద్ర అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం రెండో విడతగా పలు వార్డుల్లో ప్రత్యేక వార్డు సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డు స్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించి స్థానిక సమస్యలకు వేగవంతమైన పరిష్కారం చూపడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. చెత్తను మూలం వద్దనే వేరు చేయడం ద్వారా పరిశుభ్రమైన నగర నిర్మాణంతో పాటు వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ సాధ్యమవుతుందన్నారు. జల్ సంచయ్- జల్ భాగీధారి కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల ఏర్పాటు, రూఫ్‌టాప్ రైన్ వాటర్ హార్వెస్టింగ్ చర్యల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి కుటుంబం వర్షపు నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని, భూగర్భ జలాల పెంపునకు సహకరించాలని పిలుపునిచ్చారు.రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో చేపడుతున్న డ్రైనేజీల పూడికతీత పనులు, మురుగు కాలువల శుభ్రత, వర్షాకాల సన్నద్ధత చర్యల గురించి ప్రజలకు వివరించారు. డ్రైనేజీలలో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని, నీటి ప్రవాహానికి ఆటంకాలు కలగకుండా చూడాలని సూచించారు. నగరంలో తాగునీటి సరఫరా, పైప్‌లైన్ నిర్వహణ, పారిశుధ్య సేవలు, వీధి దీపాల నిర్వహణ, అంతర్గత రహదారుల అభివృద్ధి, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిరంతరంగా చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. పచ్చదనం పెంపు ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వర్షాకాలంలో నీటి నిల్వలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం వల్ల దోమల వ్యాప్తిని నివారించడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, తాగునీటిని శుద్ధి చేసి వినియోగించడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని ప్రజలకు సూచించారు. వార్డు సభలలో ప్రజల నుండి తాగునీటి సరఫరా, పారిశుధ్యం, డ్రైనేజీలు, వీధి దీపాలు, రహదారులు, వర్షపు నీటి పారుదల, పార్కుల అభివృద్ధి, ప్రజా సౌకర్యాలు, ఇతర స్థానిక సమస్యలపై వినతులు, ఫిర్యాదులు, సూచనలు స్వీకరించారు. అందిన ప్రజా ఫిర్యాదులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రజా పాలన ? ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో నగర ప్రజలు చురుకుగా పాల్గొనాలని, రాబోయే విడతల వార్డు సభలకు కూడా పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత డివిజన్ల కార్పొరేటర్లు మందడి లిఖిత సైదిరెడ్డి, దొడ్డి రమేశ్, గోపరాజు స్వాతి రాజశేఖర్, మొహమ్మద్ ఇబ్రహీం, రఫియోద్దీన్, వార్డు అధికారులు, మున్సిపల్ అధికారులు, శానిటరీ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సత్వరంగా మహిళా సమాఖ్య భవన నిర్మాణాలు

అధికారులను ఆదేశించిన మంత్రి సీతక్క

హైదరాబాద్,జూన్6(సాక్ష్యం): మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలు వేగవంతం చేయాలని మంత్రి సీతక్క సూచించారు. 8 వేల గ్రామాల్లో మహిళా భవనాల నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. ఇవి మహిళల ఆత్మగౌరవ భవనాలని మంత్రి సీతక్క అభివర్ణించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సర్ అధికారులతో మంత్రి సీతక్క శనివారం సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. మహిళా భవనాల నిర్మాణ పురోగతిని రోజూ పరిశీలిస్తామని తెలిపారు. ఈ నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం సహించ బోమని హెచ్చరించారు. ఎంపీడీవోలు ఈ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత, పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులు నిరంతర పర్యవేక్షించాలని దిశానిర్దేశర చేశారు. ఉపాధి హామీ పనుల అమలుపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. గ్రామీణాభివృద్ధి పనుల్లో లక్ష్యాల సాధించాలని అధికారులకు.. మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు.


**క్లిక్ క్యాపిటల్ సర్వీసెస్ ప్రై. లిమిటెడ్ (Clix)**
**రిజిస్టర్డ్ కార్యాలయం: W2/14, మొదటి అంతస్తు, వెస్ట్ పటేల్ నగర్, ఢిల్లీ, 110008**

**స్వాధీనం నోటీసు (అనుబంధం IV) రూల్ 8(3)**

అయితే క్లిక్స్ క్యాపిటల్ సర్వీసెస్ ప్రై. లి.(Clix) యొక్క అధీకృత అధికారిగా, కంపెనీల చట్టం, 1956 కింద సక్రమంగా స్థాపించబడి నమోదు చేయబడిన నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ, W2/14, మొదటి అంతస్తు, వెస్ట్ పటేల్ నగర్, ఢిల్లీ, 110008 వద్ద రిజిస్టర్డ్ కార్యాలయాన్ని కలిగి ఉన్నారు, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) (ఇకపై "చట్టం"గా సూచిస్తారు) నిబంధనల ప్రకారం మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్, 2002లోని నియమం 3తో చదవబడిన చట్టంలోని సెక్షన్ 13(2) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ, నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోపు తిరిగి చెల్లించాలని కింది రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసు జారీ చేశారు. రుణగ్రహీత/హామీదారుడు పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, క్రింద సంతకందారు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (4)తో పాటు చదవబడిన రూల్ 8 ప్రకారం క్రింద పేర్కొన్న తేదీతో అతనికి ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుని, క్రింద వివరించిన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు మరియు ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది. ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలు ఆస్తితో వ్యవహరించవద్దని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నారు మరియు ఆస్తితో జరిగే ఏవైనా లావాదేవీలు "క్లిక్స్" మరియు దానిపై వడ్డీ ఇతర ఛార్జీలకు లోబడి ఉంటాయి. సెక్యూర్డ్ ఆస్తిని రీడీమ్ చేయడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలపై రుణగ్రహీత శ్రద్ధ వహించాలని కోరుతున్నాము.

**రుణగ్రహీత /సహ-రుణగ్రీత పేరు & చిరునామా: 1. భాగేందర్ సింగ్ సర్దార్, 2. మన్నె మంజు భర్త లక్ష్మణ్ సింగ్ సర్దార్,** ఇద్దరి చిరునామా- 8-3-228/581/14/8, రహ్మత్‌నగర్, యూసుఫ్‌గూడ, మెయిన్ రోడ్ దగ్గర, హైదరాబాద్, తెలంగాణ-500045. **3. బెస్ట్ వే ట్రాన్స్‌పోర్ట్,** 8-3-235/8, యూసుఫ్‌గూడ, భారత్ పెట్రోల్ బంక్ పక్కన, హైదరాబాద్, తెలంగాణ-500045.

**డిమాండ్ నోటీసు తేదీ:** 13-ఫిబ్రవరి-2026, **స్వాధీనత తేదీ:** 05.06.2026
**డిమాండ్ నోటీసు ప్రకారం అమౌంట్** : 11.02.2026 నాటికి రూ. 40,80,943.5/-

**ప్రాపర్టీ వివరణ:** తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్, యూసుఫ్‌గూడ, రహమత్ నగర్‌లో ఉన్న, మున్సిపల్ నంబర్ 8-3-228/581/14/8 కలిగిన 144 చదరపు గజాల లేదా 120.5 చదరపు మీటర్లకు సమానమైన విస్తీర్ణం గల ఇంటి యొక్క యావత్తు; సరిహద్దులు: ఉత్తరం - ఇంటి నంబర్ 8-3-228/557/12, దక్షిణం - పొరుగు వారి ఇల్లు, తూర్పు - పొరుగు వారి ఇల్లు, పడమర- లేన్.

**ప్రదేశం: తెలంగాణ, తేదీ: 05.06.2026,** **అధీకృత అధికారి, క్లిక్స్ క్యాపిటల్ సర్వీసెస్ ప్రై. లిమిటెడ్**


## దేశ ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిన బిజెపి

కొద్దిమంది కార్పొరేట్ సంస్థల చేతుల్లో దేశ సంపద

దిగజారుతున్న పేద, మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాలు

కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా 9న సిపిఎం దేశవ్యాప్త నిరసనలు

రాజమహేంద్రవరం,జూన్6(సాక్ష్యం): దేశ ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారాలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల, విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసిన పేపర్ లీకేజీలు, ప్రజా రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మిక హక్కులపై దాడులకు వ్యతిరేకంగా



జూన్ 9న దేశవ్యాప్తంగా నిర్వహించే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సిపిఎం తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన ఓ సమావేశం శనివారం సిపిఎం కార్యాలయంలో జువ్వల రాంబాబు అధ్యక్షతన జరిగింది.ముఖ్య అతిధి గా పాల్గొన్న వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్ల పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేసిందన్నారు. సంపద కొద్దిమంది కార్పొరేట్ సంస్థల చేతుల్లో కేంద్రీకృతమవుతుండగా, పేదలు మరియు మధ్యతరగతి ప్రజల జీవన పరిస్థితులు రోజురోజుకు దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో నిరుద్యోగం గతంలో ఎన్నడూ లేని స్థాయికి చేరుకుందని, కోట్లాది మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో బలహీనపరుస్తోందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను విపరీతంగా పెంచడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగి ప్రజల జీవనం భారంగా మారిందన్నారు. రైతులకు పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని పేర్కొన్నారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని, వివిధ ప్రవేశ, ఉద్యోగ పరీక్షల్లో వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీలు పరీక్షా వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీశాయని అన్నారు. లక్షలాది మంది విద్యార్థులు సంవత్సరాలపాటు శ్రమించి పరీక్షలకు సిద్ధమవుతుంటే, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వారి భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని, ఎనిమిది గంటల పని విధానాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. కార్మికులు సాధించుకున్న హక్కులను కాపాడుకోవడానికి విస్తృత ఐక్య పోరాటాలు అవసరమని అన్నారు.ప్రజల జీవన సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజలను విభజించే రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ప్రజల అసలు సమస్యలైన ఉపాధి, విద్య, వైద్యం, ధరల నియంత్రణ వంటి అంశాలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి టి అరుణ్ మాట్లాడుతూ ధరల పెరుగుదల, నిరుద్యోగం, పేపర్ లీకేజీలు, కార్మిక వ్యతిరేక విధానాలు, ప్రజా రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జూన్ 9న నిర్వహించే నిరసన కార్యక్రమాలలో ప్రజలు, యువత, విద్యార్థులు, కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆంధ్రా పేపర్ లిమిటెడ్ కడియం యూనిట్ లో యాజమాన్యం నిరంకుశ వైఖరి కారణంగా 1200 మంది పర్మినెంట్ కాంట్రాక్టు కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్య పరిష్కారం చేయాలని కోరారు. సమావేశం లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి పవన్, పి తులసి, జిల్లా కమిటీ సభ్యులు సుందర బాబు, పూర్ణిమ రాజ్, ఎస్ ఎస్ మూర్తి, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

### పక్షుల సంరక్షణపై బర్డ్ వాక్

**పోచారం డిబిసిలో అదనపు కలెక్టర్ నగేశ్ ప్రారంభం**

మెదక్,జూన్6(సాక్ష్యం): ప్రకృతి పరిరక్షణ, పక్షుల సంరక్షణపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో బర్డ్ వాక్ కార్యక్రమం నిర్వహించినట్లు అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. శనివారం పోచారంలోని డీబీసీలో నిర్వహించిన బర్డ్ వాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అటవీ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.పోచారం ల్యాండ్‌స్కేప్‌లో గొప్ప పక్షి వైవిధ్యం, సహజ వారసత్వం ఉందని దీనిని కాపాడేందుకు బర్డ్ వాక్ నిర్వహించామన్నారు. పోచారం జలాశయం , అభయారణ్యం చుట్టూ ఉన్న పోచారం ప్రాంతం, వలస నీటి పక్షులు, కొంగలు, ఐబీస్‌లు, బాతులు అనేక అటవీ ప్రాంతాలతో సహా విభిన్న పక్షి జీవనానికి ప్రసిద్ధి చెందిందన్నారు. ఇది ఒక ముఖ్యమైన పక్షి వీక్షణ గమ్యస్థానంగా నిలుస్తుందనీ పేర్కొన్నారు. ప్రకృతి ప్రేమికులు, విద్యార్థులు, అధికారులు పాల్గొని వివిధ రకాల పక్షులను వీక్షించాలని కోరారు. పక్షుల జీవన విధానం, వలస పక్షుల ప్రాముఖ్యత, పర్యావరణ సమతుల్యతలో వాటి పాత్రను వివరించాలని సూచించారు. పక్షుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా చెట్లు నాటాలని, నీటి వనరులను కాపాడాలని, పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ జోజి , మెదక్ డీపీఆర్వో రామచంద్ర రాజు, ఎఫ్ఆర్వోలు , బీట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.


**క్లిక్ క్యాపిటల్ సర్వీసెస్ ప్రై. లిమిటెడ్ (Clix)**
**రిజిస్టర్డ్ కార్యాలయం: W2/14, మొదటి అంతస్తు, వెస్ట్ పటేల్ నగర్, ఢిల్లీ, 110008**

**స్వాధీనం నోటీసు (అనుబంధం IV) రూల్ 8(3)**

అయితే క్లిక్స్ క్యాపిటల్ సర్వీసెస్ ప్రై. లి.(Clix) యొక్క అధీకృత అధికారిగా, కంపెనీల చట్టం, 1956 కింద సక్రమంగా స్థాపించబడి నమోదు చేయబడిన నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ, W2/14, మొదటి అంతస్తు, వెస్ట్ పటేల్ నగర్, ఢిల్లీ, 110008 వద్ద రిజిస్టర్డ్ కార్యాలయాన్ని కలిగి ఉన్నారు, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) (ఇకపై "చట్టం"గా సూచిస్తారు) నిబంధనల ప్రకారం మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్, 2002లోని నియమం 3తో చదవబడిన చట్టంలోని సెక్షన్ 13(2) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ, నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోపు తిరిగి చెల్లించాలని కింది రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసు జారీ చేశారు. రుణగ్రహీత/హామీదారుడు పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, క్రింద సంతకందారు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (4)తో పాటు చదవబడిన రూల్ 8 ప్రకారం క్రింద పేర్కొన్న తేదీతో అతనికి ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుని, క్రింద వివరించిన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు మరియు ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది. ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలు ఆస్తితో వ్యవహరించవద్దని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నారు మరియు ఆస్తితో జరిగే ఏవైనా లావాదేవీలు "క్లిక్స్" మరియు దానిపై వడ్డీ ఇతర ఛార్జీలకు లోబడి ఉంటాయి. సెక్యూర్డ్ ఆస్తిని రీడీమ్ చేయడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలపై రుణగ్రహీత శ్రద్ధ వహించాలని కోరుతున్నాము.

**రుణగ్రహీత /సహ-రుణగ్రీత పేరు & చిరునామా: 1. నాగలిదున్నె జగదీష్ తండ్రి సిహెచ్. నర్సింహా చారి, 2.గోవిందుల స్వప్న భర్త చిప్పల్తుర్తి వెంకటేష్ చారి,** 1-3-4/3, మహమ్మద్ గూడ, పోచమ్మ దేవాలయం దగ్గర, వారాసిగూడ, సికింద్రాబాద్, హైదరాబాద్-Ts-500061. **ఇంకా ఇక్కడ:** హౌస్ బేరింగ్ నెం.12-11-69 (పాత నం.లు 12-10-498 నుండి 500) ఉప్పర్ బస్తీ, నామాలగుండు, సికింద్రాబాద్, తెలంగాణ రాష్ట్రం - **500061.**

**డిమాండ్ నోటీసు తేదీ:** 13-మార్చి-2026, **స్వాధీనత తేదీ:** 05.06.2026
**డిమాండ్ నోటీసు ప్రకారం అమౌంట్** : 12-మార్చి-2026 నాటికి రూ. 76,94,445.56/-

**ప్రాపర్టీ వివరణ:** సికింద్రాబాద్‌లోని నామాలగుండు, ఉప్పర్ బస్తీ వద్ద 150 చదరపు గజాల లేదా 125.4 చదరపు మీటర్ల విస్తీర్ణం కలిగి ఉన్న 12-11-69 నంబరు గల ఇల్లు (పాత నంబర్లు 12-10-498 నుండి 500 వరకు) (గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తులను) ఇంటి యొక్క యావత్తు; సరిహద్దులు : ఉత్తరం: ఇంటి నంబర్లు 12-10-462 నుండి 463 వరకు (కొత్త నంబరు 12-11-73), దక్షిణం: 15 అడుగుల వెడల్పు గల రోడ్డు, తూర్పు: ఇంటి నంబరు 12-10-498 (కొత్త నంబరు 12-11-68), పడమర: ఇంటి నంబరు 12-10-501(కొత్త నంబరు 12-11-70).

**ప్రదేశం: తెలంగాణ, తేదీ: 05.06.2026,** **అధీకృత అధికారి, క్లిక్స్ క్యాపిటల్ సర్వీసెస్ ప్రై. లిమిటెడ్**



**బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్**

**రిజిష్టర్డ్ ఆఫీస్:** బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ C/o బజాజ్ ఆటో లిమిటెడ్ కాంప్లెక్స్ ముంబాయి పుణే రోడ్ ఆకుర్తి పుణే 411035
**బ్రాంచ్ ఆఫీస్:** బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్, 2వ అంతస్తు, మెయిన్ రోడ్, తాండూర్, కర్ణాటక, తాండూర్ 75హెచ్ తెలంగాణ 501141

**సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యురిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసు**

దిగువ సంతకందారు M/s బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా ఈ నోటీసు ద్వారా రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు) తమ బాధ్యతలను నిర్వర్తించడలంలో విఫలమైనందున, అంటే బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు వారికి మంజూరు చేసిన కొన్ని రుణం(లు)/రుణాలు /ఆస్తిపై రుణం పైన అసలు మొత్తం, వడ్డీ మరియు ఇతర ఛార్జీలను చెల్లించడంలో డిఫాల్ట్ అయ్యారు. ఈ కారణంగా ఆ రుణాలు "నాన్ పర్ఫార్మింగ్ అసెట్స్" (ఎన్.పి.ఏ.గా) వర్గీకరించబడ్డాయి.కాబట్టి రుణగ్రహీతలు సహ-రుణగ్రహీతలకు ఈ క్రింది నోటీసును ఇవ్వడం జరిగింది. దీని ప్రకారం,సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని నిబంధనలలోని సెక్షన్ 13(2) కింద వారి చివరి చిరునామాలకు నోటీసులు జారీ చేయబడ్డాయి, అయితే అవి అందించబడకుండా/బట్వాడా చేయబడకుండా తిరిగి ఇవ్వబడ్డాయి, కాబట్టి రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు ఎప్పటికప్పుడు పొందిన రుణ సౌకర్యాల కింద వారి బకాయిలను క్లియర్ చేయాలని ఈ ప్రచురణ నోటీసు ద్వారా వారికి తెలియజేయబడింది.

| లోన్ అకౌంట్ నం. / రుణగ్రహీత(లు) గ్యారంటర్(లు) పేరు & చిరునామాలు | సెక్యూర్డ్ స్థిరాస్తి యొక్క వివరణ | డిమాండ్ నోటీసు తేదీ & అమౌంట్ |
|---|---|---|
| **LAN : P75HPBL 8205639** **1. షహబాజ్ ట్రేడర్స్, యజమాని ఖయ్యూమ్** ద్వారా, నివాసం: హౌస్ నం. 6-7A63, యాద్గిర్ రోడ్, రావల్పల్లి, కొడంగల్, వికారాబాద్ జిల్లా, తెలంగాణ - 509336. ఇ-మెయిల్: shaikqhayyum993@gmail.com **ఇక్కడ కూడా:** హౌస్ నం. 8-4, ఓపెన్ ప్లాట్, సర్వే నం. 84/G2, రావల్పల్లి (గ్రామం& జిపి), కొడంగల్ (మండలం), వికారాబాద్ (జిల్లా), తెలంగాణ- 509336. **2. పుత్‌పాక్ బాబు, తండ్రి: బలపీర్,** నివాసం: 5-16, రావల్పల్లి గ్రామం, కొడంగల్ మండలం, రావల్పల్లి, మహబూబ్‌నగర్, తెలంగాణ-509336. ఇ-మెయిల్: shaikqhayyum993@gmail.com **3. పుత్‌పాక్ కలీఫా, భర్త: బాబు,** నివాసం: 5-16, రావల్పల్లి, రావల్పల్లి, మహబూబ్‌నగర్ జిల్లా, తెలంగాణ -509336. ఇ-మెయిల్: shaikqhayyum993@gmail.com, **4. పుత్‌పాక్ ఫయ్యాజ్, తండ్రి: బాబు,** నివాసం: 5-16, రావల్పల్లి, రావల్పల్లి, మహబూబ్‌నగర్ జిల్లా, తెలంగాణ - 509336. ఇ-మెయిల్: shaikqhayyum993@gmail.com, 5. **ఖయ్యూమ్ ఖయ్యూమ్, తండ్రి: బాబు,** నివాసం: 5-16, రావల్పల్లి, రావల్పల్లి, మహబూబ్‌నగర్ జిల్లా, తెలంగాణ - 509336. ఇ-మెయిల్: shaikqhayyum993@gmail.com. | రావల్పల్లి గ్రామం & జి.పి., కొడంగల్ మండలం, వికారాబాద్ జిల్లా, తెలంగాణ-509336 పరిధిలో సర్వే నం. 84/G2 లో ఉన్న 60 × 48 = 320 చదరపు గజాల విస్తీర్ణం గల ఖాళీ యొక్క యావత్తు, దీనితో పాటు కామన్ ఏరియాలలో ప్రపోర్షనేట్ షేర్ కూడా. **సరిహద్దులు : తూర్పు** : భీమప్ప భూమి, **పడమర:** ఎడిగి శంకరయ్య ప్లాట్, **ఉత్తరం** : రావల్పల్లి రోడ్, **దక్షిణం** : భీమప్ప స్థలం | **19.05.2026** ---------- **రూ. 66,97,710/-** రూపాయలు అరవై ఆరు లక్షల తొంభై ఏడు వేల ఏడు వందల పది మాత్రమే) |

ప్రత్యామ్నాయ నోటీసు సేవ కోసం ఈ చర్య తీసుకోబడింది. పైన పేర్కొన్న రుణగ్రహీతలు / సహ-రుణగ్రహీతలు, హామీదారులు ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి 60 రోజులలోపు భవిష్యత్ వడ్డీతో పాటు బకాయిలను చెల్లించాలని కోరడం జరుగుతుంది, లేనిపక్షంలో (బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ అందుబాటులో ఉన్న ఏదైనా ఇతర హక్కు పరిష్కారానికి భంగం కలిగించకుండా) సెక్యూర్డ్ ఆస్తులు / తనఖా ఆస్తిని స్వాధీనం చేసుకోవడానికి సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని నిబంధనలలోని సెక్షన్ 13(2) నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుంది. పైన పేర్కొన్న పార్టీలు పైన పేర్కొన్న ఆస్తులను ఎలినేట్ చేయవద్దని, వాటిలో మూడవ పక్ష ఆసక్తిని సృష్టించవద్దని కూడా సూచించబడింది. బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ దీనిపై ఛార్జ్ కలిగి ఉంది.

**తేది: 07.06.2026, ప్రదేశం: తెలంగాణ** **సం/- అధీకృత అధికారి, బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్**

## నవజాత శిశువుల ఆరోగ్యం గుర్తింపు

### శిశుమాపన్ యాప్‌ను ప్రారంభించిన ప్రభుత్వం
### ఎఐతో అనుసంధానించినట్లు మంత్రి సత్యకుమార్ వెల్లడి

అమరావతి,జూన్6: నవజాత శిశువుల ఆరోగ్య ప్రమాణాలను సులభంగా, ఖచ్చితంగా గుర్తించేందుకు ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత ఆధారంగా పనిచేసే 'శిశు మాపన్' యాప్‌ను ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. ఈ నూతన విధానం ద్వారా పుట్టిన పిల్లలను చేతులతో తాకాల్సిన అవసరం లేకుండానే.. కేవలం మొబైల్ వీడియో ద్వారా వారి ఆరోగ్య వివరాలను రికార్డు చేయవచ్చు.సాధారణంగా నవజాత శిశువుల బరువు, ఎత్తు, తల, ఛాతీ చుట్టుకొలతలను సాంప్రదాయ పద్ధతుల్లో కొలవడం కొంత శ్రమతో కూడుకున్న పని. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు గాను.. ప్రస్తుతం వినియోగంలో ఉన్న 'ఆశా' యాప్‌తో ఈ 'శిశు మాపన్' యాప్‌ను అనుసంధానించారు. ఈ సరికొత్త ప్రాజెక్ట్‌ను మంగళగిరి నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎం లకు ఈ యాప్ వినియోగంపై ప్రత్యేక శిక్షణ కూడా పూర్తి చేశారు. మంగళగిరిలో సాధించే ఫలితాలు, క్షేత్రస్థాయి అనుభవాలను పరిశీలించిన అనంతరం ఈ అధునాతన ఏఐ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

## ఆరోగ్యకర జీవనానికి ఆర్గానికి వ్యవసాయం

### తాడేపల్లి ఆర్గానికి ఫామ్‌ను సందర్శించిన మంత్రి సవిత

అమరావతి,జూన్6: ఆరోగ్యకర జీవనానికి ఆర్గానిక్ వ్యవసాయం అవసరమని మంత్రి సవిత అన్నారు. తాడేపల్లిలో ఆర్గానిక్ ఫామ్‌ను మంత్రి సవిత సందర్శించారు. శనివారం క్యాంప్ కార్యాలయం నుంచి సైకిల్‌పై ప్రాతూరు రోడ్డులోని ఆర్గానిక్ వెజిటబుల్ ఫామ్‌ను మంత్రి సందర్శించారు. అనంతరం సవిత మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయం పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తుందన్నారు. ఆర్గానిక్ కూరగాయలు ఆరోగ్య రక్షణకు మేలు చేస్తాయన్నారు. క్యాన్సర్ వంటి వ్యాధుల నివారణకు సేంద్రియ ఆహారం అవసరమని చెప్పుకొచ్చారు. 15 ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో ఫామ్ సాగు చేస్తోందని.. రసాయన ఎరువులు లేకుండా కూరగాయలు, ఆకుకూరల సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఇంధన పొదుపు కోసం సైకిల్ వినియోగాన్ని మంత్రి ప్రోత్సహించారు. దగ్గర ప్రాంతాలకు కాలినడకన లేదా సైకిల్‌పై వెళ్లాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఇంధన వాహనాలు వినియోగించాలన్నారు. ప్రధాని మోదీ పిలుపు, సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుదామని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు.

## వశిష్ట గోదావరిలో పడి యువకుడు మృతి

భీమవరం,జూన్6: పశ్చిమగోదావరి జిల్లా వశిష్ట గోదావరి నదిలో స్నానానికి దిగి ఓ యువకుడు ప్రమాదవశాత్తు మృతి చెందాడు. విషాద సంఘటన ఆచంట మండలంలో చోటు చేసుకుంది. పిప్పర గ్రామానికి చెందిన జక్కంశెట్టి భానుప్రసాద్ (18) అనే యువకుడు వల్లూరు పంచాయతీ గెద్దాడవారిపాలెం లోని తన అమ్మమ్మ ఇంట్లో ఉంటూ ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటున్నాడు. శుక్రవారం తన స్నేహితులతో కలిసి కరుగోరుమిల్లి పురస్కార రేవు వద్ద సరదాగా గోదావరిలో స్నానానికి దిగిన భానుప్రసాద్, అకస్మాత్తుగా కాలుజారి నీటిలో గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు, ౧÷ర్ సిబ్బంది గజఈతగాళ్లతో గాలించగా శుక్రవారం రాత్రికి భానుప్రసాద్ మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి గతంలోనే మరణించగా, తల్లి ఉపాధి కోసం విదేశాల్లో ఉంటోంది. కంటికి రెప్పలా చూసుకుంటున్న మనవడు కళ్లముందే అనంతలోకాలకు వెళ్లిపోవడంతో అమ్మమ్మ, తాతయ్యలతో పాటు బంధువులు, స్నేహితుల ఆర్తనాదాలు మిన్నంటాయి. ఆచంట ఎస్సై కే. వెంకటరమణ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## పోలీసులకు లొంగిపోయిన సిఐ చినమల్లయ్య

పల్నాడు,జూన్6: అత్యాచారం కేసులో గత కొన్ని వారాలుగా పరారీలో ఉన్న సీఐ చినమల్లయ్య ఎట్టకేలకు శనివారం తెల్లవారుజామున సుమారు 5 గంటల ప్రాంతంలో వినుకొండ పోలీస్ స్టేషన్‌కు వచ్చి అధికారుల ముందు లొంగిపోయారు. తనపై సీఐ చినమల్లయ్య అత్యాచారం చేశాడంటూ.. ఏప్రిల్



29న ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనపై కేసు నమోదైంది. నాటి నుంచి అరెస్ట్ భయంతో అజ్ఞాతంలోకి వెళ్లిన చినమల్లయ్య, పోలీసులకు దొరకకుండా తప్పించుకుంటూనే ముందస్తు బెయిల్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేశారు. అయితే, ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లను అటు ఆంధ్రప్రదేశ్ హైకోర్టుతో పాటు, ఇటు దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు కూడా కొట్టివేయడంతో ఆయనకు చట్టపరంగా ఎలాంటి ఊరట లభించలేదు. అన్ని కోర్టుల్లోనూ పిటిషన్లు తిరస్కరణకు గురికావడంతో అరెస్ట్ తప్పదని భావించిన చినమల్లయ్య, చివరికి వినుకొండ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ప్రస్తుతం ఆయనను అదుపులోకి తీసుకున్న పోలీసులు తదుపరి విచారణ జరుపుతున్నారు.

## డిఎస్సీపై వైసిపి రాజకీయం

### తప్పు జరిగినట్లుగా దుష్ప్రచారం
### మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం

అంబేద్కర్ కోనసీమ,జూన్6: వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీపై జగన్ అండ్ కో అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. డీఎస్సీపై రాజకీయం చేసి ఎక్కడో తప్పు జరిగినట్లుగా ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహించారు. శనివారం అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండపల్లితో పాటు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు. 82 మందికి రూ.4.86 కోట్ల విలువ చేసే ఎంఎస్‌ఎం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడారు. తమ ప్రభుత్వం డీఎస్సీ ద్వారా 16 వేల మందికి ఉద్యోగాలు కల్పించిందని తెలిపారు. డీఎస్సీపై ఆరోపణలు చేసిన వారిపై అధికారులు విశ్లేషణ చేశారని.. కొంతమందికి ఎందుకు ఉద్యోగం రాలేదో వివరించారని అన్నారు. వైసీపీ నేతలు తప్పుడం సందేహాలు క్రియేట్ చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. జగన్‌కు ఐదేళ్ల సమయం ప్రజలు ఇచ్చారని.. వారి హయాంలో జనం కోసం ఏమి చేయలేకపోయారని మండిపడ్డారు. బటన్ నొక్కితే చాలనే ఆలోచనతోనే జగన్ పని చేశారని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వంలో రెండేళ్లలో జరిగిన అభివృద్ధి.. వైసీపీ హయాంలోని ఐదేళ్లలో ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

# మధ్యనిషేధ హామీని గాలి కొదిలేసిన జగన్

### సిపిఎస్ రద్దు చేస్తామని మోసం చేసిన వైసిపి
### జాబ్ క్యాలెండర్ పేరుతోనూ మోసం చేశారు
### టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లతో భేటీ చంద్రబాబు విమర్శలు

అమరావతి,జూన్6: మద్యపానం నిషేధం చేస్తామని హామీ ఇచ్చి గొడ్డలి పార్టీ చేతులెత్తేసిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు.

వైసీపీ హయాంలో సీపీఎస్ వారం రోజుల్లో రద్దు చేస్తామని చెప్పి ఎందుకు పక్కన పెట్టేసిందని ప్రశ్నించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శిక్షణ పొందుతున్న క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై దిశనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు.

జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామని గొడ్డలి పార్టీ మాట తప్పిందని ధ్వజమెత్తారు. ఇంతటితో ఆగకుండా వ్యవస్థలను విధ్వంసం చేసిందని మండిపడ్డారు. వైసీపీ హయాంలో చెప్పినవి చేయకపోగా తమ ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ-2025పై బురద జల్లుతోందని ఆగ్రహించారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యపై ఎలా దుష్ప్రచారం చేసి లబ్ధి పొందారో... డీఎస్సీ విషయంలోనూ దుష్ప్రచారంతో లబ్ధిపొందాలనుకున్నారని దుయ్యబట్టారు.డీఎస్సీ నిర్వహణపై ఆధారాలతో సహా జగన్ అండ్ కోకు కౌంటర్ ఇచ్చామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన కౌంటర్‌తో గొడ్డలి పార్టీ నేతలు డిఫెన్సులో పడ్డారని చెప్పుకొచ్చారు. దుష్ప్రచారం చేయడం, ఫేక్ రాజకీయాలు చేయడం గొడ్డలి పార్టీ విధానం, సిద్ధాంతమని విమర్శించారు. అధికారంలో కేటాయింపుల వరకు నిరంతరం సర్వేలు చేయిస్తున్నామని తెలిపారు. ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రం, పార్టీ శ్రేయస్సు కోసం బాధ్యత తనదని... తనతో పాటు అలుపెరగకుండా యుద్ధం చేసే బాధ్యత టీడీపీ శ్రేణులదని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కేంద్రంలోనూ గతానికి మించి ఓట్లు రావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కార్యకర్తలను ఆదుకునేందుకు పార్టీ పరంగా



ఉన్నామని... సహనం, ఓపిక అవసరమని.. కానీ గొడ్డలి పార్టీ ఆగడాలు శ్రుతిమించితే వదిలిపెట్టమని హెచ్చరించారు.

మంచి ఆలోచనలు చేసే వాళ్లకు మంచి వాళ్లే సహాయపడతారని అన్నారు. చెడు ఆలోచనలు చేసే వాళ్ల చుట్టూ గొడ్డలి బ్యాచ్ జమ అవుతుందని ఎద్దేవా చేశారు. ఇకపై టీడీపీకి ఓటమి లేదని, రాదని తెలిపారు. ఆ స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలతో మంచిగా ఉంటున్నామని, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తున్నామని.. సంక్షేమ పథకాలు - అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు స్వేచ్ఛను ఇచ్చామని చెప్పుకొచ్చారు. ముఖ్యంగా ఆత్మవిమర్శ చేసుకుంటున్నామని.. అందుకే టీడీపీకి ఓటమి రాదని పేర్కొన్నారు. పార్టీ పదవులు మొదలుకుని టికెట్ల తప్పులు చేసిన వాళ్లని వదిలించుకుంటానని స్పష్టం చేశారు. ఎన్నికల్లో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఏం ప్రచారం చేశారో... అవన్నీ తమ ప్రభుత్వం చేస్తోందని అన్నారు. తమ ప్రభుత్వం చేస్తున్న మంచిని గడప గడపకు వెళ్లి చెప్పాలని దిశానిర్దేశర చేశారు. ఆనాడు చెప్పిన వాటిని ఈనాడు నెరవేరుస్తున్నామనే విషయాన్ని ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. మంగళగిరిలో టీడీపీ గెలిచి చాలా కాలమైందని... 2019 ఎన్నికల్లో నారా లోకేశ్ పోటీ చేసినా ఓడిపోయారని ప్రస్తావించారు. ఆ తర్వాత పట్టుపట్టి పనిచేశారని.. 2024లో అద్భుత విజయం సాధించారని ప్రశంసించారు. గెలిచిన తర్వాత కూడా మంగళగిరిలో లోకేశ్ చక్కగా పని చేస్తున్నారని.. ఇప్పుడు మంగళగిరి టీడీపీకి కంచుకోటగా మారిందని చెప్పుకొచ్చారు. యుద్ధాన్ని గెలిపించే చేయాల్సిందంతా చేస్తామని స్పష్టం చేశారు. కార్యకర్తలకు అన్నిరకాలుగా అండగా ఉంటామని... ప్రభుత్వం చేసే అభివృద్ధిని అందిపుచ్చుకునేలా కార్యకర్తలు ఆలోచించాలని అన్నారు. భవిష్యత్తు రాజకీయాలకు కూటమితోనే వెళ్తున్నామని.. వెళ్తామని స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ముందు బీజేపీతో పొత్తులో ఉన్నా కూడా ఓట్లు చీలకూడదనే.. టీడీపీతో కలుస్తానని పవన్ కల్యాణ్ చెప్పారని అన్నారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో కూటమిగా వెళ్లడంతోనే 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో గెలిచామని ప్రస్తావించారు. పార్టీ అగ్రనేతలు మొదలుకుని... కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ బ్రాడ్ మైండ్‌తో ఆలోచించాలని సీఎం చంద్రబాబు మార్గనిర్దేశర చేశారు.

## రష్యాలో కొనసాగుతున్న లోకేశ్ పర్యటన

### యాండెక్స్ ప్రతినిధులతో సమావేశం

మాస్కో,జూన్6:
ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ రష్యాలో పర్యటిస్తున్నారు.



ఈ సందర్భంగా ఆయన.. ప్రముఖ టెక్ సంస్థ యాండెక్స్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో అమరావతి, విశాఖపట్నంలో స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థల అమలుపై కీలక చర్చలు జరిగాయి.

ప్రిడిక్టివ్ ట్రాన్సిట్ షెడ్యూలింగ్, పబ్లిక్ సేఫ్టీ అనలిటిక్స్, ఎఐ ఆధారిత ట్రాఫిక్ మానిటరింగ్ సిస్టమ్స్‌ను రెండు నగరాల్లో ప్రవేశపెట్టే అవకాశాలను పరిశీలించినట్లు సమాచారం. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఆధునిక టెక్నాలజీ వినియోగంపై ప్రత్యేకంగా చర్చలు జరిగాయి. లాస్ట్ మైల్ రవాణా ఖర్చులను తగ్గించే మార్గాలపై కూడా లోకేష్ సూచనలు చేశారు. అలాగే క్విక్ కామర్స్, డెలివరీ ఫ్లీట్లలో ఆటోనమస్ వెహికల్స్ వినియోగంపై యాండెక్స్ బృందంతో చర్చించారు. విశాఖలో ఏర్పాటు చేయనున్న ఎఐ డేటా సెంటర్‌కు సాంకేతిక భాగస్వామ్యం, అలాగే హై-పెర్ఫార్మెన్స్ క్లౌడ్ ఫ్రేమ్‌వర్క్‌ల వినియోగంపై కూడా సమావేశంలో చర్చలు జరిగినట్లు తెలిసింది. స్థానిక పరిపాలనలో ఎఐ మోడల్స్ వినియోగంపై సమావేశంలో చర్చలు జరిపారు. రష్యాలోని స్బేర్ సిటీలో యాండెక్స్ ఉన్నతస్థాయి బృందంతో కూడా మంత్రి లోకేష్ భేటీ అయ్యారు. ఐదవ రోజు పలు కీలక సంస్థలతో ఆయన వరుస సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

## గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం

### 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్
### సంవృద్ధి కేంద్రాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి

గుంటూరు,జూన్6:
2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా ఉండాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.. భారత దేశం అభివృద్ధి చెందాలంటే గ్రామాలు అభివృద్ధి చెందాలన్నారు. గ్రామాల్లో డిజిటల్ సేవలు అందుబాటులోకి తెచ్చేలా సంవృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో సంవృద్ధి కేంద్రం ద్వారా పౌరసేవలు, డిజిటల్ సేవలను అందించనున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ఒక గ్రామం అభివృద్ధి చెందాలంటే వారికి అందిస్తున్న సేవలు ప్రజలకు చేరువలో ఉండాలని సూచించారు. శనివారం నాడు జిల్లాలోని చేబ్రోలు మండలం నారాకోడూరులో సంవృద్ధి కేంద్రాన్ని కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ప్రారంభించారు. 'కేంద్రం ఒక్కటి... సేవలు అనేకం' అనే నినాదంతో ప్రధాని నరేంద్ర మోదీ పని చేస్తున్నారని కేంద్ర మంత్రి తెలిపారు. సంవృద్ధి గ్రామ కేంద్రంగా నారాకోడూరు గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసినట్లు చెప్పారు. గ్రామంలో ఎక్కడికీ వెళ్లకుండా ఈ కేంద్రంలో అన్ని సేవలు అందుతాయని అన్నారు. దాదాపుగా 60 టెస్టులు కేంద్రంలో పది నిమిషాల్లో చూస్తారన్నారు. డ్వాక్రా మహిళలకు ఎలా వ్యాపారం చేయాలో నేర్పిస్తారని అన్నారు. పోస్ట్ ఆఫీసు సేవలు ఉంటాయన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ద్వారా విద్యార్థులకు కంప్యూటర్ నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. రైతుల ఆదాయం కోసం, భూమి సారం కోసం టెస్టులు చేస్తున్నారన్నారు. పంట పొలాలకు ఎరువు చల్లే విధంగా డ్రోన్ ఏర్పాటు చేశామన్నారు. నారాకోడూరు గ్రామంలో ఉన్న సంవృద్ధి కేంద్రం దేశంలో నంబర్ వన్‌గా నిలవాలని పెమ్మసాని చంద్రశేఖర్ ఆకాంక్షించారు. సంవృద్ధి గ్రామ కేంద్రాన్ని నారాకోడూరు గ్రామంలో పెట్టినందుకు కేంద్రానికి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ధన్యవాదాలు తెలియజేశారు. ఒక్క కేంద్రంలో అనేక సౌకర్యాలు ఉన్నాయన్నారు. నారాకోడూరు గ్రామంలో ఉన్న పిల్లలను రోజుకి గంట సమయం ఈ కేంద్రంలో గడిపేలా తల్లిదండ్రులు చూసుకోవాలని.. దీని ద్వారా వారి




భవిష్యత్తు మెరుగుపడుతుందని వెల్లడించారు. నారాకోడూరు గ్రామంలో ప్రతి ఇంటికి వ్థై÷ సదుపాయం కల్పిస్తున్నారని అన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి పని చేస్తోందన్నారు. 'మీరు మాకు ఇచ్చిన అధికారాన్ని గ్రామాల అభివృద్ధి, సంక్షేమం కోసం పని చేస్తాం. మాకు కులం లేదు, మా కులం ప్రజలకు సేవ చేయడమే' అని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పేర్కొన్నారు.

## రాయలసీమలోకి ప్రవేశించిన రుతుపవనాలు

### సాధారణం కంటే తక్కువ వర్షపాతం
### విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్

అమరావతి,జూన్6: రాయలసీమలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. రానున్న 2 నుంచి 3 రోజుల్లో నైరుతి రుతుపవనాలు రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తరించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ ఏడాది రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. ఈ మేరకు ప్రఖర్ జైన్ ఈరోజు(శనివారం) ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక వాతావరణ మార్పులతో కొంత మేర వర్షలోటు భర్తీ అయ్యే సూచనలు ఉన్నాయని తెలిపారు. రుతుపవనాల గమనంలో తరచూ విరామాలు ఉండే అవకాశం ఉందని వెల్లడించారు. రైతులు పంట ప్రణాళికల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



పోలవరం, గోదావరి జిల్లాలు, రాయలసీమలో తక్కువ వర్షపాతం అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వివరించారు. ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అధిక వర్షపాతం సూచనలు ఉన్నాయని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. రేపు, ఎల్లుండి రాష్ట్రంలో పిడుగులతో కూడిన వర్షాలు పడతాయని హెచ్చరించారు. పల్నాడు, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వివరించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని తెలిపారు. 58 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 104 మండలాల్లో వడగాడ్పులు ఉన్నాయని హెచ్చరించారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో వడగాడ్పుల ప్రభావం అధికంగా ఉందని వెల్లడించారు. పలు జిల్లాల్లో 42 నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ చెప్పుకొచ్చారు. కృష్ణా జిల్లా పెదపారుపూడిలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని తెలిపారు. మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని అన్నారు. ప్రజలు ఎండల తీవ్రతపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉరుములు, పిడుగుల సమయంలో చెట్ల కింద నిలబడొద్దని హెచ్చరించారు. రైతులు, పశు కాపరులు మేఘావృత వాతావరణంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎండలో బయటకు వెళ్లేవారు నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరి నీరు తీసుకోవాలని తెలిపారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ప్రఖర్ జైన్ పేర్కొన్నారు.

## ఎన్టీపిసి ప్లై యాష్‌తో కాలుష్యం

### నివారణ చర్యలపై అధికారులతో పవన్ సమీక్ష

విజయవాడ,జూన్6: ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ నుంచి వెలువడుతున్న ఫ్లై యాష్ (బూడిద) కాలుష్య సమస్య ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి చేరింది. మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, జనసేన నాయకుడు అక్కల గాంధీ ఈ సమస్యను పవన్ కల్యాణ్‌కు వివరించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మూలపాడు గ్రామానికి వచ్చిన పవన్ కల్యాణ్‌ను స్థానిక నాయకులు కలిసి ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. విద్యుత్ కేంద్రం నుంచి వెలువడుతున్న యాష్ కారణంగా పరిసర గ్రామాల్లో పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి, వ్యవసాయ భూములకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై పవన్ కల్యాణ్ సుమారు అరగంట పాటు స్థానిక నాయకులు, సంబంధిత వర్గాలతో చర్చించారు. బూడిద కాలుష్యం వల్ల రైతులు, గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఎన్టీటీపీఎస్ నుంచి వెలువడే౹÷÷-ల యాష్ కారణంగా చెట్లు, పంటలు, పశువులు ప్రభావితమవుతున్నాయని, గ్రామాల్లో గాలి కాలుష్యం పెరుగుతోందని స్థానికులు చాలా కాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్య తీవ్రతను గుర్తించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఏపీ జెన్కో అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలుష్య నియంత్రణకు సంబంధించిన అంశాలను పరిశీలించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచిస్తామని తెలిపారు.

## రాజ్యసభకు లింగమనేని నామినేషన్

### కూటమి ఎమ్మెల్యేలు మద్దతుగా హాజరు
### స్వగ్రామంలో రమేశ్‌కు మద్దతుగా సంబరాలు

అమరావతి,జూన్6: రాజ్యసభ అభ్యర్థిగా జనసేన తరఫున లింగమనేని రమేష్ అసెంబ్లీలో నామినేషన్ దాఖలు చేశారు. రమేష్ నామినేషన్ పై ఆరుగురు జనసేన ఎమ్మెల్యేలు, ముగ్గురు తెదేపా ఎమ్మెల్యేలు, ఒక భాజపా ఎమ్మెల్యే సంతకాలు చేశారు. రమేష్ వెంట మద్దతుగా కూటమి ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, బొలిశెట్టి శ్రీనివాస్ నాయకర్, వంశీకృష్ణ శ్రీనివాస్, దేవ వరప్రసాద్, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, కాగిత కృష్ణ ప్రసాద్, నక్కా ఆనంద్ బాబు, ఎన్ ఈశ్వర రావు (బీజేపీ) వెళ్లారు. జనసేన రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేశ్ నామినేషన్ దాఖలు చేశారు. రమేశ్ నామినేషన్‌ను 10 మంది కూటమి ఎమ్మెల్యేలు ప్రతిపాదించారు. రమేష్ నామినేషన్‌పై ఆరుగురు జనసేన ఎమ్మెల్యేలు, ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలు, ఒక బీజేపీ ఎమ్మెల్యే సంతకాలు చేశారు. లింగమనేని వెంట మద్దతుగా కూటమి ఎమ్మెల్యేలు వెళ్లారు. జనసేన అభ్యర్థిగా రాజ్యసభకు నామినేషన్ వేసినట్లు రమేశ్ తెలిపారు. తనకు అవకాశం కల్పించిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. తన అభ్యర్థిత్వాన్ని బలపరిచిన ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకు లింగమనేని రమేశ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నిక అయ్యాక అందరితో మరోసారి మాట్లాడుతానని రమేశ్ వెల్లడించారు. ఇదిలావుంటే లింగమనేని రమేశ్ రాజ్యసభకు ఎంపికవడంపై స్వగ్రామం మొవ్వ మండలం పెద్ద ముత్తెవిలో సంబరాలు అంబరాన్నంటాయి. రమేశ్.. గ్రామస్థాయి నుంచి రాజ్యసభ వరకు ఎదిగారని గ్రామస్థులు తెలిపారు. పెదముత్తేవి శ్రీలక్ష్మీపతి స్వామి ఆలయంలో రమేశ్ విజయానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టుదలతో చిన్న వ్యాపారాల నుంచి రమేశ్ ఎదిగారని హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామలింగేశ్వరరావు అన్నారు. రమేశ్‌కు ఇంకా ఉన్నత పదవులు రావాలని గ్రామస్థులు ఆకాంక్షించారు.

## భువనగిరి మార్కెట్‌లో జంక్షన్ బాక్సుల ధ్వంసం

### విలువైన వైర్లు కత్తిరించి ఎత్తుకెళ్లిన దొంగలు

భువనగిరి,జూన్6(సాక్ష్యం): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో భారీ చోరీ ఘటన వెలుగు చూసింది. గుర్తు తెలియని దుండగులు రాత్రి వేళ మార్కెట్ ప్రాంగణంలోకి ప్రవేశించి విద్యుత్ వ్యవస్థకు సంబంధించిన జంక్షన్ బాక్స్‌లను ధ్వంసం చేసి సుమారు రూ.25 లక్షల విలువ గల విద్యుత్ వైర్లను శుక్రవారం రాత్రి ఎత్తుకెళ్లినట్లు అధికారులు తెలిపారు. సమాచారం ప్రకారం ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ సరఫరా వ్యవస్థలో భాగంగా ఉన్న జంక్షన్ బాక్స్‌లను దుండగులు లక్ష్యంగా చేసుకున్నారు. ముందుగా విద్యుత్ కనెక్షన్లను ధ్వంసం చేసి, విద్యుత్ వైర్లను కత్తిరించి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. శనివారం ఉదయం విధులకు వచ్చిన సిబ్బంది జంక్షన్ బాక్స్‌లు ధ్వంసమై ఉండడాన్ని గమనించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన అధికారులు ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు రూ.25 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. మార్కెట్‌లో విద్యుత్ సరఫరా వ్యవస్థకు అంతరాయంతో పాటు ప్రభుత్వ ఆస్తికి భారీ నష్టం సంభవించిందని తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో విద్యుత్ వైర్లు చోరీ కావడం స్థానికంగా సంచలనం రేపింది. మార్కెట్ వంటి కీలక ప్రభుత్వ ప్రాంగణంలో భద్రతా లోపాలు ఎలా చోటు చేసుకున్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాత్రి వేళల్లో నిఘా, సీసీ కెమెరాల పర్యవేక్షణ, భద్రతా సిబ్బంది విధులపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనపై మార్కెట్ అధికారులు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. చోరీ జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తూ దుండగుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నేరంలో పాల్గొన్న వారిని త్వరలోనే గుర్తించి చట్టపరమైన తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ప్రభుత్వ ఆస్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వంటి ప్రధాన కేంద్రాల్లో రాత్రి వేళల్లో నిఘాను మరింత కట్టుదిట్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ఇసుక అక్రమ రవాణా నిరోధానికి చర్యలు

### అధికారును ఆదేశించిన మంత్రి వివేక్

హైదరాబాద్,జూన్6(సాక్ష్యం): రాష్ట్రంలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై మంత్రి వివేక్ వెంకటస్వామి సీరియస్ అయ్యారు.అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు నిఘా వ్యవస్థ బలోపేతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. లారీల కదలికలపై నిరంతరం పర్యవేక్షించాలని హుకుం జారీ చేశారు. ఇసుక ఆదాయం పెంపుపై టీజీఎండీసీ అధికారులతో మంత్రి వివేక్ వెంకటస్వామి శనివారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ఇసుక నిర్వహణలో పూర్తి పారదర్శకత పాటించాలని దిశానిర్దేశర చేశారు. అలాగే, సాండ్ బజార్ల పనితీరుపై మంత్రి వివేక్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కీలక ఖనిజాల అన్వేషణ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఖనిజ వనరుల సమర్థ నిర్వహణకు అమలు వ్యవస్థ పటిష్ఠం చేయాలని సూచించారు. అక్రమ మైనింగ్ నియంత్రణ చర్యలను మంత్రికి.. టీజీఎండీసీ అధికారులు వివరించారు. రాష్ట్ర ఖనిజ రంగంలో ఆదాయ వృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

## తల్లిదండ్రులను పట్టించుకోని కొడుకులకు బుద్ధి

### సొంతింటిని వృద్ధులకు అప్పగించిన అధికారులు

మిర్యాలగూడ,జూన్6(సాక్ష్యం): వృద్ధ తల్లిదండ్రులను దూరం కొట్టిన కొడుకులకు కలెక్టర్ గట్టి బుద్ధి చెప్పారు. వారి ఇంటిని వారికి స్వాధీనం చేయించారు. వివరాల్లోకి వెళితే..నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో గల హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన ఇంజం చంద్రకళ భర్త రమణారెడ్డి(70) వయోవృద్ధులు. వీరికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉంది. వారి విద్యాభ్యాసం, పెళ్లిళ్లు వంటి బాధ్యతలు అన్ని నిర్వర్తించడం జరిగింది. వీరికి సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం ఇంజంవారిగూడెంలో వ్యవసాయ భూమి, మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఓ ఇళ్లు కలదు. వీరి పేరు మీద ఉన్నటువంటి ఇంటిలో కుమారుడు గత ఐదేండ్లుగా నివాసం ఉంటూ తల్లిదండ్రులను రానివ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. పక్షవాతం, మోకాళ్ల ఆపరేషన్, ఇతర అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న వయోవృద్ధులు ఆర్డీఓ ట్రిబ్యునల్ అలాగే అప్పిలేట్ ట్రిబ్యునల్, సీనియర్ సిటిజెన్స్ చట్టాన్ని ఆశ్రయించడంతో వయోవృద్ధుల చట్టం 2007ను అనుసరించి జిల్లా కలెక్టర్ గత నెల 15వ తేదీన సదరు ఆస్తిని వారికి స్వాధీనపరచాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను అమలు పరచాల్సిందిగా ఆర్డీఓ ఎస్.రమణారెడ్డి వివిధ డిపార్ట్‌మెంట్ల సమన్వయంతో జరపాలని గత 23వ తేదీ ఉత్తర్వులు ఇవ్వడంతో ఉత్తర్వుల అమలులో భాగంగా మున్సిపల్ కమిషనర్ నర్రా శ్రీజా రెడ్డి, స్థానిక సీఐ నాగభూషణం, తాసీల్దార్ సిబ్బంది, రెవెన్యూ, మహిళా శిశు , దివ్యాంగుల వయో వృద్ధుల శాఖ అందరు కలిసి ఆ వయో వృద్ధులను శనివారం వారి ఇంటిలోకి చేర్చడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సైదులు, అనిల్ కుమార్, గోపమ్మ, మున్సిపల్ సిబ్బంది సాజిద్, సాంబయ్య, రెవెన్యూ శాఖ నుండి రాజు, ఆర్ఐ, సిడిపిఓ కార్యాలయం నుండి రాములు గారు నాగిరెడ్డి నవీన్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆనంద్‌నగర్ కాలనీలో లిఫ్ట్ ప్రమాదం

### మహిళ మృతి.. బాలుడికి తీవ్ర గాయాలు

హైదరాబాద్,జూన్6(సాక్ష్యం): ఖైరతాబాద్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. ఆనంద్ నగర్ కాలనీలో ఉన్న భావన అపార్ట్‌మెంట్స్‌లో లిఫ్ట్ ప్రమాదంలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోగా, ఆమెతో ఉన్న మనవడు గాయపడ్డాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ ఆనంద్ నగర్ కాలనీలోని భావన అపార్ట్‌మెంట్స్ లో లిఫ్ట్‌లో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రాధ (58) అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ప్రమాదం అపార్ట్‌మెంట్ 5వ అంతస్తులో జరిగింది. లిఫ్ట్ పూర్తిగా ఆ అంతస్తుకు చేరుకోకముందే బాధితురాలు తలుపు తెరిచింది. దీంతో ఆమె ఒక్కసారిగా లిఫ్ట్ గుంతలో పడిపోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. ఆమెతో పాటు ఉన్న 13 నెలల మనవడు జియోల్ గాయపడటంతో వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ ఘటన అనంతరం అపార్ట్‌మెంట్ నివాసితులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

## కరీంనగర్‌లో కూలిన లిఫ్ట్

కరీంనగర్,జూన్6(సాక్ష్యం): మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు పెను ప్రమాదం తప్పింది. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ జన్మదిన వేడుకల్లో పాల్గొనేందుకు కరీంనగర్‌కు ఎమ్మెల్యే వెళ్లారు. అయితే, కెమిస్ట్ భవన్ రెండో అంతస్తు నుంచి దిగుతూ లిఫ్ట్ ప్రమాదానికి గురైంది. సాంకేతిక కారణాల వల్ల లిఫ్ట్ ఒక్కసారిగా రెండో అంతస్తు నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కు పడిపోయింది. ప్రమాద సమయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లితో పాటు లిఫ్ట్‌లో మరో ఆరుగురు ఉన్నారు. ఏం జరుగుతుందో అర్థం కాక వారంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సిబ్బంది వెంటనే స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడటంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు, ఎమ్మెల్యే కవ్వంపల్లి లిఫ్ట్ ప్రమాదానికి గురయ్యారని తెలుసుకున్న నియోజకవర్గ ప్రజలు, ఆయన అభిమానులు ఆందోళన చెందారు.

# మహిళల భద్రతకు కీలక అడుగు

మొదటిపేజీ తరువాయి..

ప్రారంభించారు. తొలి విడతలో 55 మంది మహిళలకు స్త్రీ రైడర్లుగా అవకాశం కల్పించారు. అంబర్‌పేట పోలీస్ లైన్స్‌లో వీరికి టూ వీలర్,



త్రీ వీలర్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చారు. 55 మంది మహిళలకు ఈమేరకు డ్రైవింగ్ లైసెన్సులు అందజేశారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు సురక్షిత రవాణా సేవలు అందించేలా ఈ కార్యక్రమం చేపట్టారు. జొమాటో, స్విగ్గీ తరహా డెలివరీ సేవల్లో మహిళల భాగస్వామ్యంపై డీజీపీ హర్షం వ్యక్తం చేశారు. నాలుగు నెలల్లో మహిళా రైడర్ల సంఖ్యను మూడింతలు పెంచాలన్నారు. మహిళల ఉపాధి, సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తోందని పేర్కొన్నారు. ఇప్పటివరకు గిగ్ వర్క్‌లో పురుషులు ఉండేవారని, ఇప్పటినుంచి మహిళలు కూడా రాబోతున్నారని తెలిపారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా సాధికారిత సాధించాలని ఆనంద్ వ్యాఖ్యానించారు. హైదరాబాద్ సిటీ పోలీస్ చరిత్రలో లా అండ్ ఆర్డర్ పోలీసుస్టేషన్‌కు.. మహిళా ఎస్‌హెచ్‌వో లేరని డీజీపీ ఆనంద్ వివరించారు. తాను హైదరాబాద్ సీపీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మహిళా ఇన్‌స్పెక్టర్లను ఎస్‌హెచ్‌వోలుగా నియమించానని ప్రస్తావించారు. ఇప్పుడు 55 మంది మహిళలు ప్యాసింజర్ రవాణా సేవలు అందిస్తున్నారని వెల్లడించారు. భవిష్యత్తులో తెలంగాణ అంతటా లాజిస్టిక్, కార్గో, డెలివరీ సర్వీసెస్‌లో మహిళా డ్రైవర్లకు అవకాశం కల్పిస్తామని చెప్పుకొచ్చారు. దేశ జీడీపీ పెరగాలంటే మహిళలు కూడా ధైర్యంగా బయటకు వచ్చి పని చేయాలని డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

మొదటిపేజీ తరువాయి..

పాల్గొన్నారు. ఇది సుదీర్ఘ పోరాటమని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ ఆరంభం మాత్రమేనని సీజేపీ స్పష్టం చేసింది. సీజేపీ పెట్టారని అన్నారు. సీజేపీ అకౌంట్లు హ్యాక్ చేయడం, పోస్టులు డిలీట్ చేయడం చేస్తున్నారని చెప్పారు. పోస్టులను డిలీట్ చేయవచ్చు కానీ, తమను ఏమార్చలేరని అన్నారు. పేపర్ లీక్‌లు, విద్యావ్యవస్థలో తప్పిదాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల పేర్లను ఆయన చదవి వినిపించారు. విద్యార్థుల మృతికి సీజేపీ సంతాపం ప్రకటించింది. జంతర్‌మంతర్ నిరసనల్లో పాల్గొనేందుకు ఆయన అమెరికాలోని బోస్టన్ నుంచి ఢిల్లీకి వచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రను చేత్తో పట్టుకుని కనిపించారు. జంతర్ మంతర్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ విద్యాశాఖ మంత్రిగా



మద్దతుదారులను ఉద్దేశించి అభిజీత్ దీప్కే మాట్లాడుతూ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంత వరకూ నిరసనలు కొనసాగుతాయని ప్రకటించారు. ఇంకెంతమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునేంత వరకూ అధికారులు వేచిచూస్తారని నిలదీశారు. తమ డిమాండ్ల నెరవేరేంత వరకూ ఈ ఉద్యమం కొనసాగుతుందన్నారు. నిరసనలకు దిగితే జైలులో పెడతారేమోనని తన తల్లి భయపడినట్టు దీప్కే చెప్పారు. 'తమ పిల్లలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పితే ఏమవుతుందోనన్న భయం ఈ దేశంలోని ప్రతి తల్లికి ఉంది. ఈ ప్రభుత్వానికి భయపడి ఎంతకాలం బతకాలని ఆయన ప్రశ్నించారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని నెలరోజుల నుంచి డిమాండ్ చేస్తున్నప్పటికీ చర్చలు తీసుకోవడం లేదని, దీనికి బదులు ఇతర అంశాలపైనే వాళ్లు దృష్టి ఆయన ఉండాలని కోరారు. అయితే తనకు రాజకీయాల్లో ప్రవేశించాలనే ఆలోచన లేదని వాంగ్‌చుక్ స్పష్టం చేశారు. యువకులే ఆ బాధ్యత చేపట్టాలన్నారు. రాజకీయవేత్తలు, ప్రభుత్వ అధికారుల పిల్లలు ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చదవాలని తాను కోరుకుంటు న్నట్టు చెప్పారు. సీజేపీ నిరసనలకు ప్రభుత్వం అనుమతించడాన్ని ఆయన స్వాగతించారు. నిరసన తెలపడం తనకు ఇష్టం లేకున్నా న్యాయం కోసమే ఆ పని చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న విద్యావ్యవస్థలో మార్పు జరగాలని అన్నారు. కాగా, తదుపరి నిరసన ప్రదర్శనను జూన్ 23న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించే ఆలోచనలో సీజేపీ ఉంది. ఈ కార్యక్రమంలో వందలాదిమంది యువత పాల్గొని కాక్రోజ్ జనతాపార్టీకి మద్దుతగా నిలిచారు.

# ఇంధన దిగుమతులపై సమాలోచనలు

మొదటిపేజీ తరువాయి..

చేయడం వంటి అంశాలపై దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితులు నెలకొన్న వేళ భారత ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఆర్థిక సలహా మండలి(ఈఏసీ) సభ్యులతో



సమావేశమయ్యారు. మన దేశ ఆర్థిక వృద్ధిని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన వ్యూహాలు, చర్యలు గురించి చర్చించారు. సామాన్య ప్రజల జీవన సౌలభ్యం, వ్యాపార నిర్వహణ సౌలభ్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా చేపట్టాల్సిన సంస్కరణలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు భారత్‌పై, అలాగే ప్రపంచంపై చూపే ప్రభావంపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశం జరిగిన మరుసటి రోజే ఈ సమావేశం జరగడం గమనార్హం. కాగా, శుక్రవారం ఆర్‌బీఐ గవర్నర్ కీలక ప్రకటనలు చేశారు. ప్రస్తుతం భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణంపై ఆందోళనలు, సప్లై చెయిన్ అంతరాయాలు ఉన్నప్పటికీ, రెపోరేటును 2.52 శాతం వద్ద యథాతథంగా ఉంచుతున్నట్లు ప్రకటించారు. ఈ విషయంలో తాము తటస్థ వైఖరిని అవలంబిస్తున్నామని స్పష్టం చేశారు. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ, స్థూల ఆర్థిక పరిస్థితులను సమీక్షించిన తర్వాత, లిక్విడిటీ అడ్జస్ట్‌మెంట్ ఫెసిలిటీ కింద రెపో రేటును మార్చకుండా 5.25 శాతం వద్దే ఉంచాలని ఎంపీసీ నిర్ణయించిందని చెప్పారు. దీని ప్రకారం, స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ 5 శాతం వద్ద, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ, బ్యాంక్ రేటు 5.5 వద్ద కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన అనిశ్చితితో ఉందని, కీలకమైన వాణిజ్య మార్గాలు, సప్లై చెయిన్‌లకు అవాంతరాలు ఏర్పడుతున్నాయని అన్నారు. వీటికి తోడు మార్కెట్ ఒడుదొడుకులు లాంటి సవాళ్లు ఎదుర్కొంటున్నామని ఆయన పేర్కొన్నారు. అయితే గతంలో వచ్చిన ఇలాంటి పరిస్థితులతో పోల్చితే, నేడు భారత్ మరింత పటిష్ఠంగా ఉందని, సంక్షోభాలను సమర్థవంతంగా ఎదుర్కొంటోందని అన్నారు. అయితే ప్రస్తుతం ఎదురవుతున్న అవాంతరాలను మనదేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి వచ్చిన ఒక అవకాశంగా పాలసీదారులు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. పశ్చిమాసియా సంక్షోభం తీవ్రమవుతున్న నేపథ్యంలో, గత నెలలో ప్రధాని మోదీ భారత పౌరులకు 7 విజ్ఞప్తులు చేశారు. ప్రధానంగా దిగుమతి చేసుకునే ఇంధనంపై ఆధారపడడం తగ్గించాలని, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ఉపయోగించి, దేశ ఆర్థిక రక్షణకు సహకరించాలని ప్రజలను కోరారు. వీటితోపాటు ఇంటి నుంచి పనిచేయడం (వర్క్ ఫ్రమ్ హోమ్)కు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇంధన వినియోగాన్ని తగ్గించాలని అన్నారు. కనీసం ఒక ఏడాదిపాటు విదేశీ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు. స్వదేశీ ఉత్పత్తులను మాత్రమే వాడాలని, వంట నూనెల వినియోగాన్ని తగ్గించాలని అన్నారు. ప్రకృతి వ్యవసాయం (నేచురల్ ఫార్మింగ్) వైపు మళ్లాలని, బంగారం కొనుగోళ్లను నియంత్రించాలని పేర్కొన్నారు. అంతేకాదు ముడి చమురు ధరల్లో వచ్చే ఒడుదొడుకులను తట్టుకోవడానికి, భారతదేశ రవాణా విధానంలో మార్పు రావాలని ప్రధాని మోదీ కోరారు. మెట్రో, ప్రభుత్వ రవాణా సౌకర్యాలను ఉపయోగించాలని, పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేటు వాహనాలు తప్పనిసరి అయినప్పుడు 'కార్ పూలింగ్' పద్ధతిని ఎంచుకోవాలని, వీలైనంత వరకు ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగాన్ని పెంచాలని సూచించారు. వస్తువుల రవాణా కోసం రైల్వే మార్గాలను వాడుకోవాలని అన్నారు. ఇదిలా ఉండగా, జూన్ 5న విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం, 2025–26 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (క్యూ4)లో భారత ఆర్థిక వ్యవస్థ మార్కెట్ అంచనాలకు మించి రాణించింది. వార్షిక ప్రాతిపదికన వాస్తవ స్థూల దేశీయోత్పత్తి (రియల్ జీడీపీ) వృద్ధిరేటు 7.8 శాతంగా ఉండగా, పూర్తి సంవత్సర వృద్ధి రేటు 7.7 శాతంగా నమోదు అయ్యింది. స్థిర ధరల ప్రకారం, 2025–26 నాలుగో త్రైమాసికంలో వాస్తవ జీడీపీ రూ.87.77 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ఇది గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.81.40 లక్షల కోట్ల కోట్ల కంటే చాలా ఎక్కువ. ఇక ప్రస్తుత త్రైమాసికానికి నామినల్ జీడీపీ రూ.94.65 లక్షల కోట్లుగా అంచనా.

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

మొదటిపేజీ తరువాయి..

ఇరాన్ డ్రోన్ల వల్ల తక్షణ ముప్పు పొంచి ఉందని అమెరికా సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది. ఆత్మరక్షణ చర్యల్లో భాగంగానే జలసంధిలోని ఒక ద్వీపంతో పాటు ఇరాన్ తీరంలోని కీలక రాడార్ సైట్‌లపై తాము దాడులు చేసినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. మరోవైపు, ప్రపంచ ఇంధన సరఫరాకు గుండెకాయ లాంటి హోర్ముజ్ జలసంధిపై పట్టు సాధించేందుకు ఇరాన్ ప్రయత్నిస్తుండగా, అందుకు ప్రతిగా అమెరికా ఇరాన్ రేవులపై ఆంక్షలు, దిగ్బంధనాన్ని విధిస్తోంది. ఈ వారంలోనే కువైట్ ప్రధాన విమానాశ్రయంలోని ప్యాసింజర్ టెర్మినల్‌పై ఇరాన్ డ్రోన్లు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరు మరణించగా, డజన్ల కొద్దీ ప్రయాణికులు గాయపడ్డారు. దీనివల్ల ఎయిర్‌ఫీల్డ్ తాత్కాలికంగా మూతపడింది. ఈ దాడితో తీవ్ర ఆగ్రహానికి గురైన అమెరికా, తాజా ఘర్షణతో ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు పంపింది. రాడార్ సైట్‌లపై దాడులతో పాటు, హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తున్న ఇరాన్ లింక్డ్ చమురు ట్యాంకర్‌ను అమెరికా సైన్యం తమ ఆధీనంలోకి తీసుకుంది. ఆంక్షల పరిధిలో ఉన్న చమురును విక్రయించడం ద్వారా ఇరాన్ లాభపడకుండా అడ్డుకునేందుకు అమెరికా ఈ చర్య చేపట్టింది. అలాగే, ఇరాన్ ఇంధన రంగానికి సహాయం చేస్తున్న పలువురు వ్యక్తులు, సంస్థలు, ట్యాంకర్లపై అమెరికా కొత్తగా మరికొన్ని ఆర్థిక ఆంక్షలను విధించింది. ఇరాన్–అమెరికా ఘర్షణ కేవలం జలసంధికే పరిమితం కాలేదు. అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, లెబనాన్ ప్రభుత్వాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ మద్దతున్న హెజ్‌బొల్లా ఉగ్రవాద సంస్థ తిరస్కరించింది. ఈ క్రమంలో శుక్రవారం ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ లెబనాన్‌లోని ఎక్కువ భాగాన్ని ఇజ్రాయెల్ ఇప్పటికే తన ఆధీనంలోకి తెచ్చుకుంది. మరోవైపు, హోర్ముజ్ జలసంధి తెరవాలన్నా, శాశ్వత కాల్పుల విరమణ కుదరాలన్నా లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు ఆగాలని ఇరాన్ పట్టుబడుతోంది.

## నీట్ రీ ఎగ్జామ్ పేపర్ లీక్ పుకార్లు

మొదటిపేజీ తరువాయి..

కంటెంట్‌ను గుర్తించి.. వాటిని తక్షణమే తొలగించేలా చర్యలు తీసుకొనేందుకు ఆయా ఎ÷–లాట్‌ఫాంలు, సైబర్ క్రైమ్ అధికారులకు నివేదిస్తున్నట్లు తెలిపింది. ఇలాంటి మోసపూరిత కంటెంట్‌ను సృష్టించి.. ప్రచారం చేయడం, ఇతరులకు ఫార్వార్డ్ చేయడం ద్వారా విద్యార్థుల్ని తప్పుదారి పట్టించే ప్రయత్నం తీవ్రమైన నేరమని హెచ్చరిస్తూ.. దీనిపై అధికారికంగా ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొంది. ఇలాంటి కంటెంట్‌ను ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది.

అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, మోసగాళ్ల మాటలు నమ్మొద్దని విజ్ఞప్తి చేసింది. బయట వచ్చే ఊహాగానాలను నమ్మొద్దని, ఎన్‌టీఏ వెర్గి÷డ్ ఛానల్స్‌లో వచ్చిన సమాచారాన్ని మాత్రమే నమ్మాలని కోరింది. దేశ వ్యాప్తంగా మే 3న నీట్ పరీక్ష జరగ్గా.. ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం తీవ్ర దుమారం సృష్టించిన విషయం తెలిసిందే. ఎన్‌టీఏ పనితీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతో మే 12న ఆ పరీక్షను రద్దు చేసి తిరిగి జూన్ 21న నిర్వహిస్తామని ఎన్‌టీఏ ప్రకటించింది. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కేసు నమోదు చేసిన సీబీఐ ప్రస్తుతం దర్యాప్తు కొనసాగిస్తోంది. మరోవైపు, నీట్ యూజీ రీఎగ్జామ్ ప్రశ్నపత్రాన్ని ఆర్థిక మంత్రిత్వశాఖకు చెందిన సురక్షితమైన ప్రింటింగ్ ప్రెస్‌లో ముద్రించే అవకాశం ఉందంటూ వచ్చిన వార్తలను కేంద్రం ఖండించింది. ఇది పూర్తిగా అవాస్తవమని తేల్చి చెప్పింది. ఆర్థికశాఖ నీట్ యూజీ రీఎగ్జామ్ పేపర్‌ని ముద్రించడంలేదని స్పష్టం చేస్తూ పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం 'ఎక్స్'లో ఓ పోస్టు పెట్టింది. అధికార వర్గాల సమాచారాన్ని మాత్రమే నమ్మాలని కోరింది.

## కాంగ్రెస్ పాలనలో పాలమూరుకు ద్రోహం

**తెలంగాణ నీటిని ఏపీకి దోచిపెట్టే కుట్ర**
**సగునీటి సలహారుగా ఆంధ్రాప్రాంత వ్యక్తి**
**మీడియా సమావేశంలో మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్**

మహబూబ్‌నగర్,జూన్6(సాక్ష్యం): కాంగ్రెస్ పాలనలో అన్ని జిల్లాల కంటే ఎక్కువ నష్టం మహబూబ్‌నగర్ కు జరిగిందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణ నీటిని ఆంధ్రాకు దోచిపెట్టే కుట్రలు జరుగుతున్నాయని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆంధ్రా వ్యక్తిని సాగునీటి సలహాదారుగా పెట్టి తెలంగాణకు అన్యాయం చేశారని మండిపడ్డారు. ఏపీకి నీళ్లు తీసుకుపోయి పాలమూరును ఎండబెడతారంట అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే టెండర్లు పిలిచి పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. నిన్న మంత్రి, ముఖ్యమంత్రి మాటలకు ప్రజల నుంచి స్పందన లేదని తెలిపారు. ఇప్పటికైనా చిల్లర మాటలను సీఎం రేవంత్ రెడ్డి మానుకోవాలని హితవుపలికారు. పాత చింతకాయ పచ్చడిలా రేవంత్ రెడ్డి ప్రసంగం ఉందని ఎద్దేవా చేశారు.మహబూబ్‌నగర్‌లో శనివారం ఉదయం



మాజీ మంత్రి లక్ష్మారెడ్డితో కలిసి శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. సీఎం పర్యటన గురించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు ఆశతో ఎదురు చూశారని తెలిపారు. కానీ ఉమ్మడి జిల్లా ప్రజలకు సీఎం ఇచ్చింది ఏమీ లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి వచ్చి కేసీఆర్ కట్టిన పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్లను పరిశీలించిన వెళ్లారని తెలిపారు. కర్ణాటక జల దోపిడీకి మనం నిధులు ఇవ్వడమేంటని ఆయన ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్టును సీఎం ఎందుకు వ్యతిరేకించడం లేదని నిలదీశారు. ఇప్పటికే జూరాలకు చుక్కనీరు వస్తలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రాజెక్టులను పడావు పెడుతున్నదని విమర్శించారు. కర్ణాటకలో చర్చలు కొలిక్కి రాకుండానే బ్యారేజి కమ్ బరాజ్‌లపై ఎలా ఏరియల్ సర్వే చేశారని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు చంద్రబాబు ఎన్‌వోసీ ఇస్తే బనకచర్లపై సీఎం రేవంత్ రెడ్డి ఆలోచిస్తానని అంటున్నారని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తెలంగాణ జల హక్కులపై చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. మీరు తిరిగే రిజర్వాయర్‌లు కట్టింది కేసీఆర్ కాదా అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టు నిర్మాణానికి ట్టటెడు మట్టిని కూడా రేవంత్ ప్రభుత్వం తీయలేదని విమర్శించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును డిజైన్ చేసింది 45 కిలోమీటర్ల కాలువలు అని.. అందులో41 కిలోమీటర్ల కాలువలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని తెలిపారు. మొత్తం రూ.33,500కోట్ల పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన పనులను కాంగ్రెస్ చేసిందని చెప్పుకుంటారా అని సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. పాలమూరు–రంగారెడ్డి పనుల జాప్యానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందని అన్నారు.

### ఎస్ ఐని కలిసి శుభాకాంక్షలు
## తెలిపిన తెలంగాణ ఉద్యమకారులు



**ఖానాపురం జూన్ 6 (సాక్ష్యం న్యూస్):** వరంగల్ జిల్లా ఖానాపురం పోలీస్ స్టేషన్ నూతన ఎస్ ఐగా బాధ్యతలు స్వీకరించిన గుగులోత్ రామ్మోహన్‌ని తెలంగాణ ఉద్యమకారులు శనివారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అడ్వకేట్ నందగిరి రజినీకాంత్, కందికట్ల జయ, ఖానాపురం ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు వీరమల్ల రాములు, సీనియర్ ఉద్యమకారుడు కుంచారపు వెంకట్ రెడ్డి, ఉద్యమకారుల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి గాదె రాజు, మెరుగు గంగాధర్, కొత్త వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ
## ప్రశిక్షణ మహాభియన్‌కు తరలివెళ్ళిన నేతలు



**హైదరాబాద్, జూన్ 6, (సాక్ష్యం న్యూస్):** యాదాద్రి జిల్లా లో శనివారం నుండి ఆదివారం సాయంత్రం వరకు భారతీయ జనతా పార్టీ నిర్వహిస్తున్న 48 గంటల పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియన్-2026 జిల్లా ప్రశిక్షణ శిబిరానికి ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్ బిజెపి నాయకులు తరలివెళ్లారు. శిబిరానికి తరలివెళ్ళిన వారిలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ శ్రీ ఎ.వినయ్ కుమార్, గాంధీనగర్ డివిజన్ బిజెపి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నవీన్, ఆనంద్ రావు, ఎం.ఉమేష్, సాయి యాదవ్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

### జనశక్తి రాష్ట్ర కమిటి
## సభ్యుడు కృష్ణారెడ్డి 34వ వర్ధంతి



**హైదరాబాద్, జూన్ 6, (సాక్ష్యం న్యూస్) :** ప్రతిఘటన పోరాట యోధుడు, సిపిఐ ( ఎం ఎల్ ) జనశక్తి రాష్ట్ర కమిటి సభ్యుడు కృష్ణారెడ్డి (శంకరన్న ) 34వ వర్ధంతి కార్యక్రమం హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలో జరిగింది. శనివారం రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి ని స్మరిస్తూ అరుణోదయ కళాకారులు విప్లవ గీతాలు పాడారు. అనంతరం రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెల్తురు సదానందం మాట్లాడుతూ.. కృష్ణారెడ్డి గోదావరిలోయ ప్రజలకు మర్చిపోనీ జ్ఞాపకం అన్నారు. భూపాలపల్లి, ములుగు, ఏటూరు నాగారం, ప్రాంతాల్లో అనేక పోరాటల్లో ప్రజలను కదిలించి హక్కులు సాధించుకునేల దిశనిర్దేశం చేసిన గొప్ప నాయకుడన్నారు. తను నమ్మిన ఆశయం కోసం చివరి శ్వాస వరకు నిబద్ధతతో నిలిసినవాడని, అనేక మందిని విప్లవోద్యమంలో నిలిపిన కార్యశీలి అని కొనియాడారు. కృష్ణా రెడ్డి అమరుడై 34 ఏండ్లని... అయినా నేటికీ పిడిత ప్రజా పోరాటల్లో సదా చిరంజీవిగా ఉంటాడన్నారు. కృష్ణారెడ్డి ఆశయలను కొన సాగిద్దామని ప్రతిజ్ఞ చేయాలన్నారు. పీడిత ప్రజల విముక్తి పోరాటాలతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘంరాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు మల్సూర్, ప్రధాన కార్యదర్శి పోతుల రమేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రాకేష్, పిడిఎస్ యు ( విజృంభణ ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్, నాయకులు గౌతమ్, అరుంధతి, అశ్విని, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

### కుమ్మర్ల నిరసన దీక్షను
## విజయవంతం చేయాలి: మల్లికంటి వీరన్న



**సికింద్రాబాద్, జూన్ 6 (సాక్ష్యం):** కుమ్మర్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1,000 కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7న ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న "కుమ్మర్ల నిరసన దీక్ష"ను విజయవంతం చేయాలని అఖిల భారతీయ కుమ్మర శాలివాహన ప్రజాపతి కుంభకార్ మహాసంఘ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికంటి వీరన్న పిలుపునిచ్చారు. శనివారం తార్నాకలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిరసన దీక్ష కొనసాగుతుందని తెలిపారు. మానవ నాగరికతకు కుమ్మరి తొలిమెట్టు, కుండ ఆయువుపట్టు అని చెప్పుకునే స్థానం ఉన్నప్పటికీ తెలంగాణలో కుమ్మర్ల సామాజిక, ఆర్థిక పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలకుల నిర్లక్ష్యం కారణంగా కుమ్మర్లు విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో వెనుకబడి పోయారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ కుమ్మర్లకు ప్రభుత్వాల నుంచి ఆశించిన స్థాయిలో సహకారం అందలేదన్నారు. ప్రభుత్వాలు విస్మరించిన కుమ్మర్ల సంక్షేమాన్ని గుర్తు చేసి, వారి న్యాయమైన హక్కుల సాధన కోసం ఈ నిరసన దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కుమ్మర్లు, ప్రజాపతి సంఘాల నాయకులు, యువత, మహిళలు అధిక సంఖ్యలో హాజరై నిరసన దీక్షను విజయవంతం చేయాలని మల్లికంటి వీరన్న కోరారు.

### ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు
## జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాద శంకర్ గౌడ్

**సికింద్రాబాద్, జూన్ 6 (సాక్ష్యం):** ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య జన్మదినోత్సవం సందర్భంగా మల్లాపూర్ బ్రహ్మపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మాద శంకర్ గౌడ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సేవలో నిబద్ధతతో పనిచేస్తూ ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న బీర్ల ఐలయ్య మరెన్నో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత సేవ చేసే శక్తి, ఆయురారోగ్యాలు కలగాలని కోరుతూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ సెల్ మండల నాయకులు మహమ్మద్ జానీ, ఎన్ఎస్‌యూఐ భువనగిరి టౌన్ సెక్రటరీ మహమ్మద్ అబిద్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## నిబంధనలకు విరుద్ధంగా ఏడిఎంసి పోస్టును ఎలా నియమిస్తారు

● బీఆర్ఎస్ పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు వాసం కరుణ



**నర్సంపేట జూన్ 6 ( సాక్ష్యం న్యూస్ ) :** నర్సంపేట పట్టణ మున్సిపల్ పరిధిలో ఏడిఎంసీ (అసిస్టెంట్ డిస్టిక్ మిషన్ కోఆర్డినేటర్) గా ఎలాంటి అర్హత లేని వారిని నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ నోటిఫికేషన్ లేకుండా ఎలా నియమిస్తారని బిఆర్ ఎస్ పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు వాసం కరుణ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని స్వయం సంఘాలుగా ఏర్పడి పట్టణ సమాఖ్య టిఎల్ఎఫ్ పరిధిలో 51 ఎస్ ఎల్ ఎఫ్ సంఘాలు పనిచేస్తున్నాయి. ఈ సంఘాల ఆర్థిక లావాదేవీలు చూడడానికి మహిళలను చైతన్యవంతులు గా చేయడానికి ఆర్పీలు ఉంటారు. వీరిపై పర్యవేక్షణ చేయడానికి ఏ డి ఎం సి, డి ఎం సి లు ఉంటారు. గతంలో పనిచేసిన ఏడిఎంసీ బదిలీపై వెళ్లారు తమ స్థానంలో కొత్తగా జనగామ నుండి ఏ డి ఎం సి వాణిశ్రీ బదిలీపై నర్సంపేట మున్సిపాలిటీకి వచ్చారు కానీ ఆమెను జాయిన్ కావద్దని మున్సిపల్ కమిషనర్ పాలకవర్గం హుకుం జారీ చేశారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో ఉంటూ జీతం తీసుకుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు ఏడిఎంసీగా నిన్నటిదాకా టిఎల్ఎఫ్ అధ్యక్షురాలుగా పనిచేసిన నీరుజనను నియమించాలని కమిషనర్, మున్సిపల్ చైర్ పర్సన్ చెప్పడంలో ఆంతర్యమేంటని ఏ డి ఎం సి పోస్టు ఏమైనా నామినేటెడ్ పోస్టా అని ప్రశ్నించారు. కొత్త పోస్టు మంజూరు కావాలంటే హైదరాబాద్ మెప్మా నుండి జిల్లా కలెక్టర్ ద్వారా నోటిఫికేషన్ ఇవ్వాలి ఏడీఎంసీ క్వాలిఫికేషన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ లో సోషియాలజీ డిపార్ట్మెంట్ లేదా ఎమ్మెస్ డబ్ల్యూ తో పాటు పి జి డి సి ఏ చేసి కనీసం ఐదు సంవత్సరాల అనుభవం గ్రూపుల మీద ఉండాలి ఇలాంటి నిబంధనలను పాతరెసి టీఎల్ ఎఫ్ ఓబీ కి సమాచారం ఇవ్వకుండా రాజీనామా చేసి, గత రెండు సంవత్సరాలుగా టీఎల్ ఎఫ్ లో జరిగిన ఆర్థిక లావాదేవీలపై సోషల్ ఆడిట్ నిర్వహించి మహాసభ జరుపకుండా ఎలా రాజీనామా చేసి ఎడిఎంసి బాధ్యతలు తీసుకుంటుందని ప్రశ్నించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ ద్వారా అర్హులను నియమించాలని లేకుంటే బీఆర్ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయిని సునీత, విజయ రాణి, స్వరూప, ,రేణుక, పద్మ, లింగమ్మ పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి సాధ్యం

● వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి



**ఖానాపురం జూన్ 6 (సాక్ష్యం న్యూస్ ) :** ప్రజల భాగస్వామ్యంతో గ్రామ అభివృద్ధి సాధ్యమని వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. ఖానాపురం మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ దాసరి రమేష్ అధ్యక్షతన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక గ్రామ సభను శనివారం జరిగింది. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ పైపులైన్ లీకేజీ సమస్యలు లేకుండా మంచినీటిని సక్రమంగా అందించాలన్నారు. డ్రైనేజ్ లను మరమ్మత్తులు చేపట్టి మురికి నీటి నిల్వలు లేకుండా చేయాలన్నారు. రైతులు పంట మార్పిడి విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తల సలహా సూచనలను రైతులు తప్పనిసరిగా పాటించాలన్నారు. కాంప్లెక్స్ ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని సూచించారు. రైతులు తమ పంట భూములను భూసార పరీక్షలు చేయించుకోని వాటి ఆధారంగానే ఎరువుల వాడకాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతను నిర్మించుకొని భూగర్భ జలాలను పెంపొందించాలన్నారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుకునే విధంగా అన్ని వర్గాల ప్రజలతో ,అధికారులతో సర్పంచ్ పాలకవర్గం సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ప్రజలు పరిశుభ్రతను పాటించాలని తడి పొడి చెత్తను వేరు చేయాలని తెలిపారు. గ్రామ సర్పంచ్ ఈజీఎస్ కాంపౌండింగ్ ఫండ్ నిధులను తప్పనిసరిగా మా గ్రామ అభివృద్ధికి వినియోగించే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తూ, చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందిని అదనపు కలెక్టర్ ఆదేశించారు. జాబ్ కార్డ్ లేని వారికి వెంటనే జాబ్ కార్డ్ కు దరఖాస్తు చేసుకున్న వెంటనే సంబంధిత శాఖ వారు జాబ్ కార్డ్ మంజూరు చేస్తారని తెలిపారు. ఈనెల 25 నుండి ప్రతి గ్రామంలో బిఎల్ వోలు ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమంను నిర్వహిస్తారని ప్రతి ఒక్కరూ బిఎల్ ఓలకు సహకరించాలని తెలిపారు. అనంతరం ప్రజా పాలన గ్రామసభలో అదనపు కలెక్టర్ ను, గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావును సర్పంచ్ పాలకవర్గం శాలువాలతో పూల బొకేతో ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంతో పాటు రంగాపురం, కొత్తూరు, కోడ్తిమాటుతండ, మనుబోతులగడ్డ గ్రామాల్లోని గ్రామ సభలు ఆయా గ్రామాల సర్పంచ్ లు అధికారుల సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ నంగునూరి రమేష్, ఎంపీడీవో వనపర్తి అద్వైత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జ్యోతి, పశు వైద్యాధికారి శ్రీకాంత్, ఎంపీ ఓ సునీల్ కుమార్ రాజ్, ఏపీఎం రమాదేవి, ఏపిఓ సునీత, ఇరిగేషన్ ఏఈ స్వాతి, కార్యదర్శి రాజశేఖర్, ఉప సర్పంచ్ ఉప్పు రాజు, వార్డు సభ్యులు గుండ్లపల్లి విజయ్ చలిగంటి మల్లికార్జున్, అజహార్, భూక్య స్రవంతి, గుండ్లపల్లి మంజుల, కామిశెట్టి లక్ష్మి, కందుల రమాదేవి, ఈలపొంగుల కొమురమ్మ, ఏఎన్ఎం రాగం సునీత, ఆశా కార్యకర్తలు సంధ్య, సునీత, గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవుల ఎస్సీ హోదాపై ఈ నెల 10 నుండి జిల్లాల సదస్సులు

● ప్రభుత్వ విద్య వైద్యం పరిరక్షణ కోసం దశల వారి ఉద్యమాలు ● కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఎండి అబ్బాస్, స్కైలాబ్ బాబు



**హైదరాబాద్, జూన్ 6, ( సాక్ష్యం న్యూస్) :** గత మర్చి 24 న సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు కోట్లాది మంది దళితులకు రాజ్యాంగ హక్కులు రిజర్వేషన్లు దూరం చేసే విదంగా ఉందని, దానిని పున:సమీక్షించాలని కోరుతూ జూన్ 10నుండి అన్ని జిల్లాలలో సదస్సులు నిర్వహించనున్నట్లు అవాజ్, కేవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శులు ఎండి అబ్బాస్, టి స్కైలాబ్ బాబు తెలిపారు. శనివారం హైదరాబాద్ చిక్కడపల్లి కెవిపిఎస్ రాష్ట్ర కార్యాలయంలో కేవీపీఎస్ రాష్ట్ర స్థాయి సమావేశం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నందిపాటి మనోహర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి.అబ్బాస్, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు లు మాట్లాడుతూ... కోట్లాదిమంది దళిత క్రైస్తవులకు రాజ్యాంగం కల్పిస్తున్న హక్కుల పైన సుప్రీంకోర్టు తీర్పు ముప్పేట దాడి చేసిందన్నారు. మతం మారినంత మాత్రాన కుల వివక్ష అంటరానితనం పోవట్లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు పున: సమీక్షించాలని కోరుతూ ఈ నెల 10 నుండి 25 వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సదస్సులు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్య తీవ్ర సంక్షోభంలో కొనసాగుతుందని.. నూటికి 80 శాతం మంది విద్యార్థులు అట్టడుగు పేద వర్గాలు నుంచి ఉన్నారని ఆ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత సౌకర్యాల కొరత కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు అధికారులు ప్రజాప్రతినిధుల పిల్లలను సైతం ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను పరిరక్షించాలని వారు అన్నారు. ప్రైవేటు విద్యా వ్యవస్థలో ఫీజుల నియంత్రణపై ప్రభుత్వానికి పట్టు లేకపోవడం వల్ల కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల రక్తమాంసాలు పీల్చుకు తింటున్నారని చెప్పారు ఫీజుల నియంత్రణ చట్టం తీసుకొచ్చి పేద విద్యార్థులకు కూడా ఉన్నత విద్య ఉచితంగా దక్కే విధంగా చూడాలన్నారు. విద్యా హక్కు చట్టాన్ని రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేయకపోవడం వల్ల అర్హులైన దళితులు గిరిజనులు వికలాంగులు పిల్లలు విద్యకు నోచుకోవడం లేదని చెప్పారు. బెస్ట్ అవైలబుల్ స్కీం విద్యార్థులకు సరిపడా బడ్జెట్ కేటాయించకపోవడం వల్ల ప్రైవేట్ యాజమాన్యాలు విద్యార్థులను బయటికి గెంటేస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ హాస్పిటల్లో కనీస ప్రాథమిక సౌకర్యాలు ఉండటం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలను ప్రభుత్వ వైద్య శాలలను పీహెచ్‌సి కేంద్రాలలో సౌకర్యాలపై జూలై, ఆగస్టు నెలలో సమస్యలపై అధ్యయనాలు సదస్సులు, ధర్నాలు వంటి దశల వారి పోరాటాలకు శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ కె నాగేశ్వర్ పై పవన్ కళ్యాణ్ జనసేన కార్యకర్తలు ట్రోల్ దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థను భ్రష్టు పట్టించి పేదలకు నిత్యవసర సరుకులను దూరం చేయడం శోచనీయమన్నారు 16 రకాల నిత్యవసర సరుకుల కోసం దశల వారి పోరాటాలకు సిద్ధం కావాలని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్ణయించిందని, ఈ నెల 28 నుండి రాష్ట్ర స్థాయి సామాజిక శిక్షణ తరగతులు హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు వారు చెప్పారు. సమావేశం ప్రారంభానికి ముందు ఇటీవల కాలంలో మరణించిన అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ప్రకాష్ కరత్, పి.అశోక్, పి.పరశురాములు, రాష్ట్ర సహాయ కార్యదర్శులు సురేష్, డి.రామ్మూర్తి, కోట గోపి, బోట్ల శేఖర్, మల్కయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు మాణిక్యం రాజు, భగత్, బాలకిషన్, రత్నం, ప్రవీణ్, కృష్ణ, సుబ్బారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు సమిష్టి కృషి అవసరం: డాక్టర్ సీహెచ్ భద్ర

● ప్రపంచ పర్యావరణ సంస్థ, అగస్త్య హాస్పిటల్స్ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవ వేడుకలు



**హైదరాబాద్, జూన్ 6 (సాక్ష్యం):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచ పర్యావరణ సంస్థ మరియు అగస్త్య హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో సాగర్ రింగ్ రోడ్‌లోని అగస్త్య హాస్పిటల్స్‌లో పర్యావరణ అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. సంస్థ సీనియర్ ఉపాధ్యక్షురాలు శిల్పిక అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ సి.హెచ్. భద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ సి.హెచ్. భద్ర మాట్లాడుతూ, పెరుగుతున్న కాలుష్యం మానవ ఆరోగ్యంతో పాటు వైద్య రంగంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ కాలుష్యం భూమిపై జీవజాతి మనుగడకే ముప్పుగా మారిందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమిష్టిగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అగస్త్య హాస్పిటల్స్ సీఎండీ డాక్టర్ ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో ప్రపంచ పర్యావరణ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తమ ఆసుపత్రిలో పచ్చదనాన్ని పెంపొందిస్తూ రోగులకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రామ్ కమల్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణను ప్రజా ఉద్యమంగా తీసుకెళ్తున్న ప్రపంచ పర్యావరణ సంస్థకు తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. పాఠశాలలు, దేవాలయాలు, ఆసుపత్రులను పర్యావరణ అవగాహన కేంద్రాలుగా తీర్చిదిద్దే కార్యక్రమం ప్రశంసనీయమన్నారు. ఎగ్జిక్యూటివ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ మాదాటి మాట్లాడుతూ, "స్వచ్ఛ హాస్పిటల్ -- స్వచ్ఛ భారత్" లక్ష్యంతో ఆసుపత్రిలో పరిశుభ్రత, పచ్చదనాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. సీనియర్ ఉపాధ్యక్షురాలు శిల్పిక మాట్లాడుతూ, బాలికల వ్యక్తిగత పరిశుభ్రతపై ఇప్పటికే 15 వేల మందికి పైగా బాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బయోడిగ్రేడబుల్ శానిటరీ న్యాప్కిన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఆదివాసీ ప్రాంతాల్లో లక్ష మందికి పైగా మహిళలకు ఆరోగ్య, పరిశుభ్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రపంచ పర్యావరణ సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాస్ మాదాటి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ దేశ సంరక్షణతో సమానమని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి కనీసం పది మొక్కలు నాటి కాలుష్య నిర్మూలనలో భాగస్వాములు కావాలని సూచించారు. సంస్థ గౌరవ సలహాదారు విశ్వ గురు గల్లా ప్రకాష్ మాట్లాడుతూ, ప్రకృతిని కాపాడే వారికి ఆరోగ్యం, ఆనందం, సుఖసంతోషాలు లభిస్తాయని అన్నారు. సీనియర్ ఉపాధ్యక్షులు వడ్లకొండ పవన్ కుమార్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం కోసం గత రెండు దశాబ్దాలుగా జూట్, క్లాత్ బ్యాగుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బందికి తులసి మొక్కలు, జూట్ బ్యాగులు పంపిణీ చేశారు. జాతీయ కార్యదర్శి సాగర్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా మరియు విదేశాల్లో ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో దాదాపు 10 వేల మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోఆర్డినేటర్లు సురేష్, శ్రీధర్‌తో పాటు అగస్త్య హాస్పిటల్స్‌కు చెందిన వైద్యులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామని అందరూ ప్రతిజ్ఞ చేశారు.

## మానవ అక్రమ రవాణా పై అవగాహన కార్యక్రమం





**భూపాల్‌పల్లి జూన్ 6 (సాక్ష్యం) :** ప్రభుత్వ వైద్య కళాశాలలో మానవ అక్రమ రవాణా, మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు జిల్లా సీసీఎస్ సీఐ రమేష్ గారి ఆధ్వర్యంలో సీసీఎస్ పోలీసులు ప్రభుత్వ వైద్య కళాశాల, భూపాలపల్లిలో విద్యార్థులకు మానవ అక్రమ రవాణా మరియు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిసిఎస్ పోలీసులు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా సమాజానికి తీవ్రమైన ముప్పుగా మారిందని, ఉద్యోగాలు, విద్య, వివాహాల పేరుతో మోసాలకు పాల్పడే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియా, ఆన్‌లైన్ వేదికల ద్వారా వచ్చే అనుమానాస్పద ఆఫర్లను నమ్మవద్దని, ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. అలాగే మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని, ఆరోగ్య సమస్యలతో పాటు కుటుంబ, సామాజిక జీవితాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, తమ స్నేహితులు కూడా ఈ దుష్ప్రవర్తనలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మానవ అక్రమ రవాణా, మాదకద్రవ్యాల రవాణా లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు లేదా డయల్-100, 8712658111 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, సీసీఎస్ పోలీసులు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు



**యాదగిరి కొండ సాక్ష్యం న్యూస్..** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులు హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ జన్మ దినోత్సవం సందర్భంగా శ్రీ స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణ వీరికి వేద మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేయగా, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కు ఆలయ ముఖ మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.





## మంత్రి ఇలాకాలో రోడ్డు మధ్యలో భారీ గుంత

### గుంతల మయమైన మాడుగులపల్లి చెరువుపల్లి రోడ్డు



**మాడుగులపల్లి జూన్ 6 సాక్ష్యం;** చెరువుపల్లి రోడ్డు ప్రమాదాలకు నెలవుగా మారింది. రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించడం లేదు. స్వయాన రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇలాకాలోనే రోడ్డు పరిస్థితి



ఇలా ఉండడం దయనీయమైన స్థితి. మాడుగులపల్లి నుండి చెరువుపల్లి గ్రామాల మధ్య గత పది పన్నెండు సంవత్సరాల క్రితం రోడ్డు నిర్మించారు. అయితే ఈ రోడ్డులో అనేక చోట్ల తారు కొట్టుకుపోవడంతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. నెలలు గడుస్తున్నా ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప రోడ్డు మారడం లేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. అధికారులు వాటిని పూడ్చడం లేదని, తాము ప్రమాదాల బారినపడి తరచూ గాయపడుతున్నట్లు గ్రామస్తులు వాహనదారులు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎస్దెబ్బతిన్న రోడ్లను వెంటవెంటనే గుర్తించి ప్రమాదాలు జరగకుండా మరమ్మతులు చేయాలని అంటున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడంలేదని వాహనదారులు వాపోతున్నారు. చెరువుపల్లి బొంధం బ్రిడ్జి మధ్య రోడ్డుపై పడిన గుంతలు,దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య జన్మదిన వేడుకలు

**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్..** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని బీర్ల నిలయం వద్ద తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఉదయం నుంచే అభిమానులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో హాజరై జన్మదిన వేడుకలను ఉత్సాహభరితంగా జరిపారు. జన్మదిన సందర్భంగా బీర్ల అయిలయ్య ఉదయం యాదగిరిగుట్ట శ్రీ





లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ని, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరంయాదగిరిగుట్ట పట్టణంలోని బీర్ల నిలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో భాగంగా, శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అర్చకులు బీర్ల అయిలయ్యకి ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులకు నిత్యావసర ఆహార సరుకులను పంపిణీ చేశారు. అనంతరం రాష్ట్ర, ఆలేరు నియోజకవర్గం, నలుమూలల నుండి భారీ సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు, నాయకుల సమక్షంలో జన్మదిన వేడుకలు అట్టహాసంగా కొనసాగాయి. అభిమానులు ఏర్పాటు చేసిన భారీ క్రేన్ గజమాలతో బీర్ల అయిలయ్య గారిని ఘనంగా సత్కరించారు. సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా, పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అదేవిధంగా విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ చేసి వారి విద్యాభివృద్ధికి తన సహకారాన్ని



తెలియజేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు బీర్ల నిలయం వద్ద అభిమానులు, ప్రజలు, కార్యకర్తల రాకపోకలతో ప్రాంతం జనసంద్రంగా మారింది. జన్మదిన వేడుకలు ఆనందోత్సాహాల మధ్య వైభవంగా సాగాయి. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ బంద్రు శోభారాణి, అడిషనల్



కలెక్టర్ భాస్కర్ రావు, జాయింట్ కలెక్టర్ వెంకారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, వివిధ మండలాల సర్పంచులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## జర్నలిస్టుల హక్కుల సాధనకు కాళేశ్వరం వేదిక

**భూపాలపల్లి జూన్ 6 (సాక్ష్యం) :** జూన్ 9న టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా జర్నలిస్టుల సమావేశం అధ్యక్షులు: క్యాతం సతీష్ కుమార్ జర్నలిస్టుల వృత్తి భద్రత, సంక్షేమం, హక్కుల పరిరక్షణతో పాటు జిల్లాలోని పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలనే లక్ష్యంతో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే--ఐజేయూ) జయశంకర్ భూపాలపల్లి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9న కాళేశ్వరంలో జిల్లా స్థాయి జర్నలిస్టుల సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి సామంతుల శ్యామ్, రాష్ట్ర హెల్త్ కమిటీ మెంబర్ సామల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ




మహాసభకు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేణుమాధవ్, కంకనాల సంతోష్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, గృహ స్థలాల కేటాయింపు, పెన్షన్, బీమా సదుపాయాలు, సంక్షేమ పథకాలు, వృత్తిపరమైన సమస్యలు, మీడియా రంగంలో నెలకొంటున్న సవాళ్లు, డిజిటల్ మీడియా యుగంలో జర్నలిస్టుల బాధ్యతలు వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై తీర్మానాలు ఆమోదించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఒకే వేదికపై చర్చించి వాటి పరిష్కారానికి సమిష్టి పోరాట కార్యాచరణ రూపొందించడంతో పాటు సంఘ బలోపేతం, సభ్యత్వ నమోదు, జర్నలిస్టుల ఐక్యత, వృత్తి గౌరవ పరిరక్షణ, యువ జర్నలిస్టులకు ప్రోత్సాహం వంటి అంశాలపై ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు.


## మహిళలకు అండగా తెలంగాణ పోలీస్

### 'స్త్రీ రైడ్' ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్

**హైదరాబాద్ జూన్ 6 (సాక్ష్యం) :** మహిళల భద్రత, వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు తెలంగాణ పోలీస్ కీలక నిర్ణయం తీసుకుంది. మహిళలకు బైక్‌లు, ఆటో డ్రైవింగ్ నేర్పించి.. వారిని గిగ్ వర్కర్లుగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని విజయవంతంగా చేపడుతోంది. ఈ క్రమంలోనే తాజాగా డీజీపీ సీవీ ఆనంద్.. తొలి విడతలో 55 మంది స్త్రీ రైడర్లు కలిగిన బ్యాచ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. రానున్న రోజుల్లో ఈ స్త్రీ రైడర్ల సంఖ్యను భారీగా పెంచనున్నట్లు సీవీ ఆనంద్ ప్రకటించారు. తెలంగాణలో మహిళలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడంతోపాటు.. వారికి ఆత్మవిశ్వాసం, సమాజంలో భద్రతను పెంచడమే లక్ష్యంగా తెలంగాణ పోలీస్ శాఖ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తెలంగాణ విమెన్ సేఫ్టీ వింగ్, తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ సంయుక్తంగా రూపొందించిన స్త్రీ రైడ్ ప్రాజెక్టును ఇవాళ హైదరాబాద్‌లో డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు. రవాణా, డెలివరీ రంగాల్లో మహిళలు స్వయం ఉపాధి సాధించేలా ప్రోత్సహించేందుకు ఈ-బైక్స్, ఈ-ఆటోలను జెండా ఊపి సీవీ ఆనంద్ మొదలుపెట్టారు. ఇక ఈ కార్యక్రమంలోని తొలి విడతలో భాగంగా 55 మంది మహిళలకు స్త్రీ రైడర్లుగా అవకాశం కల్పించారు. ఈ 55 మందికి అంబర్‌పేట పోలీస్ లైన్స్‌లో టూ వీలర్, త్రీ వీలర్ డ్రైవింగ్‌లో ట్రైనింగ్ ఇచ్చారు. వారందరికీ సీవీ ఆనంద్



డ్రైవింగ్ లైసెన్స్‌లు అందించారు. ఎమర్జెన్సీ పరిస్థితుల్లో మహిళలకు సురక్షితంగా రవాణా సేవలు అందించేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. స్విగ్గీ, జొమాటో తరహాలో డెలివరీ సేవల్లో మహిళలు భాగస్వామ్యం కావడంపై డీజీపీ సంతోషం వ్యక్తం చేశారు. రానున్న 4 నెలల్లో మహిళా రైడర్ల సంఖ్యను ఇప్పుడు ఉన్న దాని కన్నా 3 రెట్లు పెంచాలని హితవు పలికారు. మహిళల ఉపాధి, సాధికారతకు తెలంగాణ సర్కార్ పూర్తి మద్దతును ఇస్తోందని వెల్లడించారు. ఓలా, ఉబర్, ర్యాపిడో లాగానే మహిళల కోసం మహిళా డ్రైవర్లనే అందుబాటులోకి తీసుకువస్తూ.. మోవో ఫ్లీట్ యాప్ (వీశీజశీ ఖీశ్రీవవ్ ూజూజూ) ద్వారా ఈ స్త్రీ రైడ్ సర్వీసులను ప్రారంభించారు. ఈ మోవో ఫ్లీట్ యాప్ వల్ల ఇక నుంచి యువతులు,




మహిళలకు ఎలాంటి భయం లేకుండా వారు మహిళా డ్రైవర్లను బుక్ చేసుకుని ప్రయాణించే అవకాశం కల్పించారు. మహిళలకు స్వయం ఉపాధిని అందించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని డీజీపీ తెలిపారు. అన్నిరంగాల్లో మహిళలు ముందుకురావాలని విజ్ఞప్తి చేశారు. పోలీసు శాఖలోనూ మహిళలు మరిన్ని బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్షించారు. మరీ ముఖ్యంగా మహిళలు ఎస్‌హెచ్‌ఓ పోస్టుల్లోకి రావాలని పిలుపునిచ్చారు. మహిళలు ఎదగాలంటే వారి కుటుంబ సభ్యులు సహకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మహిళల సాధికారతకు ఫ్యామిలీ మద్దతును పెంచేందుకు 'ఴ్ఖుఅఆ ఔఴ్ష్ర ఎవతీ' అనే కార్యక్రమాన్ని కూడా తెలంగాణ పోలీసులు నిర్వహిస్తున్నట్లు డీజీపీ వెల్లడించారు.

### 'బరాబర్ ఇది మా జాగీరే..

## ఆ భూమిని వెంటనే ప్రభుత్వానికి ఇవ్వాలి'.. పవన్ వాఖ్యలకు కవిత కౌంటర్

**హైదరాబాద్ జూన్ 6 (సాక్ష్యం) :** జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోటి చెరువు శిఖం భూమిని కబ్జా చేశారని, దాన్ని వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. పవన్ ఇటీవల చేసిన 'తెలంగాణ మీ అయ్య జాగీరా' అనే వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ఇది అమరవీరుల త్యాగాలతో సాధించుకున్న తమ జాగీరేనని స్పష్టం చేశారు. గద్దర్‌కు కారు కొనివ్వడంపై పవన్ చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టిన ఆమె.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ భూదందాలను తీవ్రంగా విమర్శించారు. తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో మరోసారి ప్రకంపనలు రేపుతూ.. జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన (౧=ూ) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ కల్యాణ్‌పై వస్తున్న కోటి చెరువు కబ్జా ఆరోపణలను ప్రస్తావిస్తూ ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ.. 'ఒకవేళ నేను చెరువును ఆక్రమించానని రుజువైతే వెంటనే ఆ భూమిని తెలంగాణ ప్రభుత్వానికి రాసిస్తానని పవన్ కల్యాణ్ గతంలో ప్రగల్భాలు పలికారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించిన అధికారిక రికార్డులు అది స్పష్టంగా చెరువు శిఖం భూమి అని చెబుతున్నాయి. కాబట్టి పవన్ కల్యాణ్ వెంటనే తన మాట నిలబెట్టుకుని, ఆ భూమిని ప్రభుత్వానికి అప్పగించాలి. అక్కడ అక్రమంగా వేసిన కంటైనర్లు, మట్టిని తక్షణమే తొలగించాలి' అని డిమాండ్ చేశారు. ఈ భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అనేక అవకతవకలు, తప్పిదాలు దొర్లాయని కవిత ఆరోపించారు. పవన్ కల్యాణ్ పేరిట జరిగిన రిజిస్ట్రేషన్‌లో కేవలం 3 ఎకరాలు మాత్రమే శిఖం భూమి అని, మిగిలిన 7 ఎకరాలు మాగాణి అని చూపించారని ఆమె పేర్కొన్నారు. అయితే.. ఇరిగేషన్ రికార్డుల ప్రకారం ఆ మొత్తం 10 ఎకరాల భూమి కూడా శిఖం పరిధిలోకి వస్తుందని దీనికి సంబంధించిన పూర్తి సాక్ష్యాధారాలు తమ వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు. ఇటీవల హైదరాబాద్ వేదికగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. తెలంగాణ మీ అయ్య జాగీరా? అంటూ చేసిన వ్యాఖ్యలపై కవిత ఘాటుగా స్పందించారు. 'ఇది బరాబర్ మా జాగీరే.. 1 200 మంది అమరవీరుల త్యాగాలు, దశాబ్దాల పాటు కడుపు కట్టుకుని పోరాడి తెచ్చుకున్న తెలంగాణ గడ్డ ఇది. ఈ నేల ఇక్కడి ప్రజల సొత్తు. ఇది పవన్ కల్యాణ్ తాతల, ముత్తాతల జాగీరు ఎంతమాత్రం



కాదు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రాలో సరైన రాజధానిని కూడా నిర్మించుకోలేక, తెలంగాణకు వచ్చి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగం ప్రకారం ఎవరైనా ఎక్కడైనా పోటీ చేయవచ్చునని, కానీ దానికి కనీస నైతికత ఉండాలని హితవు పలికారు. ఉమ్మడి రాష్ట్రంలో సీమాంధ్ర పాలకుల వల్లే తెలంగాణ వనరులు దోచుకోబడ్డాయని ఇక్కడి సంస్కృతి మరుగున పడిపోయిందని గుర్తుచేశారు. తెలంగాణలో బీజేపీకి సరైన నాయకులు లేరని, అందుకే పవన్ కల్యాణ్‌ను ముందు పెట్టి రెండు ఓట్లు రాబట్టుకోవాలని చూస్తోందని కానీ రాష్ట్ర ప్రజలు వారికి తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా కవిత తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్ర వనరులను కాంగ్రెస్ దారుణంగా దోచుకుంటోందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఖు= అంటే కేసీఆర్, తన్నీరు హరీష్ రావు, రామారావు పాలన నడిచిందని, ఇప్పుడు కూడా రాష్ట్రంలో ఖు= అంటే కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి పాలనే నడుస్తోందని విమర్శించారు. గత హయాంలో దోపిడీకి కిటికీలు తెరిస్తే.. ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో ఏకంగా తలుపులే తెరిచేశారని ధ్వజమెత్తారు.



# రాహుల్, గిల్ సెంచరీల మోత..

## భారీ స్కోరు దిశగా భారత్..! .. అఫ్గాన్‌తో భారత్ ఏకైక టెస్టు

అఫ్ఘానిస్థాన్‌తో శనివారం ప్రారంభమైన ఏకైక టెస్టు తొలి రోజు ఆటలో టీమిండియా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. ముల్లాన్‌పూర్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్.. తొలి రోజు ముగిసేసరికి 3 వికెట్ల నష్టానికి 368 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ శతకాలతో కదం తొక్కగా, యువ బ్యాటర్ సాయి సుదర్శన్ (81), రిషభ్ పంత్ (50 నాటౌట్) అర్ధసెంచరీలతో రాణించారు. అఫ్గాన్ బౌలర్లలో సలీమ్ సఫీ రెండు వికెట్లు పడగొట్టాడు. అఫ్ఘానిస్థాన్‌తో శనివారం ప్రారంభమైన ఏకైక టెస్టు మ్యాచ్ తొలి రోజు ఆటలో టీమిండియా ఆధిక్యం కనబరిచింది. న్యూచండీగఢ్‌లోని ముల్లాన్‌పూర్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నాడు. యశస్వి జైశ్వాల్‌తో పాటు కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్ ప్రారంభించాడు. అయితే 32 బంతుల్లో 24 రన్స్ చేసిన తర్వాత జైశ్వాల్.. తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన సాయి సుదర్శన్.. రాహుల్‌తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. ఆడేది టెస్టు మ్యాచ్ అయినా.. సాయి సుదర్శన్ మాత్రం వేగంగా పరుగులు రాబట్టాడు. హాఫ్



సెంచరీ పూర్తి చేసుకుని.. సెంచరీ దిశగా అడుగులు వేశాడు. మరోవైపు కేఎల్ రాహుల్ కూడా ఈజీగా పరుగులు రాబట్టాడు. దీంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. ఈ క్రమంలోనే కేఎల్ రాహుల్ శతకం పూర్తి చేసుకున్నాడు. అయితే అదే స్కోరు వద్ద అతడు క్యాచ్ ఔట్ అయ్యాడు. సాయి సుదర్శన్ 104 బంతుల్లో 81 రన్స్ చేసి పెవిలియన్ చేరిపోయాడు. రాహుల్, సుదర్శన్.. రెండో వికెట్‌కు 139 పరుగులు జోడించారు. ఆ తర్వాత స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లే బాధ్యతను కెప్టెన్ శుభ్‌మన్ గిల్ , రిషభ్ పంత్ తీసుకున్నారు. ఈ క్రమంలోనే శుభ్‌మన్ గిల్.. తన టెస్ట్ కెరీర్‌లో మరో శతకాన్ని పూర్తి చేశాడు. మరోవైపు రిషభ్ పంత్ కూడా ధాటిగా బ్యాటింగ్ చేసి.. అర్ధశతకాన్ని పూర్తి చేసుకున్నాడు. దీంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్.. 85 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 368 పరుగులతో నిలిచింది. ప్రస్తుతం క్రీజులో శుభ్‌మన్ గిల్ (143 బంతుల్లో 103 రన్స్), రిషభ్ పంత్ (70 బంతుల్లో 50 రన్స్) ఉన్నారు. అఫ్ఘానిస్థాన్ బౌలర్లలో మహమ్మద్ సలీమ్ సఫీ రెండు వికెట్లు తీశాడు. రెహ్మాన్ షరీఫ్ ఒక వికెట్ పడగొట్టారు. టీమిండియా రెండో రోజు ఆటలో 500 రన్స్ మార్కును చేరుకుని.. ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసే అవకాశం ఉంది.

## నార్వే చెస్ చాంపియన్‌గా ప్రజ్ఞానంద..

భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద అంతర్జాతీయ చదరంగ వేదికపై సరికొత్త చరిత్ర సృష్టించారు. ప్రతిష్టాత్మక నార్వే చెస్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన తొలి భారతీయ ఆటగాడిగా ఆయన రికార్డు సృష్టించారు. ఈ అద్భుత విజయంపై స్పందించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియా వేదికగా ప్రజ్ఞానందకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రజ్ఞానంద సాధించిన ఈ ఘనత భారత చెస్ రంగానికి ఒక గొప్ప మైలురాయి అని, అంతర్జాతీయ స్థాయిలో ఆయన చూపిస్తున్న ప్రతిభ అద్భుతమని ప్రధాని కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. నార్వే రాజధాని ఓస్లోలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో సాధించిన విజయం ప్రజ్ఞానంద కెరీర్‌లోనే అత్యుత్తమమైనదిగా నిలిచిపోతుంది. ఈ టోర్నమెంట్‌లో ఒక దశలో వెనుకబడిన చెన్నై యువ సంచలనం ప్రజ్ఞానంద, ద్వితీయార్థంలో అద్భుతంగా పుంజుకుని ప్రపంచ అత్యుత్తమ ఆటగాళ్లను ఓడించారు. చివరి రౌండ్‌కు ముందు అమెరికా గ్రాండ్‌మాస్టర్ వెస్లీ సో స్వల్ప పాయింట్ల ఆధిక్యంతో టైటిల్ రేసులో ముందున్నారు. అయితే చివరి క్లాసికల్ గేమ్‌లో వెస్లీ సో డ్రా చేసుకోవడంతో ప్రజ్ఞానందకు సువర్ణావకాశం లభించింది. ఆఖరి పోరులో జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్‌ను తెల్ల ముక్కలతో ఎదుర్కొన్న ప్రజ్ఞానంద, ఒత్తిడిని అధిగమించి అద్భుతమైన ఆటతీరుతో విజయం సాధించారు. వరుసగా నాలుగో క్లాసికల్ విజయాన్ని నమోదు చేయడం ద్వారా పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుని నార్వే చెస్ చాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈ టోర్నమెంట్‌లో ప్రపంచ నంబర్ వన్ మాగ్నస్ కార్లసన్, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ డి గుకేష్, వెస్లీ సో, అలీరెజా ఫిరౌజ్జా వంటి దిగ్గజాలు బరిలో నిలిచారు. ఇంతటి కఠినమైన పోటీలో ప్రజ్ఞానంద కేవలం ఒకే వారంలో కార్లసన్, గుకేష్, ఫిరౌజ్జా, కీమర్లను క్లాసికల్ గేమ్‌లలో ఓడించడం విశేషం. ముఖ్యంగా హోమ్ గ్రౌండ్‌లో ఆడుతున్న ప్రపంచ నంబర్ వన్ మాగ్నస్ కార్లసన్‌ను ఒకే టోర్నమెంట్‌లో రెండుసార్లు క్లాసికల్ చెస్‌లో ఓడించిన రెండో భారతీయ ఆటగాడిగా (విశ్వనాథన్ ఆనంద్ తర్వాత) ప్రజ్ఞానంద అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నారు. ఈ అద్భుత ప్రదర్శన ద్వారా లైవ్ రేటింగ్స్‌లో ఆయన ప్రపంచవ్యాప్తంగా 11వ స్థానానికి ఎగబాకారు.





## సచిన్ రికార్డు బ్రేక్ చేసిన వైభవ్

ఐపీఎల్ 2026లో రికార్డుల మోత మోగించిన 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి జాతీయ జట్టు నుంచి తొలిసారి పిలుపు వచ్చింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ టీ20 సిరీస్‌ల కోసం ప్రకటించిన భారత జట్టులో అతడికి చోటు దక్కింది. 15 ఏళ్ల 70 రోజుల వయసులోనే ఎంపికై సచిన్ టెండూల్కర్ రికార్డును వైభవ్ బ్రేక్ చేశాడు. ఐపీఎల్‌లో 776 పరుగులు, 72 సిక్సర్లతో ఆరెంజ్ క్యాప్, మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ అవార్డులను గెలుచుకుని, సెలక్టర్లు కచ్చితంగా ఎంపిక చేయాల్సిన పరిస్థితిని అతడు కల్పించాడు. 15 ఏళ్ల వయసులోనే ఐపీఎల్‌లో రికార్డుల బూజు దులిపిన వైభవ్ సూర్యవంశీకి జాతీయ జట్టు నుంచి పిలుపు అందింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో త్వరలో జరగనున్న టీ20 సిరీస్ కోసం భారత సెలక్షన్ కమిటీ శనివారం జట్లను ప్రకటించింది. ఇందులో వైభవ్ సూర్యవంశీకి చోటు దక్కింది. తన ప్రదర్శనతో జట్టులో ఎంపిక చేయక తప్పని పరిస్థితిని వైభవ్ కలిగించాడని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ వెల్లడించాడు. అయితే భారత జట్టు నుంచి తొలిసారి పిలుపు అందుకోవడం ద్వారా.. వైభవ్ సూర్యవంశీ రికార్డు క్రియేట్ చేశాడు. 15 ఏళ్ల 70 రోజుల వయసులో వైభవ్‌కు టీమిండియా నుంచి పిలుపు అందింది. గతంలో ఈ రికార్డు టీమిండియా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉంది. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్.. భారత్ తరఫున 16 ఏళ్ల 205 రోజులు ఉన్నప్పుడు ఎంపికయ్యాడు. తాజాగా ఆ రికార్డును వైభవ్ సూర్యవంశీ బ్రేక్ చేశాడు. ప్రపంచ దృష్టిని తనవైపు ఆకర్షించాడు. కాగా ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026లో వైభవ్ సూర్యవంశీ పలు భారీ రికార్డులు బ్రేక్ చేశాడు. తన పవర్ బ్యాటింగ్‌తో సత్తాచాటిన అతడు.. భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. ఈ సీజన్‌లో అతడు ఏకంగా 72 సిక్సర్లు బాదాడు. దీంతో ఓ ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన గేల్ రికార్డును బ్రేక్ చేశాడు. యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్.. 2012 సీజన్‌లో 65 సిక్సర్లు బాదడం గమనార్హం. మరోవైపు ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ ఎడిషన్‌లో ఈ 15 ఏళ్ల చిచ్చర పిడుగు 16 మ్యాచులలో ఆడాడు. అందులో ఏకంగా సుమారు 240 స్ట్రైక్ రేటుతో 776 పరుగులు స్కోరు చేశాడు. దీంతో ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకున్నాడు. అంతేకాకుండా 436.5 పాయింట్స్‌తో మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్ అవార్డు సొంతం చేసుకున్నాడు. 72 సిక్సర్లతో సూపర్ సిక్సెస్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచాడు. 237.31 స్ట్రయిక్ రేట్‌తో సూపర్ స్ట్రయికర్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచాడు. ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్ అవార్డు కూడా వైభవ్ సూర్యవంశీకే దక్కడం గమనార్హం.

## రజత్ పాటిదార్‌కు మరోసారి మొండిచేయి

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) కెప్టెన్ రజత్ పాటిదార్‌కు మరోసారి మొండి చెయ్యే ఎదురైంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శనతో పాటు సూపర్ కెప్టెన్సీతో ఆర్‌సీబీని విజేతగా నిలబెట్టినా.. వరుసగా రెండో టైటిల్ అందించినా రజత్ పాటిదార్‌ను బీసీసీఐ సెలెక్టర్లు పట్టించుకోలేదు. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనతో పాటు



ఆసియా గేమ్స్ కోసం ఎంపిక చేసిన భారత జట్టులోకి రజత్ పాటిదార్‌ను తీసుకోలేదు. శనివారం నయా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత టీ20 జట్టును అజిత్ అగార్కర్ నేతృత్వంలోని భారత సెలెక్షన్ కమిటీ ప్రకటించిన సంగతి తెలిసిందే. పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న సూర్యకుమార్ యాదవ్‌పై వేటు వేసిన సెలెక్షన్ కమిటీ అతని స్థానంలో శ్రేయస్ అయ్యర్‌ను కొత్త సారథిగా ఎంపిక చేసింది. వైస్ కెప్టెన్‌గా తెలుగు తేజం తిలక్ వర్మను నియమించింది. ఐపీఎల్‌లో విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగిన టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీకి కూడా అవకాశం కల్పించింది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో మొత్తం ఐదుగురు ఆటగాళ్లు ఉద్వాసనకు గురయ్యారు. నితీష్ కుమార్ రెడ్డి, రవి బిష్ణోయ్, ప్రిన్స్ యాదవ్‌లకు అవకాశం కల్పించారు. హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రాలకు విశ్రాంతి ఇవ్వగా.. రింకూ సింగ్, కుల్దీప్ యాదవ్‌పై వేటు పడింది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఈ కఠిన నిర్ణయాలు తీసుకున్నామని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ స్పష్టం చేశాడు. రజత్ పాటిదార్‌ను పరిగణలోకి తీసుకోకపోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. వరుసగా రెండు సీజన్లలో రజత్ పాటిదార్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. వరుసగా రెండు సీజన్లలో జట్టును విజేతగా నిలబెట్టడంతో రజత్ పాటిదార్‌కు టీమిండియా పిలుపు దక్కుతుందని అంతా అనుకున్నారు. కానీ సెలెక్టర్లు మాత్రం అతని ఊసే తీయలేదు. ఐపీఎల్ 2026 సీజన్‌లో 191 స్ట్రైక్‌రేట్‌తో 501 పరుగులు చేసిన రజత్ పాటిదార్... 30 ఫోర్లు, 42 సిక్సర్లు బాదాడు. డేంజరస్ మిడిలార్డర్ బ్యాటర్‌గా గుర్తింపు పొందాడు. ముఖ్యంగా 7 నుంచి 11 ఓవర్ల మధ్య ఆకాశమే హద్దుగా చెలరేగాడు. డెత్ ఓవర్లలోనూ సత్తా చాటాడు. ప్రస్తుతం భారత జట్టుకు ఎంపికైన ఆటగాళ్లలో చాలా మంది రజత్ పాటిదార్ కంటే తక్కువ పరుగులు చేసినవారే. కానీ 33 ఏళ్ల వయసు అనే ఒకే ఒక్క కారణంతో రజత్ పాటిదార్‌ను సెలెక్టర్లు పక్కకు పెట్టినట్లు తెలుస్తోంది. వయసు ముఖ్యం కాదని చాలా మంది ఆటగాళ్లు నిరూపించినా.. భారత సెలెక్టర్లు మాత్రం ఏజ్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. అద్భుతమైన లీడర్‌షిప్ స్కిల్స్, స్పిన్నర్లను చితక్కొట్టే సామర్థ్యం ఉన్నా.. రజత్ పాటిదార్‌ను సెలెక్టర్లు పట్టించుకోవడం లేదు. ఐపీఎల్ ప్రదర్శనకు ప్రాధాన్యత ఇచ్చే సెలెక్టర్లు రజత్ పాటిదార్ విషయంలో మాత్రం భిన్నంగా వ్యవహరిస్తున్నారని నెటిజన్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రజత్ పాటిదార్ ఏ పాపం చేశాడని నిలదీస్తున్నారు.

## భవిష్యత్తు ప్రణాళికల్లో భాగంగానే శ్రేయస్‌కు బాధ్యతలు

### చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ వివరణ

భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను జట్టు నుంచి పూర్తిగా తొలగించడంపై బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ శనివారం కీలక వివరణ ఇచ్చారు. మూడు నెలల క్రితమే దేశానికి టీ20 ప్రపంచకప్ అందించి, ఎంఎస్ ధోని, రోహిత్ శర్మల సరసన నిలిచిన కెప్టెన్‌ను పక్కన పెట్టడం సులువైన నిర్ణయం కాదని ఆయన అంగీకరించారు. అయితే ఒక మెగా టోర్నీ ముగిసిన తర్వాత భవిష్యత్తు ప్రణాళికలను పునఃసమీక్షించుకోవడం సహజమని పేర్కొన్నారు. సూర్యకుమార్ వ్యక్తిగత ఫామ్ క్షీణించడం, అదే సమయంలో రాబోయే రెండేళ్ల ప్రపంచకప్ సైకిల్‌ను దృష్టిలో ఉంచుకుని జట్టు మేనేజ్‌మెంట్ ఈ కఠిన నిర్ణయం తీసుకుందని అగార్కర్ స్పష్టం చేశారు. జట్టు ప్రయోజనాల దృష్ట్యా శ్రేయస్ అయ్యర్‌ను కొత్త కెప్టెన్‌గా నియమించడమే సరైన మార్గమని సెలెక్షన్ కమిటీ భావించింది. ఐపీఎల్ టోర్నీలలో వేర్వేరు జట్లను విజయవంతంగా నడిపించిన అపారమైన నాయకత్వ అనుభవం శ్రేయస్ అయ్యర్‌కు ఉందని అగార్కర్ కొనియాడారు. 2024లో కోల్‌కతా నైట్ రైడర్స్‌ను విజేతగా నిలిపిన అయ్యర్, ఆ తర్వాతి సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌ను రన్నరప్‌గా నిలబెట్టారు. ప్రస్తుత 2026 ఐపీఎల్ సీజన్ ప్రారంభంలో పంజాబ్ జట్టును వరుసగా ఏడు మ్యాచ్‌ల్లో అజేయంగా నడిపించి, కేవలం ఒక్క పాయింట్ తేడాతో ప్లేఆఫ్స్ అవకాశాన్ని కోల్పోయారు. కెప్టెన్‌గా ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో ఆయన నిరూపించుకున్నారు. నాయకత్వ బాధ్యతలతో పాటు బ్యాటర్‌గా కూడా అయ్యర్ స్థిరమైన ప్రదర్శన చేయడం సెలెక్టర్లను ఎంతగానో ఆకట్టుకుంది. గత ప్రపంచకప్ జట్టు ఎంపిక సమయంలోనే శ్రేయస్ అయ్యర్ రేసులో నిలిచారని, అయితే అప్పట్లో సూర్యకుమార్ జట్టులో ఉండటం వల్ల ఆయనకు చోటు దక్కలేదని అగార్కర్ వెల్లడించారు. టీ20 ఫార్మాట్‌లో కెప్టెన్‌గా ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్న అయ్యర్, ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో భారత జట్టును నడిపించడానికి పూర్తి అర్హుడని కమిటీ నమ్మింది. ప్రపంచకప్ ముగిసిన వెంటనే జట్టును సరికొత్తగా పునర్వ్యవస్థీకరించడంలో భాగంగానే ఈ మార్పులు జరిగాయి. రాబోయే ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలలో శ్రేయస్ అయ్యర్ సరికొత్త వ్యూహాలతో భారత జట్టును ముందుకు నడిపించనున్నారు.




## అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్ లోకి మానవ్ సుతార్ ఎంట్రీ

ముల్లాన్‌పూర్ వేదికగా అఫ్గానిస్తాన్ తో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్ లో ఇండియా సరికొత్త రికార్డుకు తెరలేపింది. శనివారం టాస్ గెలిచిన ఇండియన్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఫస్ట్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఈ మ్యాచ్ ద్వారా రాజస్థాన్ కు చెందిన 23 ఏళ్ల యంగ్ స్పిన్నర్ మానవ్ సుతార్ అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్ లోకి ఎంట్రీ ఇచ్చాడు. సీనియర్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ చేతుల మీదుగా అతడు డెబ్యూ క్యాప్ అందుకున్నాడు. మ్యాచ్ కంటే ముందే హర్ష్ దూబే, మానవ్ సుతార్ లలో ఎవరికి ఛాన్స్ దక్కుతుందనే సస్పెన్స్ కు ఈ సెలెక్షన్ తో తెరపడింది. ఐపీఎల్ 2026 లో గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడిన మానవ్ సుతార్, ఇప్పుడు నేషనల్ టీమ్ లో తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. మానవ్ సుతార్ కు డొమెస్టిక్ క్రికెట్ లో అద్భుతమైన రికార్డ్ ఉంది. 23 ఏళ్ల ఈ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ ఇప్పటివరకు 29 ఫస్ట్ క్లాస్ మ్యాచ్ లు ఆడి ఏకంగా 129 వికెట్లు పడగొట్టాడు. దీనితో పాటు 25 లిస్ట్ ఏ మ్యాచ్ లు, 29 టీ20 మ్యాచ్ లలో కూడా పాల్గొన్నాడు. రీసెంట్ గా ముగిసిన ఐపీఎల్ 2026 సీజన్ లో గుజరాత్ టైటాన్స్ టీమ్ తరఫున 4 మ్యాచ్ లు ఆడి 2 వికెట్లు సాధించాడు. 2021 లో అక్షర్ పటేల్ డెబ్యూ చేసిన తర్వాత ఇండియా తరఫున టెస్ట్ క్యాప్ అందుకున్న ఫస్ట్ స్పెషలిస్ట్ స్పిన్నర్ గా మానవ్ సుతార్ రికార్డు సృష్టించాడు. ఇండియా టెస్ట్ టీమ్ మేనేజ్మెంట్ ప్రస్తుతం సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు ఒక పర్ఫెక్ట్ లాంగ్ టర్మ్ రీప్లేస్‌మెంట్ ను వెతికే పనిలో ఉంది. అందులో భాగంగానే మానవ్ సుతార్ కు ఈ గోల్డెన్ ఛాన్స్ ఇచ్చారు. ఈ



మ్యాచ్ లో మరొక ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ ఉంది. నవంబర్ 2010 తర్వాత ఇండియా ఆడుతున్న టెస్ట్ మ్యాచ్ ప్లేయింగ్ ఎలెవెన్ లో రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా ఇద్దరూ లేకపోవడం ఇదే ఫస్ట్ టైమ్. సీనియర్లు లేకుండానే యంగ్ టీమ్ తో అఫ్గాన్ ను ఢీకొట్టడానికి ఇండియా రెడీ అయింది. టాస్ గెలిచిన తర్వాత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ, ఇక్కడ ఎండ, ఉక్కపోత ఎక్కువగా ఉన్నాయని చెప్పాడు. మ్యాచ్ జరిగే కొద్దీ పిచ్ స్లో అయ్యే ఛాన్స్ ఉందని, అందుకే ఫస్ట్ బ్యాటింగ్ ఎంచుకున్నట్లు వివరించాడు. తన హోమ్ గ్రౌండ్ లో ఇండియాకు కెప్టెన్సీ చేయడం గొప్ప ప్రివిలేజ్ అని గిల్ సంతోషం వ్యక్తం చేశాడు. అఫ్గానిస్తాన్ కెప్టెన్ హష్మతుల్లా షాహిదీ మాట్లాడుతూ, తాము కూడా టాస్ గెలిస్తే బ్యాటింగ్ చేయాలని అనుకున్నట్లు తెలిపాడు. సవాల్ ను ఎదుర్కోవడానికి తమ టీమ్ రెడీగా ఉందని, కాబూల్ లో మంచి ప్రిపరేషన్ క్యాంప్ జరిగిందని చెప్పాడు. అఫ్గాన్ టీమ్ నుంచి నంగేయాలియా ఖరోటే టెస్ట్ డెబ్యూ చేశాడు.

## టెస్టు క్రికెట్ మ్యాచ్ మధ్యలో పింక్ బాల్..

రానున్న రోజుల్లో టెస్టు క్రికెట్‌లో ఐసీసీ కొత్త రూల్‌ని ప్రవేశపెట్టనుంది. కొన్ని కొన్ని సార్లు బ్యాడ్ లైట్ కారణంగా ఆ రోజులో వేయాల్సిన ఓవర్లు ఉన్నా మ్యాచ్‌ని ముందుగానే ముగిస్తుంటాం. ఇకపై ఇలాంటి పరిస్థితి వచ్చినప్పుడు పింక్ బాల్‌ని ఉపయోగించేలా ఐసీసీ కొత్త రూల్ తీసుకొస్తోంది. ఐసీసీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సమర్థించాడు. అక్టోబర్ 1 నుంచి ఈ రూల్ అమలులోకి రానుంది. ఐసీసీ తాజాగా క్రికెట్‌లో కొత్త



నిబంధన తీసుకొచ్చింది. టెస్టు క్రికెట్‌లో బ్యాడ్ లైట్ కారణంగా ఆటకు అంతరాయం కలిగినప్పుడు పింక్ బాల్‌ను ఉపయోగించాలని అని ఐసీసీ తీసుకున్న నిర్ణయాన్ని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్వాగతించాడు. ఈ కొత్త నిర్ణయం అక్టోబర్ 1 నుంచి అమలులోకి రానున్నట్లు ఐసీసీ పేర్కొంది. ఇటీవల జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో సాధారణ టెస్టు మ్యాచ్‌లలో కూడా పింక్ బాల్‌ను ప్రయోగాత్మకంగా ఉపయోగించేందుకు ఆమోదం లభించింది. మ్యాచ్ ఎప్పటిలాగా రెడ్ బాల్‌తోనే ప్రారంభమవుతుంది. ఒకవేళ మ్యాచ్ మధ్యలో బ్యాడ్ లైట్ కారణంగా ముందుగా దేని ముగించాల్సి ఉన్న సందర్భంలో పింక్ బాల్‌తో మిగిలిన ఓవర్లు పూర్తి చేసే అవకాశం ఉంటుంది. ఈ నిర్ణయం తనకు బాగా నచ్చిందని గౌతమ్ గంభీర్ అన్నాడు. “నాకు ఈ నిర్ణయం చాలా నచ్చింది. ఎందుకంటే మ్యాచ్‌కు ఫలితం వచ్చే అవకాశం ఉంటే దాన్ని ఎప్పుడూ కోల్పోకూడదని నేను నమ్ముతాను” అని చెప్పాడు. భారత్ 2027 ఫిబ్రవరి – మార్చిలో స్వదేశంలో ఆస్ట్రేలియాతో బోర్డర్ – గవాస్కర్ ట్రోఫీ ఆడనుంది. ఇందులో గువాహటి, రాంచీలో టెస్టులు జరగనున్నాయి. అక్కడ సాయంత్రం 4 గంటలకే చీకటి పడే అవకాశం ఉంటుంది. దీంతో ఓవర్లు కోల్పోయే పరిస్థితి రావొచ్చు. ఇదే విషయాన్ని గంభీర్ కూడా స్పష్టం చేశాడు. “వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించే చివరి టెస్టు మ్యాచ్ ఆడుతున్నారని ఊహించుకోండి. మీరు గెలవాల్సిన మ్యాచ్‌లో బ్యాడ్ లైట్ కారణంగా ఫలితం రాకపోతే ఎంత నిరాశగా ఉంటుంది. రెండు జట్లు అంగీకరిస్తే ఫలితం కోసం పింక్ బాల్ వేయడాన్ని నేను పూర్తిగా సపోర్ట్ చేస్తాను” అని గంభీర్ అన్నాడు. అయితే, ఒకే మ్యాచ్‌లో రెండ్ బాల్ నుంచి పింక్ బాల్‌కి మారడం కూడా ఆటగాళ్లకు సవాలుగా మారొచ్చని గంభీర్ అంగీకరించాడు. ఐదు రోజుల టెస్టు మ్యాచ్‌లో బ్యాడ్ లైట్ కారణంగా మ్యాచ్ సరిగ్గా జరగకపోతే అప్పుడు రెండు జట్లు బాధపడాల్సి వస్తుంది. దానికోసమే ఐసీసీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని తాను సమర్థిస్తున్నట్లు గంభీర్ చెప్పాడు.



## హీరో సుడిగాలి సుధీర్ "సుధీర్స్ జోకర్" సినిమా నుంచి హీరోయిన్ అయేషా బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్

సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "సుధీర్స్ జోకర్". బిగ్ బాస్ ఫేమ్ అయేషా ఈ చిత్రంతో హీరోయిన్ గా పరిచయం కాబోతోంది. ఈ చిత్రంలో అభిరామి, మురళీ శర్మ, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, విష్ణు ఓయ్, మురళీధర్ గౌడ్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని విజయ్ డొంకాడ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. పీఎస్ సునీల్ పుప్పాల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ రోజు హీరోయిన్ అయేషా పుట్టినరోజు సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు చెబుతూ బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. "సుధీర్స్ జోకర్" చిత్రంలో ఆమె షాలినీ అనే క్యారెక్టర్ లో తన అందంతో పాటు పర్ ఫార్మెన్స్ తో ప్రేక్షకుల్ని అలరించబోతోంది. రీసెంట్ గా హీరో సుడిగాలి సుధీర్ బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేసిన "సుధీర్స్ జోకర్" మూవీ బ్యాంగర్ కు హ్యూజ్ రెస్పాన్స్ దక్కింది. ఒక ఇంట్రెస్టింగ్ కమర్షియల్ ఎంటర్ టైనర్ చూడబోతున్నామనే ఎక్స్ పెక్టేషన్స్ ఈ మూవీపై ఏర్పడుతున్నాయి.

## "బాలన్ - ది బాయ్" సినిమా ట్రైలర్ రిలీజ్, జూన్ 19న గ్రాండ్ పాన్ ఇండియా థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న మూవీ

గ్రాండియర్ ఫిలిం మేకింగ్ కు మారుపేరైన కేవీఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిలింస్ సంయుక్తంగా నిర్మిస్తున్న సినిమా "బాలన్ – ది బాయ్". ఈ చిత్రానికి "ఆవేశం" ఫేమ్ డైరెక్టర్ జితూ మాధవన్ అందించిన స్క్రిప్ట్ తో "మంజుమ్మెల్ బాయ్స్" చిత్ర దర్శకుడు చిదంబరం దర్శకత్వం వహిస్తున్నారు. వెంకట్ కె నారాయణ, శైలజా దేశాయి ఫెన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా జూన్ 19న హిందీతో పాటు మలయాళం, తెలుగు, కన్నడ, తమిళంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇటీవలే "బాలన్ – ది బాయ్" మూవీ



ఫ్రాన్స్ లో జరిగే ప్రఖ్యాత కేన్స్ ఫిలిం ఫెస్టివల్ లో ప్రదర్శితమై, గ్లోబల్ వేదికపై మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. కేన్స్ ఫిలిం ఫెస్టివల్ లో ప్రదర్శితమైన ప్పటి నుంచి ఈ సినిమా గ్లోబల్ గా ఆడియెన్స్ దృష్టిని ఆకర్షిస్తోంది. తాజాగా "బాలన్ – ది బాయ్" మూవీ హిందీ ట్రైలర్ ను హీరో అజయ్ దేవగణ్, తమిళ ట్రైలర్ ను హీరో సూర్య, తెలుగు ట్రైలర్ ను హీరో నాగచైతన్య, కన్నడ ట్రైలర్ ను హీరో రాజ్ బి శెట్టి సోషల్ మీడియా ద్వారా రిలీజ్ చేశారు. ట్రైలర్ తమకు బాగా నచ్చిందని చెబుతూ మూవీ టీమ్ కు ఈ స్టార్ హీరోలు బెస్ట్ విశెస్ అందించారు. హ్యూమన్ ఎమోషన్స్, మనదైన నేటివిటీతో సాగిన ఈ ట్రైలర్ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటోంది. ఆసక్తి కలిగించే సస్పెన్స్, ఎమోషన్ వంటి అంశాలతో ట్రైలర్ ప్రేక్షకుల్ని ఆలోచింపజేస్తోంది. ప్రమోషనల్ కంటెంట్ తో "బాలన్ – ది బాయ్" సినిమా ఇప్పటికే పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ చిత్రాన్ని దర్శకుడు చిదంబరం తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాను రెండు తెలుగు రాష్ట్రాల్లో అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ డిస్ట్రిబ్యూట్ చేస్తుండటం విశేషం.



## రెండో రోజూ దూసుకెళ్తున్న రామ్ చరణ్ 'పెద్ది', రెండు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.181.8 కోట్లు కలెక్షన్స్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ 'పెద్ది' ప్రేక్షకుల నుంచి వస్తున్న యూనానిమస్ పాజిటివ్ రెస్పాన్స్ తో అద్భుతంగా దూసుకెళ్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే అద్భుతమైన రివ్యూలు, బలమైన మౌత్ పబ్లిసిటీని సొంతం చేసుకున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో, వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మించిన ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పించాయి. తొలి రోజు ప్రీమియర్లతో కలిపి ప్రపంచవ్యాప్తంగా రూ.135.36 కోట్ల గ్రాస్ వసూలు చేసిన 'పెద్ది', రెండో రోజూ అదే జోరును కొనసాగించింది. రెండో రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.46.44 కోట్ల గ్రాస్‌ను రాబట్టి, రెండు రోజుల మొత్తం వసూళ్ల రూ.181.8 కోట్లకు చేరింది. విశేషమేమిటంటే, రెండో రోజు వసూళ్లే పలు బ్లాక్‌బస్టర్ చిత్రాల తొలి రోజు కలెక్షన్లను మించి ఉండటం ఈ సినిమా బాక్సాఫీస్ సత్తాను చాటుతోంది. నార్త్ ఇండియాలో రెండో రోజు నుంచి గణనీయంగా పెరగడం విశేషం. సినిమాపై వస్తున్న పాజిటివ్ టాక్ వేగంగా వ్యాపిస్తుండటంతో హిందీ ప్రేక్షకులు కూడా చిత్రాన్ని విశేషంగా ఆదరిస్తున్నారు. ఈ స్పందన ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తూ, 'పెద్ది' పాన్ ఇండియా స్థాయిని మరింత బలపరుస్తోంది. రామ్ చరణ్ నటనపై ప్రేక్షకులు, విమర్శకుల నుంచి ప్రశంసల వర్షం కురుస్తోంది. ఆయన ట్రాన్స్‌ఫర్మేషన్, స్క్రీన్ ప్రెజెన్స్, భావోద్వేగాలతో కూడిన నటన అందరినీ కట్టిపడేశాయి. పలువురు ప్రేక్షకులు ఇది రామ్ చరణ్ కెరీర్‌లోనే అత్యుత్తమ నటనగా అభివర్ణిస్తున్నారు. ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'పెద్ది' అద్భుతంగా. ముఖ్యంగా ఉత్తర అమెరికాలో ఇప్పటికే 2 మిలియన్ డాలర్ల మార్క్‌ను దాటిన ఈ చిత్రం, ప్రస్తుతం 3 మిలియన్ డాలర్ల వైపు దూసుకెళ్తోంది. అంతర్జాతీయ ప్రేక్షకుల్లో కూడా సినిమాపై ఉన్న క్రేజ్‌ను ఇది స్పష్టంగా తెలియజేస్తోంది. వీకెండ్ అడ్వాన్స్ బుకింగ్స్ కూడా అద్భుతంగా నమోదవుతున్నాయి. చాలా కేంద్రాల్లో హౌస్‌ఫుల్ బోర్డులు కనిపిస్తుండగా, అనేక ప్రాంతాల్లో టికెట్లు వేగంగా అమ్ముడవుతున్నాయి. బలమైన మౌత్ పబ్లిసిటీ, భారీ అడ్వాన్స్ బుకింగ్స్, ప్రేక్షకుల అపూర్వ ఆదరణతో రాబోయే రోజుల్లో 'పెద్ది' మరింత సంచలనం సృష్టించేందుకు సిద్ధంగా ఉంది.

## సక్సెస్ ఫుల్ గా వంద రోజుల షూటింగ్ కంప్లీట్ చేసుకున్న విజయ్ దేవరకొండ "రణబాలి" సినిమా, సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్ కు రాబోతున్న క్రేజీ మూవీ

విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ "రణబాలి". ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై "రణబాలి" సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా "రణబాలి" సినిమా రూపొందుతోంది. తాజాగా "రణబాలి" సినిమా సక్సెస్ ఫుల్ గా వంద రోజుల షూటింగ్ పూర్తి చేసుకుంది. ఇటీవలే గండికోటలో షెడ్యూల్ చిత్రీకరణ జరిపారు. వారం రోజుల పాటు సాగిన ఈ షెడ్యూల్ లో విజయ్ దేవరకొండ, రశ్మిక మధ్య వచ్చే ఎమోషనల్ సీన్స్ రూపొందించారు. ఇప్పటిదాకా ఈ చిత్రానికి సంబంధించిన 90 పర్సెంట్ షూటింగ్ కంప్లీట్ అయ్యింది. ఔట్ పుట్ పూర్తి సంతృప్తికరంగా వచ్చిందని మేకర్స్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. రీసెంట్ గా విజయ్ దేవరకొండ బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేసిన గ్లింప్స్ లోని ఎలక్ట్రిఫైయింగ్ యాక్షన్ సీక్వెన్సులు మూవీ లవర్స్ ను బాగా ఆకట్టుకున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు ఉన్న "రణబాలి" సినిమా సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్ రిలీజ్ కు అన్ని సన్నాహాలు శరవేగంగా జరుగుతున్నాయి.



## అరుణాచల క్రియేషన్స్ బ్యానర్ మీద కృష్ణ కొమ్మలపాటి నిర్మాణంలో హర్ష్ రోషన్, నక్షత్ర జంటగా నటిస్తున్న 'తెల్ల కాగితం' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల

హర్ష్ రోషన్, నక్షత్ర జంటగా అరుణాచల క్రియేషన్స్ బ్యానర్ మీద కృష్ణ కొమ్మలపాటి నిర్మిస్తున్న చిత్రానికి 'తెల్ల కాగితం' అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఈ మూవీకి రమేష్ బండ్రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. 'కోర్ట్', 'బ్యాండ్ మేళం' వంటి విజయాల తరువాత హర్ష్ రోషన్ చేస్తున్న ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన అప్డేట్, టైటిల్, ఫస్ట్ లుక్‌ను తాజాగా రిలీజ్ చేశారు. యూత్ ఫుల్ ఎమోషనల్ లవ్ స్టోరీగా ఈ మూవీ రాబోతోందని టైటిల్, ఫస్ట్ లుక్‌ని చూస్తేనే తెలుస్తోంది. పోస్టర్‌లో హీరో హీరోయిన్లు కనిపిస్తున్న, చుట్టూ ఉన్న విజువల్స్ చూస్తే ఇదొక అందమైన ప్రేమ కథా చిత్రమని అర్థం అవుతోంది. ఆహ్లాదకరమైన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేసి సినిమా మీద అంచనాలు పెంచేశారు. నందు సవిరిగన ఈ చిత్రానికి కథ, కథనాన్ని, మాటల్ని అందించారు. లోతైన భావోద్వేగాలతో ఈ కథను రెడీ చేశారు. రమేష్ బండ్రెడ్డి ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం కాబోతోన్నారు. ఈ రొమాంటిక్ ఎంటర్టైనర్‌ను సరికొత్తగా మలిచి ప్రేక్షకులకు ఓ కొత్త ఎక్స్‌పీరియెన్స్‌ను ఇవ్వాలని దర్శకుడు ప్రయత్నిస్తున్నారు. సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ విజయ్ బుల్గానిన్ ఈ సినిమాకి సంగీతాన్ని అందిస్తున్నారు. ప్రముఖ సినిమాటోగ్రఫర్ కె.వి. గుహన్ కెమెరామెన్‌గా పని చేస్తున్నారు. కార్తీక శ్రీనివాస్ ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు. అద్భుతమైన తారాగణంతో, గొప్ప సాంకేతిక బృందం ఆధ్వర్యంలో అందమైన ప్రేమ కథగా 'తెల్ల కాగితం' ప్రేక్షకుల ముందుకు రానుంది.



## కళ్యాణి మాలిక్, గీతా మాధురి ఆధ్వర్యంలో జూన్ 12న గ్రాండ్‌గా "ది నైట్ ఆఫ్ ది స్టార్స్" మ్యూజికల్ ఈవెంట్

సీన్ సెటర్స్, అసెంబ్లీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక సంగీత వేడుక "ది నైట్ ఆఫ్ ది స్టార్స్" జూన్ 12, 2026న హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ అసెంబ్లీలో జరగనుంది. ప్రముఖ సంగీత దర్శకుడు కళ్యాణి మాలిక్, ప్రముఖ నేపథ్య గాయని గీతా మాధురి, అలాగే సాకేత్, వినూత్న, కశ్యప్, అదితి , భార్గవి తమ అద్భుతమైన సంగీత ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించనున్నారు. ప్రముఖ యూట్యూబర్ నిఖిల్ విజయేంద్ర సింహ ఈ వేడుకని ఆర్గనైజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో నిఖిల్ విజయేంద్ర సింహ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. మమ్మల్ని సపోర్ట్ చేయడానికి వచ్చిన అందరికీ ధన్యవాదాలు. మనందరం చిన్నప్పటి నుంచి పాటలను మధురమైన జ్ఞాపకాలుగా, నోస్టాల్జిక్ ఫీలింగ్స్‌గా ఆస్వాదిస్తూ పెరిగాం. ఆ నోస్టాల్జిక్ పాటలను మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. దాదాపు 23 సంవత్సరాల తర్వాత కళ్యాణి మాలిక్ గారి ఆధ్వర్యంలో ఈ మ్యూజికల్ లైవ్ షో జరగడం చాలా సంతోషంగా ఉంది. జూన్ 12న అసెంబ్లీ వేదికగా ఈ కార్యక్రమం నిర్వహించబడుతుంది. మాకు ఈ వేదికను అందించిన శ్రీకాంత్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. అలాగే కళ్యాణి మాలిక్ గారికి, గీతా మాధురి గారికి, సాకేత్ గారికి, వినూత్న గారికి, అదితి గారికి ధన్యవాదాలు. వీరందరూ కలిసి ఈ వేడుకను మరింత గ్రాండ్‌గా తీర్చిదిద్దుతున్నారు. మీరు అందరూ ఈ కార్యక్రమానికి హాజరై, మాతో కలిసి ఈ సంగీత వేడుకను ఆస్వాదించాలని కోరుకుంటున్నాం. టికెట్ల కోసం డిస్ట్రిక్ట్ యాప్, మేము అందించిన ఫోన్ నంబర్లను కూడా సంప్రదించలని కోరుతున్నాం. కళ్యాణి మాలిక్ మాట్లాడుతూ... అందరికీ నమస్కారం. నా మొదటి సినిమా ఐతే విడుదలైనప్పుడు ఎంత ఆనందంగా, ఉత్సాహంగా ఫీలయ్యానో, ఈ షో నిర్వహిస్తున్నప్పుడు కూడా అదే భావన కలుగుతోంది. మా సింగర్స్ అందరితో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉంది. జూన్ 12న జరిగే ఈ మ్యూజికల్ ఈవెంట్‌కు తప్పకుండా అందరూ రావాలని కోరుకుంటున్నాను. ఈ షో ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుంది. గాయని గీతా మాధురి మాట్లాడుతూ... అందరికీ నమస్కారం. కళ్యాణి మాలిక్ గారు మొదటిసారిగా నిర్వహిస్తున్న ఈ షో గురించి నాకు చాలా కాల్స్ వస్తున్నాయి. అందరూ ఈ కార్యక్రమం గురించి ఆసక్తిగా అడుగుతున్నారు. కళ్యాణి గారి పాటలకు ఎంతో మంది అభిమానులు ఉన్నారు. నాకు లైవ్ మ్యూజిక్ షోలు అంటే చాలా ఇష్టం. అలాంటి ప్రత్యేకమైన కార్యక్రమంలో భాగం కావడం చాలా ఆనందంగా ఉంది. అసెంబ్లీ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఈ కార్యక్రమం జరగడం మరో ప్రత్యేకత. ఈ వేదిక చాలా అద్భుతంగా ఉంది. టికెట్లు డిస్ట్రిక్ట్ యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. అలాగే నిర్వాహకులు ఇచ్చిన ఫోన్ నంబర్ల ద్వారా లేదా సోషల్ మీడియా ద్వారా కూడా సంప్రదించవచ్చు. కళ్యాణి మాలిక్ గారి పాటలను ఈ వేదికపై పాడబోతుండటం నాకు ఎంతో ఆనందంగా ఉంది. ఈ మీడియా సమావేశంలో గాయకులు, నిర్వాహకులు, కార్యక్రమానికి సంబంధించిన ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.



## పెద్దికి ఊహించని విజయం

### దర్శక,నిర్మాతల ఆనందం

'మేం నమ్మిన విషయాన్ని ప్రేక్షకులు నిజం చేశారు. స్ఫూర్తిదాయకమైన 'పెద్ది' సినిమాని తమ పిల్లలతో కలిసి కుటుంబాలు ఆస్వాదిస్తున్నాయి. రానున్న పది రోజుల్లో 'పెద్ది' మరింత పెద్ద విజయంగా నిలుస్తుంది' అన్నారు బుచ్చిబాబు సానా. ఆయన దర్శకత్వంలో... రామ్‌చరణ్ కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం 'పెద్ది'. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మించారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సమర్పించాయి. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా బాక్సాఫీస్ ఛాంపియన్ పేరుతో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించింది చిత్రబృందం. దర్శకుడు మాట్లాడుతూ 'చాలా పెద్ద విజయం




ఇది. ముందస్తు ప్రదర్శనల నుంచే నా ఫోన్ ఆగకుండా మోగుతోంది. నా తొలి చిత్రం 'ఉప్పెన' కంటే పది రెట్లు మించిన స్పందన వచ్చింది. సినిమా చూసినవాళ్లంతా ఎంతో స్ఫూర్తి పొందామని చెబుతున్నారు. రామ్‌చరణ్ పడిన కష్టాన్ని అందరూ గుర్తించారు. ఆయన లేకపోతే ఈ సినిమా లేదు' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల ఆదరణతో అద్భుతంగా దూసుకుపోతోంది 'పెద్ది' చిత్రం. తొలి రోజే రూ.135 కోట్లకుపైగా వసూళ్లు సాధించింది. రామ్‌చరణ్ కెరీర్‌లోనే అత్యుత్తమైన సినిమాగా నిలుస్తూ, రికార్డ్ స్థాయిలో వసూళ్లు సాధిస్తోంది. నిర్మాత రవిశంకర్ యలమంచిలి మాట్లాడుతూ 'తెలుగులో ఇప్పటివరకూ చూడని ఓ కొత్త రకమైన క్రీడా నేపథ్యంలోని సినిమా ఇది. పిల్లలకు ఎంతగానో ఉపయోగపడే చిత్రం. అందుకే ఇంటిల్లిపాదీ వెళ్లి చూడాలని కోరుతున్నాం. దర్శకుడు బుచ్చిబాబు రాసిన కథ, అద్భుతమైన రామ్‌చరణ్ నటన కారణంగా ఈ సినిమా రికార్డు స్థాయిలో వసూళ్లు సాధిస్తోంది' అన్నారు.

Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 6-3-553,Flat no .G2, CLassic Court Ane A, opp:NKM Grand hotel, Erramanzil Colony, Somajiguda, Hyderabad, Telangana-500082.Editor : Sudheer kumar katepally ph: 9000657700 PRGI NO: TGTEL/26/A2380